www.visalaandhra.com VISALAANDHRA Regd No.VJ/042/2015-17 పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం Dwaraka .4.00

SUNDAY
విశాలాంధ్ర
స్థాపితం : 1952
అక్షరాక్షరం అభ్యుదయం
సంపుటి : 66, సంచిక : 197
ఆదివారం 07-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ



లైంగిక వేధింపులపై

నారీ భేరీ...

- హాలీవుడ్ నటి అసిఫామిలాన్ 'మీటు' ఉద్యమం
- భారత్‌లో 'టైమ్ ఈజ్' యాప్
- గతి తప్పిన గజల్ బాధితురాలికి ఇదే స్ఫూర్తి

కూలీల నుంచి సెలబ్రిటీల దాకా ప్రదేశాలు వేరైనా, ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొనే లైంగిక వేధింపులు ఒక్కటే...అయితే ఇవి ఒక్కొక్కచోట ఒక్కో రకంగా ఉన్నాయి. ప్రపంచంలో... మనదేశంలో... తెలుగు రాష్ట్రాల్లో.... రోజూ ఇవే వార్తలు వినవస్తున్నాయి. ఇందుకు ప్రపంచంలో ఏ ప్రాంతమూ మినహాయింపు కాదు, ఎవరూ మినహాయింపు కాదనీ చెప్పవచ్చు....

7 లో

Sunday Special

యువతే ఓ అద్భుతం...



- లక్ష్య సాధనకు ఏకాగ్రత ముఖ్యం
- ఆదర్శ సాధనకు శ్రమించాలి
- మనకు మనమే గొప్పవారమని భావించాలి
- ఇవి మహోన్నతుల సందేశాలు

యువత ఎటువెళ్లాలో,,ఏం చేయాలో తెలియని స్థితి. వారి మనస్తత్వాన్ని బట్టి ఎన్నుకోవాలా....డిమాండ్ వైపు పరుగులుతీయాలా....తమలోని శక్తిని వారే అంచనా వేసుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న యువత... యువతకు 'యూత్ ఐకాన్' వివేకానంద బోధనలు అవసరం. యువతలోని వివేకాన్ని, ఉత్తేజాన్ని కలిగించి తట్టిలేపేందుకు వివేకానంద పలుసూచనలు, బోధనలు చేశారు.

7 లో

అత్యున్నత ప్రతిభకు

అరుదైన ఆహ్వానం



- విజయవాడ యువకుడు నాగశ్రావణ్‌కు ఐక్యరాజ్యసమితి ఆహ్వానం
- విజయవాడ నీడ్స్ యూ రూపకర్త
- లక్ష్యం, దార్శనీకత నుంచి క్రియా సాఫల్యత

- వివరాలు 7 లో

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయ నూతన భవనం నేడు ప్రారంభం

జాతీయస్థాయి నేతల రాక

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి గొల్లపూడిలో నూతనంగా నిర్మించిన రాష్ట్ర కార్యాలయం ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. భవనాన్ని ఆకర్షణీయమైన రంగులతో తీర్చిదిద్దారు. గొల్లపూడిలోని వివిధ ప్రాంతాల్లో స్వాగతతోరణాలను ఏర్పాటు చేశారు. జాతీయ స్థాయి నేతలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కార్మికశ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ భవనానికి ప్రముఖ కార్మికనేత, దివంగత

- మిగతా 2 లో

లాలూకు మూడున్నరేళ్ల జైలు 2 లో

నదులన్నీ అనుసంధానిస్తా

- నెల్లూరు, చెన్నై, తిరుపతి ఇండస్ట్రియల్ కారిడార్
- పరిశ్రమలతో ఉద్యోగావకాశాలు
- జన్మభూమి సభలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో : రాష్ట్రంలోని నదులన్నీ అనుసంధానం చేసి కరవురహిత రాష్ట్రంగా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. నెల్లూరు రూరల్ మండలంలోని కోడూరుపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన 'జన్మభూమి- మా ఊరు' గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి-కృష్ణా నదులను అనుసం ధానం చేశామని, గోదావరి-పెన్నా నదులతో పాటు వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా.. నదులను కూడా అనుసంధానం చేసి రాష్ట్రాన్ని సస్య శ్యామలం చేస్తామని తెలిపారు. గత జన్మభూమిల కంటే భిన్నంగా 5వ విడత జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అదే రోజు ఆన్‌లైన్ చేసి తక్షణమే పరిష్కరించేవిధంగా చూస్తున్నామన్నారు. అభివృద్ధికి నాంది మౌలిక సదుపాయాలు కల్పించడమేనని చెప్పారు. 1000 కిలో మీటర్ల తీరప్రాంతం ఉందని ఆర్థిక అభివృద్ధి సాధించుకోవాలన్నారు. ఫైబర్‌గ్రిడ్ ద్వారా ప్రతి ఇళ్లు విజ్ఞాన ఖని అవుతుందన్నారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రమైన గ్రామంగా ఉంచుకోవాలన్నారు. 474 పంచాయతీలత భవనాలు కట్టించామన్నారు. నూరుశాతం పంచాయతీ భవనాలు నిర్మిస్తామన్నారు. 4,138 అంగన్‌వాడీ భవనాలు కట్టించామన్నారు. కాన్వెంట్లుకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు

- మిగతా 2 లో



నెల్లూరు జిల్లా కోడూరుపాడు గ్రామసభలో మహిళలకు చెక్కులు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

విజయవాడలో రేపటి నుంచి

సీపీఐ జాతీయ సమితి సమావేశాలు

- దేశ రాజకీయ పరిస్థితులపై చర్చ
- 10న జింఖానా గ్రౌండ్స్‌లో బహిరంగసభ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన వనజ, జల్లి విల్సన్, దోనేపూడి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : భారత కమ్యునిస్టుపార్టీ (సీపీఐ) జాతీయ సమితి సమావేశాలు ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ విజయవాడలో నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. సీపీఐ అగ్రనేతలు సురవరం సుధాకరరెడ్డి, డి రాజా, కార్యదర్శివర్గ సభ్యులతోపాటు 29 రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర పార్టీ కార్యదర్శులు ఈ సమావేశాలకు హాజరవుతారని ఆయన వివరించారు. చివరిరోజైన 10వ తేదీన జింఖానాగ్రౌండ్స్‌లో బహిరంగసభ జరుగుతుం దన్నారు. దాసరిభవన్‌లో

- మిగతా 2 లో

మెక్సికో సరిహద్దు గోడ విస్తరణకు 18 బిలియన్లు

ట్రంప్ పాలన యంత్రాంగం నిర్ణయం



వాషింగ్టన్ : మెక్సికోతో అమెరికా సరిహద్దు గోడ మరో 505కి.మీ. విస్తరణకుగాను రానున్న పదేళ్ల కాలంలో 18బిలియను డాలర్ల మొత్తాన్ని వెచ్చించాలని ట్రంప్ పాలన యంత్రాంగ నిర్ణయించింది. 2027నాటికి గోడ నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్ణయించింది. కస్టమ్స్, సరిహద్దు భద్రత విభాగం అభ్యర్థన మేరకు ఈగోడ నిర్మాణానికి ట్రంప్ పచ్చజెండా ఊపారు. తాజాగా విస్తరణ ప్రతిపాదనతో గోడ మొత్తం పొడవు 1,552కి.మీ. అవుతుంది. దీంతో గోడ నిర్మాణం సరిహద్దు సగానికి పూర్తి చేసినట్లవుతుందని ఈవ్యవహారంతో పరిచయం ఉన్న అధికారి ఒకరు తెలిపారు. ఈగోడ నిర్మాణం విషయమై అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే ట్రంప్ ప్రకటనలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

పాకిస్తాన్ విచక్షణ మేరకే తదుపరి నిర్ణయం

అమెరికా వెల్లడి



వాషింగ్టన్ : పాకిస్తాన్ విచక్షణ మేరకే తదుపరి నిర్ణయం తీసుకుంటామని అమెరికా వెల్లడించింది. ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్, హక్కానీ తదితర ఉగ్రవాద మూకలకు వ్యతిరేకంగా తాము జరిపే పోరాటంలో కలసి రావడం లేదంటూ పాకిస్తాన్‌కు ఇవ్వవలసిన మిలటరీ సాయాన్ని నిలిపివేసిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్‌తో ఎలా వ్యవహరించాలన్న విషయంలో ఎదుట అనేక అవకాశాలున్నాయని శ్వేతసౌధం వెల్లడించింది. ఏ అవకాశాన్ని ఎంచుకుంటుందనేది పాకిస్తాన్ విచక్షణకే విడిచెపెట్టామని ట్రంప్ పాలన యంత్రాంగంలోని సీనియరు అధికారి ఒకరు ఈమేరకు తెలిపారు. ఈవిషయంలో అమెరికా వైఖరిని ఏఒక్కరూ సందేహపడాల్సిన అవసరం లేదని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఆయన అన్నారు. నాటోయేతర మిత్రపక్ష హోదాను పాకిస్తాన్‌కు లేకుండా చేయాలని కొందరు విధాన నిర్ణేతలు సూచిస్తున్నారు.

సోషలిస్టు పంథాలో నవ చైనా నిర్మాణం

- జిన్‌పింగ్ ఉద్ఘాటన
- సామాజిక విప్లవాలతోనే విజయాలు
- కార్యకర్తలకు శాస్త్రీయ అవగాహన అవసరం



బీజింగ్ : సోషలిస్టు పంథాలో నవ చైనా నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ ఉద్ఘాటించారు చైనా లక్షణాలతో సోషలిజం అన్వయింపుకు, అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యతనీయాలన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి, పార్టీ సభ్యులుగా ఎన్నికైన వారితో జరిగిన వర్క్‌షాపును ప్రారంభిస్తూ జిన్ పింగ్ ఈమేరకు తెలిపారు. ఈ వర్క్‌షాపుకు ప్రావిన్షియల్, మంత్రి స్థాయి ప్రతినిధులు కూడా హాజరయారు. నవశకానికి చైనా లక్షణాలతో సోషలిజంపై జిన్‌పింగ్ చింతన అనే అంశం అమలు ప్రాధాన్యతగా వర్క్‌షాపులో అధ్యయనం జరిపారు. పార్టీ, దేశ సుపరిపాలన దృఢంగా నిలుపడంలో ప్రతి ఒక్క కార్యకర్త సేవలూ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాజకీయ అవగాహనను పెంచుకోవాలని హితవు పలికారు. చారిత్రక అవగాహనను కలిగి ఉండాలన్నారు. సైద్ధాంతిక ఆలోచన ధోరణిని అనుసరించాలన్నారు. స్వీయ జ్ఞానసముపార్జన ద్వారా మేథపరమైన లక్ష్యాలను సాధించాలన్నారు. తద్వారా ప్రధాన సిద్ధాంతాల సారాంశాన్ని, వాటి అమలు విధానాలను అవగాహన చేసుకునేందుకు వీలవుతుందన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు సాధించిన గొప్ప సామాజిక విప్లవ విజయాల కొనసాగింపుకు చైనా లక్షణాలతో సోషలిజం అన్వయం, ఆచరణ అత్యంత కీలకమని ఆయన పునరుద్ఘాటించారు. అంతిమ విజయానికి ముందు సామాజిక విప్లవ పరివర్తన అవసరమన్న వాస్తవాన్ని చరిత్ర నుంచి గ్రహించగలుగుతామన్నారు. ఏ మార్గంలో పయనించామనే అవగాహన ఉన్నపుడు అధిగమించిన సమస్యలూ స్ఫురణకు వస్తాయన్నారు.



ఇతరులతో పోల్చి చూసుకుంటూనే నిర్దేశించుకున్న గమ్యం దిశగా సాగిపోవాలన్నారు. ఎక్కడ నుంచి వచ్చాము...ఏ దిశగా పురోగమిస్తున్నామనేది సదా అవగాహనలో ఉంచుకోవాలన్నారు. చైనా లక్షణాలతో సోషలిజం అనే ఆలోచన లేదా సిద్ధాంతమనేది ఎక్కడో ఆకాశం నుంచి ఊడి పడలేదన్నారు. గత 40సంవత్సరాల సంస్కరణల అమలు ఫలితమన్నారు. ముఖ్యంగా 70సంవత్సరాల క్రితం చైనా పీపుల్స్ రిపబ్లిక్ స్థాపించి నది అదిగా ఆచరిస్తూన్న విలువల విజయంగా ఆయన అభివర్ణిం చారు. అంతేకాక, 97సంవత్సరాలుగా చోటు చేసుకున్న గొప్పగొప్ప సామాజిక విప్లవాల సారాంశంగా చెప్పారు. ఈక్రమంలో సీపీసీ నాయకత్వంలో గడచిన 170సంవత్సరాలుగా అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి చైనా పరివర్తన చెందిన క్రమాన్ని ఆయా దశల్లో నిక్షిప్తమైన అనుభవాలను కార్యకర్తలు ఆకళింపు చేసుకోవాలన్నారు. వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూనే అభివృద్ధి చెందిన విధానాన్నీ తెలుసుకోవాలన్నారు. మొత్తంగా గత 5,000ల సంవత్సరాల్లో చైనా నాగరికత పురోగమించిన విధానాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తొలి అడుగు వేయడం క్లిష్టమని ఆయన అభిప్రాయపడ్డారు.

చైనాలో శాస్త్రీయ సోషలిజం విజయం మార్క్సిజానికి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. చైనా లక్షణాలతో సోషలిజం పతాకాన్ని సమున్నతంగా నిలుపడం ద్వారానే నవ శకంలో చైనా చారిత్రక ప్రాధాన్యతను తెలుసుకోగలుగుతారన్నారు. నిజ ఆకాంక్షల సాధనకు పరిశ్రమించే క్రమంలో కమ్యూనిస్టులమని, విప్లవవాదులమనీ ఏ క్షణాన విస్మరించరాదన్నారు. ఎట్టి ఆటంకాలు ఎదురైనా విప్లవ స్ఫూర్తిని నిలబెట్టుకోవాలన్నారు. గత విజయాలతో భవిష్యత్తు కూడా ఆనందకరమనే భావన కూడదన్నారు. గతం గొప్పగా ఉంది కదాని భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అపోహకు లోనుకాకూడదన్నారు. ప్రజలే న్యాయనిర్ణేతలుగా పరీక్షకు హాజరయే అభ్యర్థుల తరహాలో పార్టీ కార్యకర్తల పని విధానం ఉండాలని జిన్ పింగ్ తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్తా ఇదే స్ఫూర్తిని, ఒరవడిని అందిపుచ్చుకోవాలన్నారు. అవసరమైన స్థాయిలో బలోపేతం కాగందులకు స్వీయ సంస్కరణలు అమలు జరిపే తెగువ పార్టీకి ఉందన్నారు. స్వీయ పాలన నిర్మాణాత్మకంగా కొనసాగించడమే కమ్యూనిస్టు పార్టీ విశిష్ట లక్షణంగా ఆయన వివరించారు. దేశ సుదూర లక్ష్యాలను, ప్రజల కలలు సాకారం చేయడంలో పార్టీ నిర్మాణ ప్రక్రియ అత్యంత ముఖ్యభూమిక పోషిస్తుందన్నారు. మార్క్సిస్టు పాలన అందించాలన్న కృతనిశ్చయానికి కట్టుబడి, అత్యున్నత ప్రమాణాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతి, అధికార దుర్వినియోగం, విలాసాలకు వ్యతిరేకంగా నిరంతర క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈవర్క్‌షాపుకు సీపీసీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు లి కెకియాంగ్ అధ్యక్షత వహించారు. సీపీసీ కేంద్ర కమిటీ సభ్యులు లీ జాన్షు, వాంగ్‌యాంగ్, వాంగ్ హునింగ్, జావో లీజీ, హాన్ జెంగ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అమెరికా ఒత్తిడికి తలొగ్గం : ఇరాన్



ఐక్యరాజ్యసమితి: అమెరికా ఎన్ని విధాలుగా తమ మీద ఒత్తిడి తెచ్చినప్పటికీ తలొగ్గేది లేదని ఇరాన్ స్పష్టం చేసింది. తాజా పరిణామాలపై ఐక్యరాజ్యసమితి భద్రత మండలి సమావేశమైన సందర్భంగా ఐక్యరాజ్యసమితికి ఇరాన్ దూత ఘొలామలీ ఖోషేరూ మాట్లాడుతూ తమను ఎలాగైనా లొంగదీసుకోవాలని అమెరికా కుట్రపన్నుతోందన్నారు. తమ విషయంలో అమెరికా చెప్పుడు మాటలకు ప్రాధాన్యనివ్వడం ద్వారా భద్రత మండలి నైతిక, రాజకీయ, చట్టబద్ధ అధికారాలను, విశ్వసనీయతనూ కోల్పోయిందని ఆగ్రహించారు.

రౌహనీ పాలనలో ఇరాన్ పౌరులు మానవహక్కులు, ప్రాథమిక హక్కులను కోరుకుంటున్నారని ఐక్యరాజ్యసమితికి అమెరికా రాయబారి నిక్కీ హేలీ పేర్కొన్నారు. ఇరాన్ పరిస్థితిపై అత్యవసరంగా సమావేశమైన ఐక్యరాజ్యసమితి భద్రత మండలి భేటీ జరిగింది. ఈ భేటీలో హేలీ మాట్లాడుతూ (ఇరాన్) ఏం చేస్తుందా అని ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. ఇరాన్ వాదన ఆలకించాలని మండలిలో శాశ్వత సభ్యత్వం గల ఐదు దేశాల్లో ఫ్రాన్స్, రష్యా, చైనాలు పట్టుపట్టాయి. ఇరాన్ కారణంగా ఇప్పటి కిపుడు అంతర్జాతీయ సమాజ శాంతి, భద్రతలకు ముంచు కొచ్చిన ప్రమాదమేమీ లేదని తెలిపాయి. ఇరాన్ తాజా పరిస్థితిపై సమీక్ష జరిపేందుకు 15 సభ్యదేశాల భద్రత మండలి తగిన వేదిక కాదన్నాయి. అమెరికా అభ్యర్థనపై ఈ సమావేశం జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

దట్టమైన మంచుకు పగులుతున్న అద్దాలు

న్యూయార్క్ : 'బాంబు తుపాను'తో అమెరికాలో భీకర పరిస్థితులు ఏర్పడ్డాయి. తూర్పు అమెరికా గడ్డకట్టించే చలితో వణుకుతోంది. దట్టమైన మంచు కారణంగా ఇళ్లకు, కార్యాలయాలకు అమర్చిన గాజు అద్దాలు, బల్బులు పగిలిపోతున్నాయని స్థానికులు ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంటున్నారు. ఈ ఫొటోలన్నీ ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారాయి. దట్టమైన మంచుకు మా ఇంటి అద్దం సగం పగిలిపోయింది, మంచుకి మా నాన్న కారు అద్దం కూడా పగిలిపోయింది.. అంటూ ఎంతోమంది తమ ఇంటి, ఆఫీసులో పగిలిన అద్దాల చిత్రాలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంటున్నారు. కనెక్టికట్, మైనె, మసాచుసెట్స్, న్యూహ్యాంప్ షైర్, న్యూజెర్సీ, న్యూయార్క్, రోడ్ ఐలాండ్, వర్జీనియాలో కనీసం అడుగులోతు మంచు పేరుకుపోయింది. దీంతో వాహనాలు కదల్లేని పరిస్థితి. మసాచుసెట్స్‌లోని పలు ప్రాంతాల్లో మంచుతో కూడిన వరద పోటెత్తింది. దీంతో విద్యుత్తు సౌకర్యం నిలిచిపోయింది.

సీపీఐ జాతీయ సమితి సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశాల్లో రాష్ట్రంలో, దేశంలో నెలకొన్న రాజకీయపరిస్థితులపై లోతుగా విశ్లేషించి నివేదికను రూపొందిస్తామన్నారు. కేరళలోని కొల్లంలో ఏప్రిల్ 25 నుంచి 29 వరకూ ఐదు రోజులపాటు జరిగే సీపీఐ 23వ మహాసభల్లో ఈ నివేదికపై చర్చించి ఆమోదం తెలియచేస్తారు కనుక విజయవాడలో జరిగే జాతీయ సమితి సమావేశాలకు ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. జాతీయ మహాసభలో ఏయే అంశాలు చర్చించాలి.. ఎలాంటి రాజకీయ విధానాన్ని అవలంభించాలి.. మూడేళ్ల కాలంలో సీపీఐ ఇతర వామపక్ష పార్టీలు, ప్రజాతంత్రశక్తులతో కలసి ఏయే ఉద్యమాలు నిర్వహించింది.. దాని ఫలితాలేమిటి?.. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ఏమిటి? వంటి అంశాలన్నింటిపై మూడ్రోజుల సమావేశంలో చర్చించి విశ్లేషణతో కూడిన నివేదికను రూపొందిస్తామన్నారు. దీనిని దేశంలోని అన్ని రాష్ట్ర కమిటీలకు పంపిస్తామని, ఆయా రాష్ట్రాలు నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో దీనిపై చర్చిస్తాయన్నారు. అంతిమంగా చర్చల అనంతరం ఈ నివేదికను జాతీయ మహాసభల్లో ఆమోదిస్తామని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి పెనుప్రమాదం పొంచి ఉందన్నారు. సాక్షాత్తు కేంద్రమంత్రులే అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అవసరంలేదు, దానిని మార్చాలని బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తాయన్నారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్రమంత్రులు, టీడీపీ-బీజేపీ ఎంపీలు శుక్రవారం ప్రధాని మోడీని కలసి ఇప్పటికే మూడున్నరేళ్లు గడిచిపోయాయి.. మళ్లీ ఎన్నికలొస్తున్నాయి.. ప్రజలకు ఏమి చెప్పాలో అర్థం కావడంలేదు.. కనుక ఇప్పటికైనా రాష్ట్రానికి న్యాయం చేయాలని మెమోరాండం ద్వారా కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీనిపై మోడీ స్పందిస్తూ ఆందోళన వద్దు.. ఏపీని నేను చూసుకుంటానని భరోసా ఇవ్వడం మరింత విడ్డూరంగా ఉందన్నారు. విభజన హామీల్లో ఏఒక్కదానిని ఇంతవరకూ నెరవేర్చని కేంద్రాన్ని నిలదీసేందుకు సీఎం చంద్రబాబు సహా ఎంపీలు ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడంలేదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ప్యాకేజీలను కూడా సరిగా ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రికి కూడా ప్రధాని అప్పాయింట్‌మెంట్ ఇవ్వలేదంటే ఏపీకి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థమవుతోందన్నారు. చిన్న విషయమై గొడవ చేసిన టీఆర్ఎస్ ఎంపీలను చూసి సిగ్గుపడాలని, వాళ్లని స్ఫూర్తిగా తీసుకొని పార్లమెంటును స్తంభింపచేయాలన్నారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

దళితులు ఇబ్బందులు పడే గ్రామాల్లో జన్మభూమి నిర్వహించాలి : రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. విజయనగరంజిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలోని మోదవలస గ్రామంలో దళితులు జన్మభూమి కార్యక్రమంలో అర్జీ ఇవ్వడానికి వెళితే వారిపై అధికారపార్టీకి చెందిన వారు దాడికి పాల్పడడం శోచనీయమన్నారు. ఇటీవలే దళిత మహిళను వివస్త్రను చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కర్నూలుజిల్లా మంత్రి భూమా అఖిలప్రియ నియోజకవర్గంలోని నక్కలదిన్నె గ్రామంలో దళితులను సాంఘికంగా వెలి వేసి విద్యుత్, తాగునీరు సరఫరా నిలిపివేయడమే కాకుండా అంగడుల్లో సరుకులు కూడా లభించకుండా చేయడం దారుణమన్నారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమాల్లో ఊకదంపుడు ప్రసంగాలుచేసే ముఖ్యమంత్రి దృష్టికి ఈ ఘటనలు రావడంలేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే గరగపర్రు, మోదవలస, నక్కలదిన్నె గ్రామాలకు వెళ్లి అక్కడ జన్మభూమి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఇటువంటి అన్ని అంశాలపైన జాతీయ సమితి సమావేశాల్లో చర్చించనున్నట్లు రామకృష్ణ వెల్లడించారు. విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

నూతన భవనం నేడు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)



'జోశ్యభట్ల సత్యనారాయణ భవన్'గా నామకరణం చేశారు. తూర్పుగోదావరి జిల్లాలోని ఏనుగులమహాల్ గ్రామంలో సనాతన బ్రాహ్మణ వైదిక కుటుంబంలో జోశ్యభట్ల సత్యనారాయణ జన్మించారు. ఆయన తండ్రి సుబ్బయ్య ఉపాధ్యాయునిగా పనిచేశారు. జోస్యభట్ల పూర్వీకులు తాత ముత్తాతలు వేద పారాయణ చేసే ఘనాపాటీలు. ఆయన 1929-30 సంవత్సరాల ప్రాంతాలలో సెకండ్ ఫారమ్ చదువుతూ, ఉప్పు సత్యాగ్రహ ప్రభావంతో నాయకుల ఉపన్యాసాలు విని దేశభక్తి భావాలను అలవరచుకున్నారు. కాకినాడలో చదువుకునే రోజుల్లోనే 'మహాత్మాగాంధీ పద్ధతుల ద్వారా స్వరాజ్యం రాదు.. సోషలిస్టు సిద్ధాంతాలు అమలు జరిగితేనే దేశం స్వాతంత్ర్యం సంపాదించి ప్రజలు సుఖపడతారు' అని మిత్రులతో తరచూ చెబుతుండేవారు. కాకినాడలో 1930 సంవత్సరంలో జరిగిన యువజన మహాసభలతో ఆయనలో పూర్తిగా సోషలిస్టు భావాలు నాటుకున్నాయి. జోశ్యభట్ల 1938లో భారతకమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఆయన 1937 నాటికి కృష్ణాజిల్లా గుడివాడలో రైస్‌మిల్లులు, ప్రింటింగ్ ప్రెస్ మున్సిపల్ కార్మికులను సంఘటిత పరచి యూనియన్ల నిర్మాణం చేశారు. మునగాలలో జరిగిన జమీందారీ వ్యతిరేక సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఆ సమయంలో అరెస్టయి మూడు సంవత్సరాల పాటు వివిధ జైళ్లలో గడిపి చివరకు రాజమండ్రి జైలులో సంవత్సరం పాటు శిక్ష అనుభవించారు.

రాజమండ్రి జైలులోనే అల్లూరి సీతారామరాజు సహచరుడు మల్లు దొరతో పరిచయం ఏర్పడింది. జైలు శిక్ష అనంతరం తిరిగి గుడివాడ వచ్చి పార్టీ కార్యకలాపాలలో పాల్గొన్న జోశ్యభట్లపై పోలీసులు కేసు బనాయించారు. ఈ కేసే రాష్ట్రంలో ప్రథమ స్వాతంత్ర పోరాట కేసుగా పేరొందింది. అనంతరం విజయవాడకు వచ్చి ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్, అల్యూమినియం వర్కర్స్ యూనియన్ నిర్మాణానికి పూనుకున్నారు. డాక్టర్ అచ్చమాంబ ప్రోత్సాహంతో వితంతువు వెంకటసుబ్బమ్మను వివాహం చేసుకున్నారు. రాజమండ్రిలో 1945 సంవత్సరంలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మహాసభలో పాల్గొని రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైయ్యారు. అనంతరం 1952 నవంబర్‌లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మాస్కోలో 1961లో జరిగిన ప్రపంచ కార్మిక సమాఖ్య మహాసభలో, బల్గేరియన్ ట్రేడ్ యూనియన్ మహాసభలో ఏఐటీయూసీ తరపున పాల్గొన్నారు. హైదరాబాద్‌లో 1997 ఫిబ్రవరి 26న క్యాన్సర్‌తో మరణించే వరకు కార్మిక వర్గం, శ్రమజీవుల హక్కుల కోసం జోశ్యభట్ల మొక్కవోని దీక్షతో పనిచేశారు.

లాలూకు మూడున్నరేళ్ల జైలు

- దాణా కుంభకోణం కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు
- నిందితులకు బహిరంగ జైలు మేలు : జడ్జి



రాంచీ : దాణా కుంభకోణం కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌కు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శనివారం మూడున్నరేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించింది. ఈ కుంభకోణంలో రెండు కేసులకు సంబం ధించి రూ.5 లక్షల చొప్పున లాలూకు జరిమానా విధించింది. జరిమానా చెల్లించడ ంలో విఫలమైతే శిక్షను మరో ఆరు నెలలు అదనంగా అనుభవించాల్సి ఉంటుందని కోర్టు తీర్పులో పేర్కొంది. శిక్షను ఖరారు పూర్తయిన తర్వాత న్యాయమూర్తి శివపాల్ సింగ్ మాట్లాడుతూ 'పశు పోషణలో అనుభవం ఉన్న వారైనందున నిందితులకు ఓపెన్ జైలు ఉత్తమం' అని పరిశీలించాల్సిందిగా సూచించారు.

1990-94 మధ్య కాలంలో బీహార్‌లోని దియోఘర్ ట్రెజరరీ నుంచి 84.5 లక్షల రూపాయలను అక్రమ విత్‌డ్రాకు సంబంధించిన కేసులో ఆర్‌జేడీ నేత లాలూతోపాటు మరో 15 మందిని సీబీఐ ప్రత్యేక కోర్టు డిసెంబరు 23న దోషులుగా నిర్ధారించింది. దాణా కుంభకోణానికి సంబంధించి మొదటి ఐదు కేసులలో నిందితుడగా ఉన్న లాలూకు 2013లో ఐదేళ్ల జైలు శిక్షను విధించారు. ఇదిలాఉండగా, లాలూ ప్రసాద్ ప్రస్తుతం రాంచీలోని బిర్సా ముండా కేంద్ర కారాగారంలో ఉన్నారు. అయితే ఆరోగ్య సమస్యలున్న మీదట కనీస శిక్ష విధించాలని లాలూ శుక్రవారం న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఆయన తరపు న్యాయవాది చిత్తరంజన్ సిన్హా కూడా లాలూకు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సీబీఐ ప్రత్యేక కోర్టుకు విన్నవించారు.

తీర్పును సవాల్ చేస్తాం : తేజస్వీ

దాణా కుంభకోణం కేసులో శిక్ష ఖరారుకు కొద్ది నిముషాల ముందు లాలూ కుమారుడు, ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ న్యాయస్థానం మీద తనకు విశ్వాసం ఉందన్నారు. 'న్యాయవ్యవస్థ తన విధి నిర్వహిస్తుంది. మేము శిక్షను అధ్యయనం చేసిన తర్వాత హైకోర్టుకు వెళతాం. బెయిల్‌కు దరఖాస్తు చేస్తాం' అని తెలిపారు.

చనిపోవడం మేలు :లాలూ

దాణా కుంభకోణం కేసులో మూడున్నరేళ్ల జైలు శిక్ష విధించిన వెంటనే, ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ మాట్లాడుతూ బీజేపీకి తలవంచేకంటే సామాజిక న్యాయం కోసం చనిపోవడం మేలని పేర్కొన్నారు. 'మాతో వస్తారా లేదా ఇరికించమంటారా' అనే బీజేపీ పాలనలో అధికార నిబంధనను పాటించడంకంటే సామాజిక న్యాయం, సామరస్యం, సమానత్వం కోసం నేను సంతోషంగా చనిపోతా' అని లాలూ ట్వీట్ చేశారు.

మిసా భారతిపై రెండో ఛార్జిషీట్

రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె మిసా భారతి, ఆమె భర్త శైలేష్ కుమార్ పై శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రెండో ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఈ రెండు ఛార్జిషీట్లను ఫిబ్రవరి 5న ఢిల్లీ కోర్టు పరిశీలనలోకి తీసుకోనుంది. డిసెంబరు 23న ఈడీ ఛార్జిషీటు దాఖలు చేసిన తర్వాత కేసుపై మరిన్ని వివరాలు అందించడానికి సమయం కోరింది. దీంతో కోర్టు ఫిబ్రవరి 5కు విచారణను వాయిదా వేసింది.

నదులన్నీ అనుసంధానిస్తా

(మొదటిపేజీ తరువాయి)

పనిచేస్తున్నాయన్నారు. గ్రామాల్లోని చెత్తను సేకరించి ప్రతి గ్రామంలో కంపోస్టు యార్డును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మార్చి 31వ తేదీలోపు సంపూర్ణ ఓడీఎఫ్‌గా చేస్తామన్నారు. 14,143 కిలోమీటర్లు సిమెంటు రోడ్లు వేశామన్నారు. ఇంటింటికి ట్యాప్‌లు బిగిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో కరెంటు చార్జీలు పెంచే ప్రసక్తే లేదని, వీలైతే కరెంటు చార్జీలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని ప్రకటించారు. విజయవాడ నుంచి అనంతపురానికి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మిస్తామని, వెంకటగిరి, ఏర్పేడు మీదుగా హైవే తిరుపతికి చేరుతుందన్నారు. ప్రస్తుతం 6 ఎయిర్‌పోర్టులున్నాయని, మరో 3 కొత్తవి నిర్మిస్తామని, నెల్లూరు జిల్లాలో దగదర్తిలో 2019 నాటికి ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తుందన్నారు. కృష్ణపట్నం- నెల్లూరు- చెన్నై- తిరుపతిని ఇండస్ట్రియల్ కారిడార్ చేస్తామన్నారు. కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు వాటర్‌వే ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 927 పరిశ్రమలు వచ్చాయని, త్వరలో మరో 900 పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయని, నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. రాష్ట్రంలో త్వరలో 175 ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ఏర్పాటుకానున్నాయని, ఇప్పటికే 98కి భూములు కూడా సేకరించామన్నారు. స్థానికుల కోరిక మేరకు 2000 మందికి పట్టణంలో ఇళ్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కోదూరుపాడు రోడ్డును బైపాస్‌లో కలిపేవిధంగా రోడ్డును నిర్మించాలని అధికారులకు సూచించారు. కోదూరుపాడు అంగన్‌వాడీకేంద్రానికి 20 లక్షల రూపాయలు మంజూరుచేశారు. అంగన్‌వాడీ కార్యకర్తను అభినందించి అంగన్‌వాడీ కార్యక ర్తకు 20 వేల రూపాయలు ఇన్సెంటివ్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కల్చరల్ ప్రోగ్రామ్స్ ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండగ, పల్లె వాతావరణం, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాటుచేసిన స్టాల్స్ అలరించాయి. మంత్రులు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు, జేసీ ఇంతియాజ్, మహిళా కమిషన్ చైర్మన్ రాజకుమారి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, పోలంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి, సునీల్‌కుమార్, టీడీపీ నేతలు రంగారెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పరసారత్నం, వేనాటి రామచంద్రారెడ్డి, నడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి, టి.రమేష్‌రెడ్డి, అనురాధ, ఐసీడీఎస్ పీడీ ప్రశాంతి, ఆర్డీఓ హరిత పాల్గొన్నారు.

మతోన్మాదులను తిప్పికొడదాం

కేరళ మాజీ మంత్రి బినయ్ విశ్వం పిలుపు
ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు ప్రారంభం

విశాలాంధ్ర-వరంగల్‌బ్యూరో : బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాల్లో మతోన్మాదుల దాడులు పెరిగిపోయాయని, విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన చోట మత రాజకీయాలు తగవని కేరళ మాజీ మంత్రి, ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి బినయ్ విశ్వం అన్నారు. శనివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమితి సమావేశాలు పోరాటాల గడ్డ వరంగల్ నగరం కాకతీయ యూనివర్సిటీలో అట్టహాసంగా ప్రారం భమయ్యాయి. తొలుత కేయూలో వెంకటరామయ్య సెమి నార్ హాల్ ఎదుట సమావేశాల ప్రారంభ సూచికగా శ్వేత అరుణ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభ సమావేశానికి ఏఐఎస్ ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ వలీవుల్లా ఖాద్రీ అధ్యక్షత వహించారు. బినయ్ విశ్వం మాట్లాడుతూ మోడీ పాలనలో దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దాడులు పెరిగాయని విమర్శించారు. మతోన్మాదులు పేట్రేగిపోతున్నారని, గో రక్షణ, లవ్‌జీహాద్ పేరుతో హత్యాకాండ కొనసాగిస్తున్నా రని విమర్శించారు. మత, ఛాందస భావాలతో విద్యను కాషాయీకరణ చేస్తూ పాఠ్యాంశాల మార్పునకు మానవ వనరులశాఖ ప్రయత్నిస్తోందని విమర్శించారు. మతోన్మా దులను ఎదుర్కోవాల్సింది విద్యార్థులేనని, విద్య ప్రైవేటీకర ణకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో పూర్తి కేటాయింపులు చేయడం లేదని అన్నారు. వలీవుల్లా ఖాద్రీ, విశ్వజిత్ కుమార్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి రంగాల నుండి ప్రభుత్వాలు తప్పుకుంటున్నాయని, పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షగా మారుస్తున్నాయని దుయ్యబట్టారు. సమావేశాల్లో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.వేణు, రావి శివరామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారావు, రంగన్న గడ్డం నాగార్జున పాల్గొన్నారు.



జన్మభూమితో మారిన గ్రామాల రూపురేఖలు

టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: జన్మభూమి కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పడుతున్నాయన్నారు. మూడున్నరేళ్ల నిరంతర శ్రమ ఫలితాలు అన్ని చోట్లా కన్పిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. జన్మభూమి-మావూరు కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు నిర్వహణపై శనివారం ఉదయం తన నివాసం నుంచి ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిందని, అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములవుతున్నట్లు ఆయన చెప్పారు. జన్మభూమి తొలి రోజున 3 లక్షల మంది హాజరైతే నాలుగో రోజున 6.54 లక్షల మంది పాల్గొన్నట్లు వివరించారు. మిగిలిన రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తి కనిపించాలని ఆయన ఆకాంక్షించారు. గత నాలుగు రోజుల్లో 4.68 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 1.52 ఫిర్యాదులు మాత్రమే అప్‌లోడ్ చేయడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్, మౌలిక సదుపాయాల రంగాల్లో ఏపీ దేశంలో ముందుండాలన్నదే లక్ష్యమన్నారు. రాజధాని అమరావతితో రాయలసీమ జిల్లాలకు రహదారి అనుసంధానం పెంచుతున్నామని, అమరావతి చుట్టూ అవుటర్ రింగ్‌రోడ్ వస్తోందన్నారు. ఓర్వకల్, దగదర్తి విమానాశ్రయాలు 2019 నాటికి పూర్తవుతాయన్నారు. అలాగే భోగాపురం భూసేకరణ పురోగతిలో ఉందన్నారు. కాగా జన్మభూమిలో 4వ రోజు టాప్‌టెన్‌లో ఆచంట, ముమ్మిడివరం, పెద్దాపురం, రాజోలు, వెలిగోడు, చాగల్లు, తణుకు, అనపర్తి, రాయవరం, కొండాపురం, బి కొత్తకోట, ములకలచెరువు, లక్ష్మీనరసంపేట, బ్రహ్మంగారిమఠం మండలాలతోపాటు నిడదవోలు, గరిసపూడి, కశింకోట, కలిగిరి, బొమ్మన కొందూరు, రాచర్ల, సంతమాగులూరు, తంగెడమల్లి గ్రామాలు ముందున్నాయన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో ప్రణాళికాశాఖ, విద్యుత్, ఐటీ, రియల్‌టైమ్ గవర్నెన్స్‌శాఖ అధికారులు సంజయ్‌గుప్తా, అజయ్‌జైన్, విజయానంద్, అహ్మద్‌బాబుతోపాటు వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కారులో మంటలు చెలరేగి బ్యాంక్ మేనేజర్ సజీవ దహనం

విశాలాంధ్ర-బనగానపల్లె : ప్రమాదవ శాత్తు కారులో మంటలు చెలరేగి ఒక వ్యక్తి సజీవ దహనమైన సంఘటన మండల పరిధిలోని దద్దనాల ప్రాజెక్టు వద్ద శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం నంద్యాల నుంచి ప్యాపిలి మండలం గార్లదిన్నెకు వెళ్తుండగా మార్గమధ్యం లోని బనగానపల్లె-గుత్తి మార్గంలో ఏపీ21 బీబీ8806 అనే నెంబర్ గల నిస్సాన్ కంపెనీ కారులో గార్లదిన్నె ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న రాజేష్ (32) విధి నిర్వహణలో భాగంగా నంద్యాల నుంచి గార్లదిన్నెకు ప్రయాణిస్తుండగా, కారు ఇంజన్ నుంచి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవింగ్ చేస్తున్న మేనేజర్ రాజేష్ కారులో చిక్కుకుని, సజీవ దహనమయ్యారు. డ్రైవింగ్ సీట్‌లో మేనేజర్ శరీరం కాలి, బూడిదైంది. ప్రమాద స్థలాన్ని బనగానపల్లె సీఐ శ్రీనివాసులు, ఎస్సై రాకేష్‌లు స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాద సంఘటనలో లభిం చిన కారు నెంబర్ ప్లేటు ఆధారంగా గార్లదిన్నె ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజేష్‌గా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. సమా చారం తెలుసుకున్న బ్యాంక్ సిబ్బంది సంఘ టనాస్థలానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీస్ క్ల్యూస్ టీమ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సంఘటనా స్థలం వద్దనే పోస్టుమార్టం నిర్వ హించి, కుటుంబీకులకు అప్పగించారు. బనగా నపల్లె ఎస్సై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2 లక్షల కోట్లతో బడ్జెట్...!

- గతేడాది కంటే రూ.43 వేల కోట్లు ఎక్కువ
- ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకే
- మనస్సులో మాట బయటపెట్టిన యనమల
- ఇప్పటికే ప్రతిపాదిత అంచనాల సేకరణ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈసారి భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.2 లక్షల కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఆర్థికశాఖ ఇప్పటికే కసరత్తును చేపట్టింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.1,56,999 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గత ఏడాది బడ్జెట్‌తో పోల్చితే కొత్త బడ్జెట్ ప్రతిపాదనలు రూ.43 వేల కోట్ల ఎక్కువగా ఉండనుంది. ఒకేసారి బడ్జెట్ ఇంత భారీగా పెరగటం ఇదే తొలిసారి. ఈ విషయాన్ని ఇటీవల రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడే సూత్రప్రాయంగా వెల్లడించారు. రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ అంచనాల రూపలకల్పనలో ఇప్పటికే ఆర్థికశాఖ అధికారులు తలమునకలై ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీనే కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఫిబ్రవరిలోనే బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలనే యోచనలో ఉంది. ఇప్పటికే అన్నిశాఖల నుంచి బడ్జెట్ అంచనాలను అందజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేష్‌కుమార్ సూచించారు. 2018-19 వార్షిక బడ్జెట్ కూర్పు ప్రక్రియను ప్రభుత్వం మూడు నెలల క్రితమే ప్రారంభించింది. మరోవైపు బడ్జెట్‌పై అన్ని శాఖలతోనూ ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు సమీక్షలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. 2019లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని సూచించినట్లు సమాచారం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గత ఏడాది జూలై నుంచి జీఎస్‌టీని అమలు చేయటంతో రాష్ట్ర రాబడి పడిపోయింది. కేంద్రం నుంచి వస్తాయనుకున్న నిధులు కూడా పూర్తిస్థాయిలో రాలేదు. దీంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైంది. లోక్‌సభ, అసెంబ్లీకి ఎన్నికలు రానున్న నేపథ్యంలో కేంద్రం నుంచి ఈ నెలాఖరునాటికి కొన్ని నిధులు వస్తాయనే ఆశతో ప్రభుత్వం ఎదురు చూస్తోంది.

రెవెన్యూ వ్యయం రూ.86,791 కోట్లు

2017-18 ఆర్థిక సంవత్సరానికి అసెంబ్లీ ఆమోదించిన రూ.1,56,999 కోట్ల బడ్జెట్‌లో రూ.1,25,911 కోట్ల రెవెన్యూ వ్యయం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ఇప్పటికే రెవెన్యూ వ్యయం రూ.86,791 కోట్లకు చేరింది. మూలధన వ్యయం రూ.21,959 కోట్లుగా అంచనా వేయగా, అది రూ.13,939 కోట్లకు చేరింది. మరో వైపు రాబడి లోటు రూ.14,682.74 కోట్లుగా, ద్రవ్యలోటు రూ.28,157.84 కోట్లకు చేరినట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1,18,782 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, పలు వనరుల ద్వారా రూ.91,595 కోట్ల ఆదాయమే ప్రభుత్వ ఖజానాకు జమ అయింది. జీఎస్‌టీ రూపంలో రాష్ట్రానికి అదనపు ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావించినా, కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం జీఎస్‌టీ కింద రూ.5,508.19 కోట్లను సేకరించినట్లు ఆర్థికశాఖ గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఇదిలావుండగా, సమీకృత జీఎస్‌టీ కింద రూ.2,242.97 కోట్లను ప్రభుత్వం సేకరించింది. మరోవైపు కేంద్ర సహాయం కూడా అనుకున్నంతగా రాలేదు. కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.28,598 కోట్లు వస్తుందని అంచనా వేయగా రూ.14,587 కోట్లే వచ్చింది.

రాహుల్‌కు సభాహక్కుల నోటీసు !

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి ఉపరాష్ట్రపతి సభా హక్కుల నోటీసు జారీ చేశారు. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలంటూ రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు ఆ నోటీసును పంపారు. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పేరును వక్రీకరిస్తూ రాహుల్ ట్వీట్ చేయడంపై ఈ నోటీసు జారీ చేసినట్టు తెలుస్తోంది. బీజేపీ నేత, రాజ్యసభ ఎంపీ భూపిందర్ యాదవ్ రాహుల్ గాంధీపై ఈ నోటీసు ఇచ్చారు. ప్రధాని మోడీ, అరుణ్‌జైట్లీ వ్యాఖ్యలతో కూడిన ఓ వీడియోను ట్వీట్ చేస్తూ.. అందులో జైట్లీ పేరు స్పెల్లింగ్‌ను తప్పుగా రాశారు. జేఏఐటీఎల్‌ఈవై బదులు జేఏఐటీఎల్‌ఐఈగా పేర్కొన్నారన్నారు. ఇలా చేయడం జైట్లీని అవమానించటమేనని యాదవ్ ఈ నోటీసు ఇచ్చారు. రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యుడు కావటంతోఆయనపై తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ నోటీసును రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు లోక్‌సభ స్పీకర్‌కు పంపారు. కాగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ నేతృత్వంలోని ఎథిక్స్ కమిటీ వద్ద ఇప్పటికే రాహుల్‌కు సంబంధించిన ఒక ఫిర్యాదు పెండింగ్‌లో ఉంది.

అక్రమాస్తుల అటాచ్‌పై వేగం

- గవర్నర్ నరసింహన్‌ను కలిసిన ఏసీబీ డీజీపీ
- కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పానన్న ఠాకూర్

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : ఆదాయానికి మించి అక్రమాస్తులను కూడబెట్టిన కేసులలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సీజ్ చేసిన ఆస్తులను ప్రభుత్వానికి అటాచ్ చేసే ప్రక్రియను ఏసీబీ వేగవంతం చేస్తోంది. కీలకమైన ప్రభుత్వ శాఖల్లో ఉంటూ ఆదాయానికి మించి అక్రమాస్తులను కూడబెడుతున్న వారిపై ఇటీవల ఏసీబీ విరుచుకుపడుతోంది. కుటుంబ సభ్యులతోపాటు బినామీల పేర్లతో ఆస్తులను కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి అస్తులను ప్రభుత్వపరం చేయాలని ఏసీబీ యోచిస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే ఏసీబీ న్యాయ కోవిదుల సలహాలను కూడా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఏసీబీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌ను శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో కలిశారు. గవర్నర్‌తో పలు అంశాలపై ఠాకూర్ చర్చించినట్లు సమాచారం. అయితే తాను నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు గవర్నర్‌ను కలిసినట్లు ఏసీబీ డీజీపీ ఠాకూర్ 'విశాలాంధ్ర'కు చెప్పారు. ఇదిలాఉండగా గతేడాది ఆదాయానికి మించి అక్రమాస్తులను కూడబెట్టిన 47 మంది అధికారులను ఏసీబీ అరెస్టు చేసి జైలుకు పంపించింది. ఆయా కేసులలో సుమారు రూ.2,500 కోట్లకుపైగానే అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించింది. భవిష్యత్‌లో అక్రమాస్తులను కూడబెట్టేందుకు అధికారులు భయపడేలా చేసేందుకే ఆస్తులను ప్రభుత్వానికి అటాచ్ చేయాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) ఆర్‌పీ ఠాకూర్ ప్రతిపాదించారు. దీనివల్ల కేసు తేలేంత వరకు ఆస్తులన్నీ ప్రభుత్వ స్వాధీనంలోనే ఉంటాయి. ఆస్తులు సక్రమమని తేలితే తప్ప వెనక్కి తీసుకోలేని విధంగా చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వానికి ఠాకూర్ ఇప్పటికే ప్రతిపాదించారు. మరోవైపు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఐదు ఏసీబీ ప్రత్యేక కోర్టులకు న్యాయమూర్తులను నియమించేందుకు హైకోర్టు సుముఖతను వ్యక్తం చేసింది. ఏసీబీకి పట్టుబడిన వారి కేసులలో కొందరు ఫిర్యాదుదారులే నిందితులతో కుమ్మక్కవటం వల్ల కేసులు నీరుగారుతున్నాయి. అలాంటి కేసులలో ఫిర్యాదుదారులకు కూడా శిక్షలు వేస్తున్నారు.

గల్ఫ్ ఉద్యోగార్థులకు శిక్షణ

- రాష్ట్రంలో 3 కేంద్రాలు ఏర్పాటు
- ఏటా 24 వేల మందికి తర్ఫీదు
- యూఏఈతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం
- బాధితులకు ఏపీఎన్‌ఆర్‌టీ సాయం

విశాలాంధ్ర అమరావతి: గల్ఫ్‌లో ఉద్యోగాల కోసం వెళ్లే యువతకు తగిన శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో మూడు అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఏటా 24 వేల మందికి శిక్షణ ఇస్తారు. మొదటిది రాజధాని అమరావతిలో ఏర్పాటు కానుంది. దీనికోసం రూ.4 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఏప్రిల్ నాటికి కేంద్రం ఏర్పాటు, శిక్షణ ప్రారంభిస్తారు. గల్ఫ్‌దేశాలకు ఎక్కువగా వెళ్లే రాయలసీమ ప్రాంతంలోని కడప, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళంలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో కేంద్రంలో ఏటా 8 వేల మందికి శిక్షణ ఇస్తారు. ఏపీఎన్‌ఆర్‌టీ వీటిని నిర్వహిస్తుంది. ఏజెంట్ల చేతిలో మోసపోకుండా, అక్కడికి వెళ్లాక ఇబ్బంది పడకుండా, వెనక్కి వచ్చే దారిలేక సతమతం అవ్వకుండా ఏపీకి-యూఏఈకి మధ్య ఒప్పందం కుదిరింది. సొంతంగా యూఏఈకి వెళ్లేందుకు ఎంపికైన వారికి కూడా తగిన శిక్షణ ఇస్తారు. గల్ఫ్‌లో మెకానిక్‌లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, తాపీమేస్త్రిలు, రాడ్ బెండింగ్ వర్కర్లకు డిమాండ్ ఉంది. ఒక్కోసారి తగిన నైపుణ్యం లేకపోవడం వల్ల అనుకున్నంత జీతాలు ఇవ్వడం లేదు. సరైన శిక్షణ, నైపుణ్యంతో వెళ్తే మామూలుగా ఇచ్చే జీతం కంటే 10-20శాతం ఎక్కువ వచ్చే అవకాశాలున్నాయని ఇటీవల గల్ఫ్ దేశాలకు ఏపీఎన్‌ఆర్‌టీ ఛైర్మన్ వేమూరి రవికుమార్ వెళ్లినప్పుడు అక్కడి కంపెనీలే చెప్పాయి.

ప్రవాసులకు ప్రమాద బీమా!

ప్రవాసాంధ్రులకు ఏపీఎన్‌ఆర్‌టీ బీమా కల్పించనుంది. ఇటీవల ప్రకటించిన ప్రవాసుల సంక్షేమం, అభివృద్ధి విధానం కింద, ఇందుకు అవసరమైన రూ.25 కోట్లను ప్రభుత్వం శుక్రవారం మంజూరు చేసింది. సింగపూర్, మలేషియాలకు వెళ్లి చిరు ఉద్యోగాలు చేసుకుంటున్న ప్రవాసులకు, అమెరికా వెళ్లి చదువుకుంటున్న విద్యార్థులకూ బీమా కల్పిస్తామని ఏపీఎన్‌ఆర్‌టీ ఛైర్మన్ రవికుమార్ తెలిపారు. మూడేళ్లపాటు బీమాకు అవసరమైన ప్రీమియం రూ.225ను ఏపీఎన్‌ఆర్‌టీ చెల్లిస్తుంది. లబ్ధిదారు మూడేళ్లకు కలిపి రూ.150 చెల్లిస్తే చాలు. ఈ పథకం కింద లీగల్ బీమా, ఆరోగ్య బీమా, డెత్ బెనిఫిట్‌లు ఉంటాయి. ఏజెంట్లు, కాంట్రాక్టర్లు ఉద్యోగాల పేరిట ఎవరినైనా గల్ఫ్‌కు తీసుకెళ్లి మోసం చేసిన సందరాల్లో...అక్కడి భారతీయ ఎంబసీ సర్టిఫై చేస్తే వెంటనే బాధితులను రాష్ట్రానికి తీసుకొచ్చే బాధ్యతను ఏపీఎన్‌ఆర్‌టీ తీసుకుంటుంది. ప్రయాణ ఖర్చులను భరిస్తుంది. అత్యవసర సహాయం కింద రూ.25 వేల వరకు సాయం చేస్తుంది. న్యాయపరంగా అండగా ఉంటుంది. ఈ మొత్తాన్ని మళ్లీ లీగల్ బీమా నుంచి ఏపీఎన్‌ఆర్‌టీ తీసుకుంటుంది. లక్ష వరకు ఆరోగ్య బీమా ఉంటుంది. ఒకవేళ ఎవరైనా చనిపోతే రూ.10 లక్షల బీమా మొత్తాన్ని వారి కుటుంబసభ్యులకు అందిస్తారు.

10న విజయవాడలో భూసేకరణ చట్ట సవరణ నిరసన సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 2013 భూసేకరణ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన సవరణ బిల్లును నిరసిస్తూ రాష్ట్ర స్థాయి సదస్సు ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరుగు తుందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెలి పారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సుకు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజాన్ ముఖ్య అతిధిగా హాజరవు తారన్నారు. వ్యవసాయ శాఖ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కిసాన్‌సభ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్యతోపాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటార న్నారు. 2013 భూసేకరణ చట్టానికి కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 29న అసెంబ్లీ, కౌన్సిల్‌లో సవరణలతో కూడిన బిల్లు ప్రవేశపెట్టిం దన్నారు. ప్రభుత్వం ఏకపక్షంగా ప్రవేశపెట్టిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందితే రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు, చేతివృత్తిదారులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ చట్టం వల్ల నయా భూస్వాములు, కార్పొరేట్లకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సవరణ బిల్లు రాష్ట్రపతి ఆమోదం తెలుపకుండా ఒత్తిడి తెచ్చేందుకు నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ప్రసాద్ కోరారు.

దాసరిభవన్‌లో రాష్ట్ర సమితి సమావేశం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి సమావేశం ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడ హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో జరుగుతుందని సంఘ ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసా ద్ తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రామచంద్రయ్య అధ్య క్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్, ఉపా ధ్యక్షులు రావుల వెంకయ్యలు పాల్గొంటారన్నారు. సమితి సభ్యులు, ఆహ్వానితులు సమావేశానికి తప్పక హాజరుకావాలని ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

వీఎస్‌యూ అభివృద్ధికి రూ. 50 కోట్లు

- త్వరలో కమిటీ ఏర్పాటు
- నూతన భవనాన్ని ప్రారంభించిన సీఎం



విశాలాంధ్ర - నెల్లూరుబ్యూరో : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.50 కోట్లు వెచ్చించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పేర్కొన్నారు. అభివృద్ధి అంశంపై నిపుణుల కమిటీని వేసి వారి సూచనలమేరకు నిధులు వెచ్చించనున్నట్లు తెలి పారు. శనివారం మధ్యాహ్నం వెంకటాచలం మం డలం, కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో రూ. 26.1 కోట్లతో నిర్మించిన నూతన భవన సముదాయాన్ని ప్రాంభించి అనం తరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఏ దేశంలో అయినా ఎంత సంపద ఉన్నదనేదాని కంటే ఎంత విజ్ఞానం ఉన్నదనేది ముఖ్యం అన్నారు. బ్రిటీష్ పాలనలోనే నెల్లూరు జిల్లా అభివృద్ధి చెందిందన్నారు. అమెరి కాలోని సిలికాన్ వ్యాలీలో అత్యధిక ఆదాయం కల్గిన వారు మన తెలుగువారే అన్నారు. చదువు ద్వారానే అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఒక తరం బాగా చదువుకుంటే, ఆ తర్వాత జనరేషన్ వృద్ధి చెందుతుందన్నారు. ఎక్కడ జ్ఞానం ఉంటే అక్కడ అభివృద్ధి ఉంటుందని, మన విద్యా విధానాల్లో మార్పులు రావాలన్నారు. విదేశాల్లోని యూనివర్సిటీలను (స్టాండ్ ఫోర్ట్ హార్వర్డు) సందర్శించినప్పుడు అక్కడ విద్యార్థులు 4 నెలలు క్లాస్‌రూంల్లో ఉంటే, మిగతానెలలు ఫీల్డ్‌లో ఉంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఒక నాలెడ్జ్ హబ్‌గా తయారు కావాలన్నారు. పాత కోర్సులకు, క్రొత్త ఓరియంటేషన్ జరగాలని, ఏపీలో వినూత్నమైన పద్ధతుల ద్వారా అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నామన్నారు. రాష్ట్రంలో ఆర్.టి.జి. పరిష్కార వేదిక వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు.

డ్రోన్స్, సర్వేలెన్స్ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇంట్లో కూర్చొని, ఆధునిక టెక్నాలజి ద్వారా అర్జీల వివరాలు తెలుసుకోవచ్చని ముఖ్యమంత్రి వివరించారు. మెడికల్, ఇంజనీర్ ఏ కోర్సుల్లో విద్యనభ్యసించినా ఐ.టి. రంగంలో ప్రవేశం ఉండాలన్నారు. త్వరలో రాష్ట్రానికి సోలార్, విండ్ ఎనర్జీలు వస్తాయని, తద్వారా కరెంటు రేట్లు తగ్గుతాయన్నారు. ప్రతి విద్యార్థి కొత్త విషయాలు ఆలోచించి, పరిశోధనల ద్వారా మేధోశక్తిని ఉపయోగించి పేదవారికి సహాయపడా లన్నారు. వర్చువల్ క్లాస్‌రూం ద్వారా టీచర్లు చెప్పింది అర్థంకాకపోతే ఇంటికిపోయి చూసుకొని చదివే అవకాశం ఉందన్నారు. త్వరలో రాష్ట్రంలో 5 కె రన్ ప్రవేశపెట్టామని, ప్రతి ఒక్కరూ రోజుకి అర్థగంట శరీరానికి పనిపెట్టాలని కోరారు. యునివర్సిటీల్లో విభిన్నమైన కోర్సులు అక్వాకల్చర్, ఆటోమొబైల్, బోట్స్ బిల్డింగ్ వంటి కోర్సులకు ప్రాధాన్యత ఉంటుందని, జన్మభూమి కార్యక్రమాల ద్వారా రోజుకో అంశం చొప్పన చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 31 నాటికి ఆంధ్ర రాష్ట్రాన్ని ఓ.డి.ఎఫ్. చేస్తామన్నారు. విద్యారంగంలో దేశంలో నెంబర్ -1 రాష్ట్రంగా ఏపీ ఉండాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టరు ఆర్. ముత్యాలరాజు, విక్రమసింహపురి యూనివర్సిటి వైస్‌చాన్సలర్ వీరయ్య, రాజధాని కమిటీ సభ్యులు బీదామస్తాన్ రావు, కో ఆపరేటీవ్ బ్యాంక్ ఛైర్మన్ మెట్టుకూరి ధనుంజయ రెడ్డి, మాజీమంత్రి పరసా రత్నం, ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, మాజీ శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

టీచింగ్ ఆసుపత్రులలో మౌలిక వసతులకు రూ.167.70 కోట్లు

- వైద్య సౌకర్యాల అప్‌గ్రేడేషన్‌కు ప్రాధాన్యం
- హెల్త్ వర్సిటీ బడ్జెట్ నుంచి నిధులు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని ప్రధాన బోధనా (టీచింగ్) ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం ఉన్న 15 బోధనా ఆసుపత్రులలో మౌలిక వసతులు సరిగా లేవని ప్రభుత్వం గుర్తించింది. రెండు నెలల క్రితం సీఎం చంద్రబాబు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖపై నిర్వహించిన సమీక్షలో వైద్య సౌకర్యాలు అనుకున్నంతగా లేవని గుర్తించారు. తక్షణమే బోధనా ఆసుపత్రులలో వైద్యపరంగా మౌలిక సౌకర్యాలను మెరుగుపరచటంతోపాటు ఉన్న వాటిని అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. సీఎం ఆదేశాలతో వైద్య విద్య డైరెక్టర్ (డీఎంఈ) ఆగమేఘాల మీద బోధనా ఆసుపత్రులలో మౌలిక సదుపాయల అప్‌గ్రేడేషన్‌కు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించింది. దీంతో రాష్ట్రంలోని 15 ప్రధాన బోధనా (టీచింగ్) ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.167.70 కోట్లను మంజూరు చేసింది. వైద్య విద్య డైరెక్టరేట్ (డీఎంఈ) పరిధిలో ఉన్న ఈ బోధనా ఆసుపత్రులలో నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఫర్ హస్పిటల్స్ (ఎన్‌ఏబీహెచ్) ప్రమాణాల మేరకు వైద్య సౌకర్యాలను అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం సూచించింది. రాష్ట్రంలోనే పెద్ద బోధనా ఆసుపత్రులుగా ఉన్నప్పటికీ కీలక సదుపాయాలకు నోచుకోవటంలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మౌలిక సౌకర్యాల కల్పనకు డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిధుల నుంచి రూ.167.70 కోట్లన విడుదల చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధుల వినియోగంపై డీఎంఈతోపాటు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, మౌలిక సదుపాయల కల్పన సంస్థ (ఏపీఎంఎస్‌ఐడీసీ) ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వులలో పేర్కొంది.

బోధనా ఆసుపత్రులకు నిధుల కేటాయింపు ఇలా

బోధనా ఆసుపత్రి	నిధులు (రూ.కోట్లలో)
శ్రీకాకుళం రిమ్స్	7.98
విశాఖపట్నం కేజీహెచ్	22.64
విశాఖపట్నం విక్టోరియా	4.01
విశాఖపట్నం మానసిక ఆసుపత్రి	5.43
విశాఖపట్నం ఛెస్ట్ ఆసుపత్రి	5.66
కాకినాడ జీజీహెచ్	15.55
విజయవాడ జీజీహెచ్	16.14
గుంటూరు జీజీహెచ్	11.54
కర్నూలు జీజీహెచ్	22.22
తిరుపతి ఎస్‌వీఆర్‌ఆర్‌జీజీహెచ్	19.58
తిరుపతి ప్రభుత్వ మెటర్నిటీ	3.09
అనంతపురం జీజీహెచ్	11.10
నెల్లూరు జీజీహెచ్	5.12
కడప రిమ్స్	11.86
ఒంగోలు రిమ్స్	5.74
మొత్తం	167.70

సీపీఎస్ ఉద్యోగులకు భరోసా : అశోక్ బాబు



విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం పింఛన్‌ను తిరిగి సాధించేందుకు ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ పి.అశోక్ బాబు తెలిపారు. గాంధీనగర్‌లోని ఏపీఎన్‌జీవోస్ హోంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సౌకర్యాలు, డీఏ బకాయిలను విడుదల చేయాని కోరామన్నారు. రాష్ట్ర పరిధిలో సీపీఎస్ ఉంటే రద్దు చేయాని, కేంద్ర పరిధిలో కి వస్తే రదుకు ఒత్తిడి తీసుకు రావాలని ప్రభుత్వానికి సూచించారు. అయితే సీపీఎస్ రద్దు చేయాని కోరుతూనే ప్రభుత్వం ప్రకటించిన గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్‌ను అమలు చేయాలని కోరారు. సీపీఎస్ రదుకు అన్ని తాలూకా కేంద్రాలలో ఈనెల 9న ధర్నా చేపట్టాలని ఏపీజేఏసీ, ఏపీఎన్‌జీవో నాయకులు కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. అదేవిధంగా ఫిబ్రవరి 10న అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. జూలై 2018 నుంచి అమలులోకి రావల్సిన 11వ పీఆర్‌సీ కమిషన్‌ను తక్షణం నియమించాలన్నారు. 10వ పీఆర్‌సీకి చెందిన 10 నెలల బకాయిలను తక్షణమే ఉద్యోగులకు అందించి, కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జనరల్ సెక్రటరీ పి.బాబురెడ్డి, జనరల్ సెక్రటరీ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ సెక్రటరీ ఎం.సాంబశివరావు, సీఎం.దాస్, షేక్ మీరావలి, జి.ఆర్.కె.రెడ్డి, వై.ప్రసాద్, సి.సుబ్బా రెడ్డి, సి.వి.రమణ, ఎ.వి.విద్యాసాగర్, గంగిరెడ్డి, సి.హెచ్.అజయ్‌కుమార్, ఎ.నర సింహ, ఎం.డి.ఇక్బాల్ పాల్గొన్నారు.

సంపాదకీయం

వాత్సల్యం

వాత్సల్యం... ఈ జీవ ప్రపంచాన్ని నడిపే ఇంధనం, ప్రాణశక్తి. వరిచేలపై నుంచి వెళుతూ గాలి సుతారంగా పలకరించినప్పుడు అలల సోయగమై తలూపే పచ్చని ప్రేమామృత దృశ్యమై మన గుండెల్ని స్పర్శించే తీయని అనుభూతి. కొండకోనల్ని ఒరుసుకుంటూ గలగల పారే సెలయేటి లయాత్మక సవ్వడి మన వీనుల విందై మరో లోకంలో విహరింపచేసే అంతరంగ ఆనందాంబుధి. శీతవేళ తెలిమంచు బిందువులే ముత్యాల హారంగా ధరించి మురిసిపోయే, మెరిసిపోయే ప్రకృతి కాంత కవ్వింపు కన్నుల పండగై మన తనువు తటిల్లతై పొందే తన్మయానుభవం. ఈ విశ్వమంతా వాత్సల్యమే. చెట్టూపుట్టా పిట్టాగుట్టా నింగీనేలా అణువణువూ వాత్సల్యపు విలాసమే. ఇన్ని లక్షల జీవరాశుల్ని, కోటానుకోట్ల వృక్షజాతుల్ని పరస్పర సహజీవన వలయంగా మార్చిన మహోన్నత శక్తితరంగణి ఈ వాత్సల్యమే. పుడమి పొట్టచీల్చుకొచ్చే అంకురానికి వాయువు, వెలుతురులు వెయ్యి చేతులు సాచి ఆప్యాయానురాగాలందిస్తూ తమ పొత్తిళ్లలో పొదువుకునే అనుబంధమే వాత్సల్యం.

గుండె ద్రవించితే ఏరులై పారడం, ప్రేమామృతం ఒలికితే పాటై ప్రవహించడం, కరుణ కడలై పొంగితే మమతానురాగమై స్పర్శించడం..ఇదే వాత్సల్యం. కన్నబిడ్డ స్పర్శతో ప్రసూతి బాధంతా ఆత్మీయతాగీతంగా మారిపోవడమే వాత్సల్యం. అది భౌతికం, అంతరంగం. లాక్షణికులు ఏమని నిర్వచించినా.. అది పదార్థంలా మార్పు చెందుతుండే తప్ప మరణమెరుగదు. దగాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు.. ఇలాంటి వాటి వేటికీ చలించదు, సన్నగిల్లదు. అందువల్లనేమో కుత్సితాలు, కుట్రలు, కుహకాలతో మనిషి జీవితం నిండిపోతున్నా.. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ వసివాడకుండా అమ్మ ప్రేమ అజరామరమై అమరత్వం పొందుతోంది. బుడిబుడి అడుగుల బిడ్డ కొనవేలు పట్టుకొని ప్రపంచం వాకిట్లోకి నడిపిస్తూ బతుకుదారి చూపించే నాన్న కూడా వాత్సల్యపు రూపే. అమ్మ ఎంత అదృష్టవంతురాలు. అంతా ఆమె సొంతమే. ఆమె అనుభవించి, ఆనందించి వదిలేసిన చిట్టచివరి ఆత్మీయ చుక్కే నాన్నకు దక్కు. పిచ్చి తండ్రి.. దానికే ఎంత పొంగిపోతాడు. ఎంత పొగరుపోతాడు. అంతా తానే నడిపిస్తున్నానని, తను గీసిందే గీత, రాసిందే రాత, వంచిందే ప్రేమ అనుకొని పొంగిపోతాడు. అంతా అమ్మదేనని, ఆమెదేనని ఎప్పటకైనా తెలుసుకుంటాడా.. నిజంగా, ఆ రహస్యం తెలిస్తే అదే అతని ఆఖరి చిరునామా అయిపోదూ!. ఈ జీవపరిణామం ఆగిపోదూ!! అతన్ని అలానే వాత్సల్యపు భ్రమల్లో బతక నిద్దాం. అమ్మ వాత్సల్యంలో ఓ స్వార్థం ఉంది. ప్రకృతిలోనే ఈ స్వార్థం దాగి ఉంది. ఇది నా బిడ్డ, ఇది నా సంతతి అనే సహజమైన వాత్సల్యం ఆమెది. ప్రకృతిలో, సంస్కృతిలో జీవగతమైన విలక్షణం ఆమెది. కాకిపిల్ల కాకికి ముద్దు అంటారు అందుకే. నాన్న వాత్సల్యం స్వార్థం కాదు, నమ్మకమే పునాదిగా సాగుతుంది. తన బిడ్డ అని తెలవగానే నిలువునా నీరయ్యే లక్షణం నాన్నది. బిడ్డకు కష్టం ఎదురైనప్పుడు నేనున్నానంటూ సాంత్వన వచనమై, ధైర్య ప్రవచనమై నిలిచే వాత్సల్యం నాన్నది. పసితనపు ప్రేమానుభూతులన్నీ అమ్మకే సొంతం. చిలిపిచేష్టలు, అల్లరిగోలలే తండ్రి గుండెల మాటున దాచుకొని నెమరు వేసుకొనే బిడ్డ తీపిగురుతులు. తెలుగుదనపు కమ్మదనం తెలుసు, కన్నకడుపుల తీపిదనమూ తెలుసు అంటూ ఎర్రాప్రెగడ హరివంశంలో బాలకృష్ణుడి గురించి వర్ణిస్తాడు. బిడ్డ అడుగులు వేస్తుంటే తండ్రి గుండెల్లో ఎంతటి అలజడి మొదలవుందో, తన రూపుకు ఎలాంటి భవిష్యత్తు ఇవ్వాలి, అందుకు ఇప్పటినుంచే తానేం చేయాలి అని ఎంత మథనపడుతాడో ఏ కవి రాయలేదే! కవులెవ్వరికీ ఆ ఆందోళన కలగలేదా!? బిడ్డలందరూ అమ్మకిచ్చే ప్రాధాన్యత నాన్నకు ఎందుకు ఇవ్వరో! ఎప్పుడో ద్వాపరయుగంలో రాముడు ఇచ్చాడని ఉదాహరణగా చెప్పుకోవడమేగానీ, ఇవాళ నూటికికోటికి ఒక్క రాముడు కూడా కనిపించడంలేదు. ఏదిఏమైనా వత్సల రూపానికి, వాత్సల్యరాగానికి పట్టుగొమ్మగా నిలిచేది జీవతత్వమే. మనిషితనంలో అది మరింత పరిణతి పొందింది. మనిషితనమంటేనే వాత్సల్యపు ప్రతిరూపం. పసితనంలో అమ్మనాన్నలు పెట్టే ముద్దులోనే వాత్సల్యం ముద్దకట్టుకొంటోంది. నాన్నకు లేని అదృష్టం అమ్మకు ఉంది. 'అలసితివి కదన్న! యా కొంటివి కదన్న/ మంచి అన్న! ఏడ్పు మనుమన్న' అంటూ చిన్ని కృష్ణుడికి యశోద పాలిస్తూ సముదాయించడాన్ని పోతన రూపుకట్టాడు. బిడ్డలకు పసితనంలో అమ్మలు పంచిన ఆ ప్రేమామృతమే జీవితాంతం గుర్తుండిపోతుందేమో! కొడుకా అనీ, చిట్టీ అనీ, నా బంగారం అనీ, నాన్నా అనీ, ఈ రోజుల్లో అయితే పింకీ, మంకీ అని కొడుకులను రకరకాలుగా ముద్దుచేస్తారు! పెరిగి పెద్దవుతున్న వేళ తండ్రులు ఎంత వాత్సల్యవృష్టి కురిపించినా దాని ముందు దిగదుడుపేనేమో! అందుకేనేమో మన కవులు కూడా పసితనాన్ని వర్ణించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. 'ముద్దుగారే యశోద ముంగిట ముత్యం'గా బాలకృష్ణుడ్ని అన్నమాచార్యులు వర్ణించారు. శ్రీకృష్ణకర్ణామృతం రాసిన లీలాశుకుడు 'ప్రాత:స్మరామి దధి ఘోష వినీత నిద్రం/ నిద్రావసాన రమణీయ ముఖారవిందం!' అంటాడు. వేకువజామునే పెరుగు చిలికే సవ్వడి.. దానికి మేల్కొన్న ముద్దుముఖం..దానిలో చిరుదరహాసం అని అర్థం. అమ్మ పెరుగు చిలికితే వెన్న వస్తుంది. అమ్మచేతి వెన్నముద్ద నోటికి వస్తుందని ఆ ఆనందంలోని అసలు రహస్యం. బిడ్డ ఎంత మట్టిలో పొర్లాడినా అమ్మకు అసహ్యం పుట్టదు.. అందులోనూ బిడ్డలో కొత్త అందం చూస్తుందని నారాయణతీర్థులు కృష్ణలీలా తరంగంలో 'కంకణ కేయూర భూష- కనక కింకిణీకృత బహుఘోష/కుంకుమ పంకిలవేష-కుటిల కుంతల గోకుల భూష!' అని పేర్కొన్నారు. విశ్వనాథ సత్యనారాయణ 'తల్లి మురిపెం తనివి తీరనిది!' అన్నారు.

వాత్సల్యం అంటే కేవలం బిడ్డకు తల్లిదండ్రులు అందించేది మాత్రమే కాదు. తమ్ముడికి అక్కా చెల్లి అన్నా అందించే వాత్సల్యమూ తూకము వేయలేనిదే. దీనిలో నిర్మలత్వం ఉంటుంది. స్నేహితుడికి మరో స్నేహితుడు అందించే వాత్సల్యంలో నిష్కల్మషత్వం ఉంటుంది. దైన్యంలో, ఆపదలో, నిస్సహాయతలో ఉన్నవారికి తోటి మనిషి అందించే చేయూతలోనూ అనిర్వచనీయమైన వాత్సల్యం దాగి ఉంటుంది. శకుంతలను కన్నబిడ్డగా సాకిన కణ్వుని అంతరంగం వాత్సల్యతరంగమే! ఆకలితో అలమటించే అన్నార్తులకు ఆపన్న హస్తం అందించి ఆదుకోవడంలో పరిపూర్ణమైన వాత్సల్యం పొంగిపొర్లుతుంది. ఎదుటి మనిషి కన్నీటిని తుడిచే ఆ హస్త స్పర్శ వాత్సల్య రసామృతమే. ఆకలితో ఉన్నవారికి కడుపునిండా అన్నంపెట్టడమే దైవత్వం అన్నారు వివేకానంద. వాత్సల్యంతో చేసే ఏ పనైనా దైవత్వానికి మించిందే. దైవం భావన ఓ భ్రమపూరితం. వాత్సల్యం అనేది వాస్తవం. ఈ దేశానికి మొదటి శత్రువు మతం అన్నారు. మతం లేని దేవుడ్ని ఉన్నట్లు ప్రజల్ని భ్రమింపచేస్తుంది. 'మతాలు కొన్ని లక్షల ప్రాణాలను బలిపుచ్చుకున్నాయి.' అని మరో రచయిత ఆవేదన వ్యక్తంచేశారు. వాస్తవాన్ని విడిచిపెట్టి ఎండమావుల వెంట పరుగెత్తితో మారణహోమమే మిగులుతుంది. దైవం మనిషిలోని వాత్సల్యాన్ని తుంచేసింది. అందువల్లే ఈ దేశంలో మతోన్మాదం బుసలు కొడుతోంది. మధ్యప్రాచ్యంలో మతవిషనాగులు దేశాలకు దేశాలనే కాటువేస్తున్నాయి. అగ్రరాజ్యం అమెరికా తన పెత్తనం కోసం దేశాల మధ్య వైషమ్యాలు రాజేస్తోంది. ప్రేమను పంచాల్సిన మనిషి విద్వేషాన్ని, విధ్వంసాన్ని వెదజల్లుతున్నాడు. 'కోటి గ్రంథాల సారాంశాన్ని నేను అర్థశ్లోకంలోనే చెప్పగలను. అదేమిటంటే-పరులకు ఉపకారం చేయడం పుణ్యం, పరులను పీడించడం పాపం' అన్నాడు కవి కులగురువు కాళిదాసు. 'పరోపకారార్థమిదమ్ శరీరమ్' అన్నారు గదా! ఇలా మనిషి జీవించాలంటే వాత్సల్యం ఉచ్ఛ్వాసనిశ్వాసలు కావాలి. కుటుంబంలోనే కాదు, సమాజంలో సౌభ్రాతృత్వ భావన వెల్లివిరియడానికి మనసున విశాల దృక్పథం పెంపొందడానికి, మనుషుల మధ్య పరస్పర వాత్సల్యం పెనవేసుకోవాలి. 'జీవితం కరిగిపోయే మంచు/ ఉన్నదాంట్లోనే నలుగురికీ పంచు' అన్న కవి వాక్కు నిజం కావాలంటే ప్రతి మనిషి మనస్సు వాత్సల్యపు లతలల్లుకోవాలి. తలపుల్లో పువ్వులు వెల్లివిరియాలి. వాత్సల్యం కేవలం బాల్యపు అలంకారమే కాదు, కుటుంబాన్ని కలిపి ఉంచే ఆభరణమే కాదు. సమాజాన్ని, దేశాలను చివరకు ఈ ప్రపంచాన్ని శాంతి, సుస్థిరతల ఉద్యానవనంగా మార్చాలంటే ప్రతి ఇల్లు ముందుగా వాత్సల్యపు చిరునామాగా మారాలి. ప్రతి బిడ్డకు తల్లిదండ్రులు వాత్సల్యం అనే గుణగణాలను అందించాలి. ప్రతి బిడ్డ తన తల్లిదండ్రులకు వాత్సల్యపు కానుకగా మారాలి. అప్పుడే వాత్సల్యం జీవిత రసామృతమే కాదు, స్వేదామృతంగా, జనజీవనామృతంగా మారుతుంది. జగదానందకా రకమవుతుంది. జనశ్రేయో:దాయకమవుతుంది.

మోడీ సర్కారు గాలిబుడగలు - భాగం 5

విశ్లేషణ

జీవనోపాధి కల్పన



మర్ల విజయ కుమార్

గత 26 ఏళ్లుగా పీవీ నరసింహారావు ప్రభుత్వంతో ప్రారంభమై కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయాఉదారవాద విధానాల పర్యవసానంగా, ప్రభుత్వరంగం కుదించబడి, ప్రజాసంక్షేమ పథకాలు మూలపడ్డాయి. ప్రతిదీ ప్రైవేటుపరంచేయాలనే ఈ దుష్ట ఆలోచనావిధానం కారణంగా, సార్వత్రిక విద్య, ప్రజావైద్యం బడా కార్పొరేట్ల చేతుల్లోకి చేరి, వ్యాపార వస్తువులుగా మారిపోయి, లాభాలవేటలో నైతిక విలువలు అడుగంటాయి. ఫలితంగా మానవ వికాసానికి అతి ముఖ్యమైన ఈ రెండు సదుపాయాలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. ఇటువంటి నయాఉదారవాద విధానాల వలన మన దేశ ఆర్థిక వ్యవస్థలో గుణాత్మకమైన మార్పులు వచ్చి, ప్రజల జీవన స్థితిగతులను అధోగతి పాలుచేస్తున్నాయి. ప్రతి పది మంది బాలలలో 9 మందికి పోషకాహార లోపం ఉన్నది. ప్రపంచదేశాల ఆకలి సూచికలో మన దేశం 135వ స్థానంలో, ఆఫ్రికాలో అతిపేద దేశాలైన సహారా ఎడారి ప్రాంత దేశాలతోపాటు దాదాపు అట్టడుగున ఉన్నది. ప్రపంచంలో పుట్టిన బిడ్డలలో ప్రతి వెయ్యిమందికి బాల్య మరణాల సగటు సంఖ్య 25 కాగా, మన దేశంలో అది 52 గాఉన్నది. ప్రాథమిక ఆరోగ్య రంగం బాధ్యతను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపుగా వదిలిపెట్టేశాయి. ఇక ప్రాథమిక విద్య విషయానికొస్తే, అంతకు ముందు మనం చర్చించుకున్నట్లుగా, 75శాతం యువకులు 5వ క్లాసు దాటలేదు, 84శాతం హైస్కూలు దాటలేదు. నిరక్షర కుక్షులుగా, అనారోగ్యంతో దేశ పౌరులలో అత్యధికులు తీసుకుంటూంటే, 10 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని, భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి పారిశ్రామిక శక్తిగా అభివృద్ధి చేస్తానని మోడీ పలికే ఉత్తరకుమార ప్రజ్ఞలు, వాస్తవాలతో ఏవిధంగానూ సంబంధం లేకుండా గాలిలో కర్రసాము చేయటం వంటిదే. 45 కోట్లమంది యువతకు ఆధునిక సాంకేతిక శిక్షణ ఇవ్వవలసి ఉండగా, వారిలో ఇప్పటివరకూ 2.5శాతానికి మాత్రమే ఏదో ఒక రకమైన సాంకేతిక శిక్షణ ఇచ్చినట్లుగా ప్రభుత్వం లెక్కలే చూపిస్తున్నాయి. ఇక భారత దేశంలో నూతన పరిశ్రమలు స్థాపించినా, వాటిలో పనిచేయటానికి తగిన అర్హతలు కలిగిన యువత ఉన్నఫళంగా తయారుకావటానికి, మోడీ మాయల ఫకీరుకాదు, దేశ సమస్యలను పరిష్కరించటమంటే స్టంటు సినిమా కానేకాదు. తొలుతగా ప్రాథమిక విద్యాస్థాయి నుండి ఉన్నత విలువలు కలిగిన ఉచిత విద్యను అందిస్తూ, ఉచిత ప్రజారోగ్య సదుపాయలు దేశవ్యాప్తంగా కల్పించగలిగినప్పుడే, హైస్కూలు స్థాయికి చేరగల విద్యార్థులు తయారవుతారు. విస్తృతస్థాయిలో వారికి సాంకేతిక శిక్షణను ఇవ్వగలిగినప్పుడే, మనకు నూతన టెక్నాలజీతో నడిచే హైటెక్ పరిశ్రమలకు అవసరమైన కార్మికులు తయారవుతారు. త్వరితగతిని మారిపోయే సాంకేతిక పరిజ్ఞానం కారణంగా, మన సాంకేతిక నిపుణులను, కార్మికులనూ, ప్రతి ఏడాదీ కనీసం ఒక నెల పాటైనా తిరిగి తర్ఫీదు ఇవ్వనిదే, వారు నూతన టెక్నాలజీని వినియోగించుకోలేరు. మన దేశంలో ప్రతి నెలా 13 లక్షలమంది యువకులు నిరుద్యోగ సైన్యంలోకి వచ్చి చేరుతున్నారు. 2050 సంవత్సరం నాటికి మనదేశంలో ఉద్యోగాలకోసం ఎదురుచూసే వారి సంఖ్య 100 కోట్లకు చేరుతుందని ఐక్యరాజ్య సమితి వారి అంచనా. గత 15 ఏళ్ళలో, ఉద్యోగార్థులలో 10శాతానికి కూడా ఉద్యోగాలు దొరకలేదు. నిరుద్యోగ యువకులలో సగానికి సగం మంది ఉద్యోగాల కోసం ఎదురు చూసిచూసి, నిరాశతో ఉన్నంతలో చిన్న చిన్న వ్యాపారాలలోనో, కూలీ పనులలోనో కాలం వెళ్లదీస్తున్నారు. మనదేశం గత 35 ఏళ్ళుగా విదేశీపెట్టుబడిని ఆహ్వానించి నయాఉదారవాద సంస్కరణలు చేపట్టినా, కీలకమైన అధునాతన టెక్నాలజీని సొంతం చేసుకోలేకపోయింది. ఈనాటికీ కూడా విదేశీ టెక్నాలజీ రానిదే అభివృద్ధి సాధ్యంకాదని అధికారంలో ఉన్నపార్టీలు కథలు చెప్తున్నాయి. దేశాభివృద్ధికి భారీ పరిశ్రమలు వెన్నెముక వంటివి. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత మొదటి 50 ఏళ్ళలో మనం ఉక్కు, యంత్ర పరికరాలు, రైళ్లు, ఓడలు, సిమెంటు, పెట్రోలియం తదితర రంగాలలో భారీ పరిశ్రమలను ప్రభుత్వరంగంలో స్థాపించుకోవటం వలననే, ఈనాడు మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే నాలుగవ పెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదగగలిగింది. నయాఉదావాద విధానాలతో, ఈ పారిశ్రామికీకరణ ప్రక్రియను నీరుగార్చి, దేశ అవసరాలతో సంబంధంలేకుండా, లాభార్జన దృష్టితోనే ప్రైవేటు రంగంలో పరిశ్రమల స్థాపన జరుగుతూండటంతో సమగ్ర అభివృద్ధి జరగకుండా, కొన్ని కీలక రంగాలలో మనం విదేశాలపై ఇప్పటికీ ఆధారపడవలసిన దుస్థితి ఏర్పడింది. మరొక పక్కన ఉద్యోగాల కల్పన కుంటుపడి, నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చింది. విదేశీపెట్టుబడితో పరిశ్రమలు స్థాపించి, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని పాలకులు పలికే పాచిమాటలకు కాలం చెల్లిపోయింది. ప్రారంభించిన పథకాలన్నీ విఫలమై, ప్రజలలో, ముఖ్యంగా యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొన్న ఈ పరిస్థితులలో, బీజేపీ సర్కారు కూడా తప్పనిసరై పారిశ్రామికీకరణ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన సాధ్యం కాదని, గ్రామాలలో ఉపాధి అవకాశాలు కల్పించటమే దీనికి పరిష్కారమనే సత్యం అవగతం చేసుకున్నది. చిన్న తరహా, కుటీర పరిశ్రమలను ఒక పక్కన నయాఉదారవాద విధానాలతో నాశనం చేస్తూ, మరొక పక్కన ఉపాధి అవకాశాలు కల్పిస్తామనటం పరస్పర విరుద్ధమైన ఆలోచనలు మాత్రమే. పెద్దస్థాయిలో కోట్లాది మందికి ఉపాధి



కంప్యూటర్ ఆధారిత నేత మగ్గాలు, సోలార్‌తో నడిచే చిన్న కెపాసిటీ శీతల గిడ్డంగులు

కల్పించాలనుకుంటే, ఏ ప్రభుత్వమైనా, నయా ఉదారవాద, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలకు స్వస్తి పలికి, ప్రజానుకూలమైన విధానాలను నిజాయితీతో అమలు చేయవలసి ఉన్నది. అది చేయనిదే, ఉపాధికల్పన తద్వారా ప్రజల జీవన ప్రమాణాల పెంపు అసాధ్యం. బడాపెట్టుబడిదారుల అండదండలతో అధికారానికి వచ్చి, ప్రజావసరాలను పక్కన పెట్టి, అదానీ - అంబానీలకు ఊడిగంచేయటమే ప్రధాన ధ్యేయంగా పనిచేసే బీజేపీ ప్రభుత్వానికి అది సాధ్యం కాని పని.

మన దేశ యువతలో ఎక్కువమంది చేతివృత్తుల కుటుంబాలకు చెందినవారు ఉన్నారు. వారికి అతితక్కువ సమయంలో తమ తమ వృత్తులలో శిక్షణ ఇచ్చి, గ్రామీణ ప్రాంతాలలో చిన్నతరహా, కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించటానికి సహాయం చేయటం ద్వారా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. చైనా అనుభవం ప్రకారం, ఈ చిన్నతరహా పరిశ్రమలకు నూతన టెక్నాలజీని అందిస్తూ, సహకారమిస్తే, అనతికాలంలోనే అవి అంతర్జాతీయ స్థాయికి ఎదగగలవు. దేశాభివృద్ధి జరగాలన్నా, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించాలన్నా ఈ విదేశీపెట్టుబడి అనే ఎండమావిని పక్కన పెట్టి, మనదేశంలోని నల్లధనాన్ని బయట కుతీసి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం ఒక్కటే పరిష్కారం. ఉదాహరణకు చేనేత రంగంలో వాడుతున్న మగ్గాలు, ఇతర పనిముట్లు వందల ఏళ్లనాటి పరిజ్ఞానంతో పనిచేస్తున్నాయి. ఈనాడు ప్రపంచవ్యాప్తంగా, అనేక దేశాలలో కంప్యూటర్ సహాయంతో, ఆధునిక పద్ధతులతో పనిచేయగలిగిన చిన్న తరహా నేతమగ్గాలను అభివృద్ధిచేసి, తమ కుటీరపరిశ్రమలను ఆధునీకరించుకుంటున్నారు. ఇవి కొన్ని లక్షల రూపాయలకు లభించగలవు. వీటిని మన స్వదేశీ టెక్నాలజీతో ఉత్పత్తిచేస్తే, ఇంకా తక్కువ ధరలకే లభించగలవు. వీటితో, చేనేత కార్మికుల ఉత్పత్తి అనేక రెట్లు పెరగగలదు. దేశవ్యాప్తంగా దారిద్ర్యంలో మగ్గుతూన్న కోట్లాది చేనేత కుటుంబాలను ఆదుకొని వారి బిడ్డలకు మంచి ఆదాయం లభించే అవకాశం కల్పించవచ్చును. కంప్యూటర్ సహాయంతో పనిచేసే ఈ మగ్గాలకు అవసరమైన డిజైన్లను తయారుచేయటానికి కంప్యూటర్ గ్రాఫిక్స్, టెక్స్‌టైల్ డిజైన్ చదివిన లక్షలాదిమంది యువతీ యువకులకు, ఈ మగ్గాలను సర్వీసింగ్ చేయటానికి మరిన్ని లక్షల మంది సాంకేతిక శిక్షణ పొందిన వారికి లాభదాయకమైన ఆదాయాన్ని కల్పించవచ్చును. ఇక మన దేశంలో పండే వ్యవసాయ ఉత్పత్తులలో 30 శాతానికి పైగా సరైన స్టోరేజీ సదుపాయాలు లేక, వేడిమి వలన నష్టపోతున్నాం. చికెన్, మాంసం, చేపలు, గుడ్లు, పాలు మొదలగు ఉత్పత్తులను నిల్వచేయటానికి సరైన సదుపాయాలు గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో లేవు. పెద్దసైజు శీతల గిడ్డంగులు ఉన్నా, అవి రైతుకు అందనంత దూరంలో ఉన్నాయి. పైగా తక్కువ మోతాదు నిల్వలకు ఈ కోల్డ్ స్టోరేజీ వారు ప్రాధాన్యత నివ్వరు. విద్యుత్ సరఫరా గ్రామీణ ప్రాంతాలలో సరిగా లేకపోవటంతో, కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లు డీజల్ పవర్ తో నడపవలసిన కారణంగా, వాటిలో స్టోరేజి ఖర్చులు సామాన్య రైతులకు అందుబాటులో ఉండవు. దానితో ఉత్పత్తులు పాడయేలోగా, ఉన్నకాడికి దళారులకు రైతులు అమ్ముకోవలసిన పరిస్థితి నేడు నెలకొని ఉన్నది. కాని 10 టన్నుల సామర్థ్యంలో, సోలార్ తో నడిచే చిన్న కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లను అతి తక్కువ ఖర్చుతో ప్రతి గ్రామంలోనూ, నాలుగైదు చొప్పున నెలకొల్ప వచ్చును. ఆవిధంగా కోట్లాదిమంది యువతకు జీవనాధారం కల్పించటమే కాకుండా, దాదాపు ఏటా నష్టపోయే 1.5 లక్షల కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను కాపాడుకోవచ్చును. తద్వారా రైతుల ఆదాయాలను పెంచవచ్చును. అంటే వీటిపై పెట్టే పెట్టుబడులు 1, 2 ఏళ్ళలోనే తిరిగి రాబట్టుకోవచ్చును. మనదేశంలో సగానికి పైగా గ్రామాలకు తాగటానికి శుద్ధిచేయబడిన మంచినీరు అందుబాటులో లేదు. 10 కోట్లమంది పైగా ప్రజలు కాలుష్యభరితమైన, తాగటానికి ఏవిధంగానూ పనికిరాని, ఫ్లోరైడ్ వంటి విషపదార్థాలు ఉన్న నీటినే త్రాగి, రోగాల బారిన పడుతున్నారు. సోలార్ టెక్నాలజీ సహాయంతో, మురికినీటిని కూడా తాగటానికి పనికి వచ్చేటట్లుగా శుద్ధి చేయగలిగిన నూతన టెక్నాలజీతో కూడిన పరికరాలు ఈనాడు చౌకలో లభ్యమవుతున్నాయి. ఇదేవిధంగా అనేక ఇతర చేతివృత్తులను ఆధునీకరించవచ్చును. అయితే, రైతుల, చేతి వృత్తి కార్మికుల ఉత్పత్తులను, మధ్యదళారీల దోపిడీకి గురికాకుండా, సహకార మార్కెటింగ్ సంస్థలను అభివృద్ధి చేసి, లాభాలన్నీ మొత్తంగా ఉత్పత్తిదారులకు అందేటట్లు చేయటం ద్వారా వారి స్థితిగతులను అతితక్కువ కాలంలో మెరుగుపరచగలుగుతాం. కోట్లాది కుటుంబాలకు వారి సొంత గ్రామాలలోనే మెరుగైన జీవనోపాధిని కల్పించగలుగుతాం. కోట్లాది మందికి ఈవిధంగా జీవనోపాధి కల్పించగలిగినప్పుడు, వారి కొనుగోలు శక్తి పెరిగి, అంతకంటే రెండు, మూడురెట్ల మందికి వ్యాపారాలలో, సర్వీసు రంగాలలో ఉద్యోగాలు, ఉపాధి కల్పించ గలుగుతాం. దేశంలో వస్తు వినియోగం పెరిగి, పారిశ్రామిక ఉత్పత్తి ఊపందుకుంటుంది. అప్పుడు పారిశ్రామిక రంగంలో కొత్త ఉద్యోగాలు కల్పించగలుగుతాము. ఈ విధంగా చర్యలు చేపట్టటానికి, ఏటా మూడు, నాలుగు లక్షల రూపాయలు కేంద్రబడ్జెట్ లో కేటాయించాల్సి ఉంటుంది. అయితే, ప్రజాసంక్షేమ పథకాలను, ప్రజారోగ్యం, ప్రాథమిక విద్య వంటి కీలక రంగాలలో రానురాను తీసికట్టుగా కేటాయింపులు చేస్తుంటే, ఈ ప్రభుత్వం పైన చెప్పినటువంటి చర్యల ద్వారా పెద్దఎత్తున ఉపాధి కల్పిస్తుందని నమ్మితే, మనం పగటికలలు కంటున్నట్లే. ఏదాదికి 2.5 లక్షల కోట్ల రూపాయల బ్యాంకు సొమ్ములను బడాపెట్టుబడిదార్లకు నిరర్థక అప్పులుగా ఈ ప్రభుత్వం ధారపోస్తున్నది. ఏటా పన్నురాయితీల రూపంలో 7, 8 లక్షల కోట్ల రూపాయలను అపర ధనికుల జేబుల్లోకి చేరుతున్నది. ఈ పన్నురాయితీల వలన, దేశ ఆర్థిక వ్యవస్థకు, పేద ప్రజలకు ఒరిగినది ఏమీలేదు. ఇవన్నీ కాక, మన వార్షిక బడ్జట్‌కు రెట్టింపు మొత్తాలు ధనిక వర్గం వ్యవసాయపు ఆదాయంగా చూపించి, పన్నులు ఎగగొడుతున్నది. మన దేశంలో వ్యవసాయ సబ్సిడీలుగా ఇస్తున్న దాదాపు 8 లక్షల కోట్ల రూపాయలలో, 90శాతం బడా కంపెనీల, బహుళ జాతి సంస్థల కంపెనీలకు చేరుతోంది. మిగిలిన 80 వేల కోట్ల రూపాయలలో, అధిక భాగాన్ని ధనిక రైతులు హస్తగతం చేసుకుంటున్నారు. ఇవన్నీ చాలదన్నట్లుగా ఏటా 35 లక్షల కోట్లరూపాయలకు పైగా నల్లధనం తయారవుతున్నదని, అందులో చాలాభాగం విదేశీ బ్యాంకులకు తరలిపోతున్నదని అధికారిక లెక్కలే చెప్తున్నాయి. అంటే, వెరసి, ఈదేశంలో ఉత్పత్తి అవుతున్న సంపదలో 80 లక్షల కోట్ల రూపాయల వరకూ ధనికవర్గాల చేతుల్లోకి పోతున్నది. ఈ దేశంలో ఉత్పత్తి అయే సంపద, ఈ దేశ ప్రజలందరి సంక్షేమానికి వాడనిదే, దేశ అభివృద్ధి సాధ్యపడదు. అంటే, ధనిక వర్గాలు హస్తగతం చేసుకునే సంపదలో కనీసపక్షాన 5శాతం అంటే 4 లక్షల కోట్లు అయినా ఉపాధికల్పనకు ఖర్చుచేస్తే, సాలుకు 10 కోట్ల మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించవచ్చుననటంలో ఏవిధమైన అతిశయోక్తి ఉండజాలదు. ఇక నల్లధనాన్ని, మొత్తంగా ధనిక వర్గాలు కబళిస్తోన్న 80 లక్షల కోట్ల రూపాయలలో, 5శాతం ఖర్చు చేస్తేనే ఇంత మంచి ఫలితాలు సాధ్యమయినప్పుడు, ఈ దొంగ సొమ్ములను మొత్తంగా దేశాభివృద్ధికే వాడగలిగినప్పుడు, ప్రజల అభ్యుదయం ఏస్థాయిలో ఉంటుందో ఊహించుకోవటం పెద్ద కష్టతరమేమీకాదు. కాని ఆశ్రిత పెట్టుబడి దారీ పంథాలో, నయాఉదారవాద విధానాలను అనుసరించే ఈ ప్రభుత్వం, 180 డిగ్రీలు వెనక్కి తిరిగి, ప్రజలకు ఉపాధి కల్పిస్తుందని మనం నమ్మగలమా? అందుకు పెట్టుబడిదారీ విధానాలకు తిలోదకాలు ఇచ్చి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేయగలిగిన వామపక్ష, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం నిర్మించవలసిన తక్షణ అవసరం ఎంతైనా ఉన్నది.

(6వ భాగం వచ్చేఆదివారం)

-వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు.
సెల్ : 09848933545

స్మార్ట్ ఫోన్ల సమాజం



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

కాళ్ళు చేతులు, కళ్ళు చెవులు లేనివారున్నారు. సెల్లేని వారు అరుదు. అది అమ్మ నాన్నల, భార్యాభర్తల, సంతాన స్థానాలను ఆక్రమించి భ్రష్టు పట్టించింది. మానవ శరీర బాహ్యాభాగమైంది. చివరికి మనిషే మొబైల్లో దూరాడు.

కంప్యూటర్ సౌకర్యా లుగల మొబైల్ ఫోన్‌ను స్మార్ట్ ఫోన్ అంటారు. అదిబహుళ ప్రయో జన నిస్తంత్రీ హస్త యంత్రం. నేటి విద్యార్థులు, యువత గంటకు 10 సార్లు సెల్ ఫోన్ చూస్తారని పరిశోధనలో తేలింది. ప్రపంచవ్యాపితంగా యువకులు సామాజిక మాధ్య మాలకు బానిసలు.స్మార్ట్ ఫోన్లతో సమాచారసామర్థ్యం, నైపుణ్యత పెరుగుతాయి. అరబ్ వసం తవిప్లవం, నిర్భయ నిరసనలు, ప్రజాసంఘాల ఆందోళనా కార్యక్రమాలలో సామాజిక మాధ్యమాలు ప్రధాన పాత్ర పోషించాయి. మాధ్యమాల ప్రభావాల అధ్యయనం, విశ్లేష ణల అమెరికన్ సంస్థ 'కామ్స్కోర్' 2017 నివేదికలో, పెద్దలు సగం మొబైల్ వీక్షణ సమయాన్ని మొబైల్ యాప్స్ లో గడుపుతున్నారని పరిశోధనా నిర్దేశకుడు డేవిడ్ గిన్స్బర్గ్, శాస్త్రజ్ఞుడు మోయిర బర్క్ సూత్రీకరించారు. ఫేస్ బుక్ లో ప్రయోజనంలేని వాదసం వాదాలు, చర్చలు వ్యసనంగా మారాయి. రాత్రంతా ఈ రాచకార్యాలు కొనసాగుతాయి. సమయ సదుపయోగ జ్ఞానముండదు. ఈ వ్యసనం ఓపియం, హెరాయిన్ల కంటే ఎక్కువ మత్తులో ముంచుతుంది. భ్రమల్లోపడి నిస్సార అంశాలపై అనుత్పాదక ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. మానవీయత మాయమవుతోంది. పిల్లలు కళ్ళ ముందేచెడిపోతున్నారు. అసాంఘిక, అశ్లీల మాధ్యమ సాధనాలను, అంతర్జాలాన్ని ఆవిష్కరించి జనాల మీదికి వదిలిన శాస్త్రజ్ఞులకు మానవత్వ, సమాజ వినాశనాలు పట్టవు. ధనసంపాదనే వీరి లక్ష్యం.

స్మార్ట్ ఫోన్ల ప్రభావం : మొబైల్ ఫోన్ల అతి వినియోగంతో అలసట, తలనొప్పి, నిద్రలేమి, మతిమరుపు, చెవుల గింగుర్లు, నడుము, కీళ్ళ నొప్పులు వస్తాయి. స్మార్ట్ ఫోన్లతో ఉద్యోగ, వ్యక్తిగత జీవితాలు కలగాపుల గమయ్యాయి. ప్రైవేట్ కంపెనీలలో ఈ జీవితాల విభజనరేఖ ఉండదు. ప్రభుత్వ ఉద్యో గాలలో వ్యక్తిగత జీవితాలు ఉద్యోగ సమయాలలో కొన సాగుతాయి. పనివేళల్లో, సమావేశ సమయాల్లో విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు ఫోన్లలో లీనమవు తున్నారు. ఉద్యోగుల సంభాషణ ముగిసేటప్పటికి ముందున్న కంప్యూటర్ ఆగిపో తుంది. మరలా వేళ్ళ గుర్తులేసి ఆన్ చెయ్యాలి. ఈ సహస్రాబ్ది తరం మనస్తత్వం బతకడానికి పనిచే యడం కాకుండా పనిచేయడానికి బతకడంగా మారింది. స్మార్ట్ ఫోన్లు ఉద్యోగులను తికమక పెట్టి పరధ్యానంలో ముంచి ఉత్పాదకతను తగ్గిస్తున్నా యని,అవి లేనప్పుడు ఉత్పాదకత26% పెరిగిందని అమెరికా కాస్పర్స్కి ప్రయోగ శాల రుజువుచేసింది. ఉత్తమ సేవలందించి సంస్థల ప్రతిష్ఠ నిలపడానికి స్మార్ట్ ఫోన్ వినియోగ విధానాన్ని అమలుచేయాలి. ఉద్యోగసమయాల్లో స్మార్ట్ ఫోన్ల వాడకాన్ని నియంత్రించాలి.

మాధ్యమాలతో మానవప్రవర్తన : సామాజిక మాధ్య మాలతోసమస్యాత్మక ప్రవర్తన, స్పందనప్రతిస్పందనలు, అతి కాలయాపన సామాజిక మాధ్యమాల వ్యసనం. సామాజిక మాధ్యమాలకూ రెండు పార్శ్వాలున్నాయి. కాలయాపన, పరధ్యానం, తప్పుడు అంచనాలు, అవాస్తవ ఆకాంక్షలు, సామాజిక ముసుగు, అణచివేత ఒకవైపు. ప్రపంచ అనుసం ధానంతో జ్ఞానసముపార్జన, వ్యాపారాభివృద్ధి, నూతన సంబంధాలతో వ్యక్తిగత ప్రగతి, సమాజాభివృద్ధి అవకాశాలు మరోవైపు. కంప్యూటర్ల పని ఇప్పుడు స్మార్ట్ ఫోన్లతో సాధ్యం.ఫోన్ చూడకపోతే ఏదో కోల్పోతామన్న భయంతో దానికి బందీలైవిధులను, ఉద్యోగాలను అశ్రద్ధచేస్తున్నారు. భార్యాబిడ్డలతో గడపరు. దాంపత్య జీవితానికీ దూరమవు తున్నారు.మనుషుల మనస్తత్వం, ప్రవర్తన, విద్య, సమాచార నైపుణ్యతలు, సామాజిక సంబంధాలు, అనుభవాలు దిగజారాయి. సామాజిక మార్పిడి సిద్ధాంతం మందగించింది. సామాజిక అభిజ్ఞ సిద్ధాంతం పతనమైంది.వృత్తి ప్రాధాన్యతలు మారాయి. పరస్పర ప్రభావాలకు గురయి కల్పితాలలో ఊహలలో కూరుకుపోయారు. ఇతరులు మనకంటే పరిపూర్ణ జీవితాలు గడుపుతున్నారన్న భ్రమలో మెరుగైన జీవితాల వేటలో విలువైనసమయం వృథా అవుతున్నది. చాలామంది సామాజిక మాధ్యమాలలో ఇరుక్కొని ధన మాన ప్రాణాలు కోల్పోయారు. నిజానికి ప్రపంచంలో ఎవరి జీవితమూ సంపూర్ణం కాదు. ఒక్కొక్కరి జీవితం ఒక్కొక్క జీవనశైలిలో ఉంటుంది. మాధ్యమాలలో పొగడ్తలను చూసి తీవ్ర మోహాన్ని పెంచుకుంటారు. ఎవరో ఆదర్శంగా ఉన్నారని భ్రమించి అనుకరించి జీవితాలను కోల్పోతారు. పరులతో పోలిక పోటీలతో ఆతురత, వత్తిడి మానసికాందోళన పెరుగుతాయి. మానసిక, ఆర్థిక, సామాజిక ఆరోగ్యాలు చెడి ఆత్మవిచ్ఛిత్తికి, ఆత్మహత్యలకు దారితీస్తుంది. ఫేస్ బుక్ లో లైకులు మన సామర్థ్యానికి కొలబద్ద కాదు. మా నాన్న చనిపోయాడన్న సమాచారాన్ని వందలమంది లైక్ చేశారు. దినచర్యను మార్చుకొని అవకాశాలను వినియోగిం చుకుంటూ ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ పొదుపుగా ఖర్చుపెడుతూ మరింత కష్టపడటమే కలల సాకారానికి మార్గం. సామాజిక మాధ్యమాలు అహంకార సాధనాలు కారాదు. అందిన సమాచారాన్నివిశ్లేషించి సరైందని నిర్ధారిం చుకొని ఇతరులతో పంచుకొని సామూహిక, సామాజిక ప్రగతికి దోహదపడాలి. పరుల ప్రాపకాన్ని పొందాలి. వైవిధ్యంగా ప్రవర్తించి ఎదిగినవారి జీవితాలను అధ్యయనం చేయాలి. సొంత ప్రతిమను నిర్మించుకోవాలి. సౌకర్యం చావుకు అసౌకర్యం సృజనాత్మకతకు దారితీస్తాయని ఫ్రెంచ్ రచయిత, కళాకారుడు జీన్ కాక్టో అన్నారు. ఫ్రాన్స్ పాఠశాలల్లో విద్యార్థులకు మాధ్యమ పరికరాలను నిషేధించారు. మన దేశంలో కొన్నిపాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులకు మాత్రమే మొబైల్ ఫోన్లను నిషేధించారు.బహుళప్రయోజన పరికరవినియోగాన్ని పెద్ద లకు కొనసాగిస్తూ పిల్లలకు నిషేధించడం సమంజసమా? సాంకేతికత దురు పయోగాన్ని అరికట్టాలి కాని ఫోన్లను నిషేధించి ప్రయోజనం లేదు. హింస, అసభ్య దృశ్యాలు, అసత్య ప్రచార ప్రకటనలకు భయాందోళనలు చెందినా పిల్లలకు నేర్చుకునే అవకాశాలు, క్రియాశీలత మెరుగు పడతాయని తల్లిదండ్రుల ఆశ.16 ఏళ్ళ లోపు పిల్లలకు తల్లిదండ్రుల అనుమతితో సామాజిక మాధ్యమాలు అందు బాటులో ఉండాలి. 8 ఏళ్ళ పిల్లలుయు ట్యూబ్ లో, వీడియో ఆటలలో మునుగుతున్నారు. పేదల పిల్లలే ఈ వ్యర్థవ్యాప కంలో నిష్ప్రయోజనంగా సమయాన్ని కోల్పోతున్నారని సర్వేలలో తేలింది. రెక్కాడితే గాని డొక్కాడని శ్రమజీవులకు పిల్లలపై శ్రద్ధ పెట్టగల సమయముండదు. ఈ వ్యసనం కొత్త మత్తుకు రహదారి అని పేదలకు తెలియదు. అందువలన ప్రయోజ నాలను పొందుతూనే పరధ్యానాలను నివారించే మాయ జాలాన్ని కనుగొనాలి. స్మార్ట్ ఫోన్లలో మన సమయాన్ని హరిస్తున్న అనవసర వెబ్ సైట్లను నిషేధించవచ్చు. లేదా పరిమితం చేయవచ్చు. వర్చువల్ ప్రైవేట్ నెట్వర్క్స్, ఫైర్ వాల్స్, కంటెంట్ ఫిల్టర్స్, బ్లాకింగ్ టూల్స్ ఉపయోగించి అనవసర, అపాయకర సమాచారాలను అరికట్టవచ్చు. అభ్యంతర అంతర్జాల అంశాలను మొబైల్ ఫోన్ల నుండి తొలగించవచ్చు. వీక్షణ సమయాన్ని పరిమితం చేసే యాప్ లను స్థాపించవచ్చు. అపాయకర యాప్‌లు తెరుచు కోకుండా, అవసరమైన యాప్ లు మాత్రమే తెరుచు కునేటట్లు తాళాలు ఏర్పాటు చేయవచ్చు. నిర్దిష్ట సమయాలలోనే స్మార్ట్ ఫోన్లు పనిచేసేటట్లు చేయవచ్చు. మిగతా వేళల్లో కేవలం ఫోన్ పనిచేస్తుంది. మనసు నిషేధాల వైపు లాగుతుంది. ఇది పిల్లల విషయంలో మరింత తీవ్రతరం. ఈ రోజు కాకపోతే రేపు పిల్లలు ఫోన్లను వాడవలసినవారే. అనంతరీతుల్లో ప్రయోజనాల నందించే ఫోన్లను వారికి దూరం చేయరాదు. వాటిదురుపయోగాన్ని నివారించాలి. మొబైల్ ఫోన్లను సులభంగా సర్దవచ్చు. మెదళ్ళను దిద్దలేము. అందుకే మానవోన్నతికి అనుగుణంగా పరికరాలను నియంత్రించాలి. అవరమైన యాప్ లనే ఆవిష్కరించాలి. మొబైల్ అడిగినప్పు డల్లా కాకుండా అవసరమొచ్చినప్పుడే ఫోన్ చూడాలి. సాంకేతికత, సమస్యలను పరిష్కరించాలి. కొత్త సమస్యలను సృష్టించరాదు. జీవితాలను సుఖమయం చేయాలి. సంక్లిష్టం చేయరాదు. మానవత్వాన్ని పెంచాలి. తుంచరాదు. ప్రజలను దగ్గరచేయాలి. దూరం చేయరాదు. మానవత్వీకరించాలి. దానవత్వీకరించరాదు.

సెల్ ఫోన్ రేడియేషన్ క్యాన్సర్ కారకమనడం అపోహ. కొన్నిఆరోగ్య సమస్యలురావచ్చు. రేడియేషన్ ప్రభావం తగ్గించడానికి ఇయర్ ఫోన్లు వాడాలి. సిగ్నల్ బాగా ఉన్నప్పుడే ఫోన్ ఉపయోగించాలి. సిగ్నల్ బలహీనంగా ఉన్నప్పుడు ఎక్కువ విద్యుత్తు ఖర్చయి రేడియేషన్ పెరుగుతుంది. మొబైల్ ను గంటల తరబడి వాడరాదు. ఎక్కువసేపు మాట్లాడడానికి లాండ్ లైన్ వినియోగించాలి. వాహనాలు నడిపేటప్పుడు, విద్యుత్తు పరికరాల పరిసరాలలో మొబైల్ వాడరాదు. చిన్న పిల్లలు మొబైల్ వాడకపోవడమే మంచిది.

ప్రస్తుతంమతవాదులు, మూఢవిశ్వా సకులు, అసత్య, అశాస్త్రీయ,పాలకవర్గాలు ప్రజాభిప్రాయాన్ని అనుకూలంగా మలుచుకోడానికి, రాజకీయ లబ్ధికి సామాజిక మాధ్యమాలను దురుపయోగం చేస్తున్నారు. హేతువాదులు, ప్రగతి కాము కులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు, ప్రత్యామ్నాయ పక్షాలు స్మార్ట్ ఫోన్లను విరివిగా ఉపయోగించాలి. ప్రజాప్ర యోజనం సామాజిక మాధ్యమాల ధ్యేయం కావాలి. విజ్ఞాన శాస్త్ర ఉపయోగంలోనిర్మాణ వినాశనాలకు మానవ ప్రవర్తనే మూలం.స్మార్ట్ ఫోన్లతో జీవితాలను నిర్మించుకుంటారో, నాశనం చేసుకుంటారో అంతా మనుషుల చేతుల్లోనే ఉంది.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
చరవాణి: 94 90 20 45 45

విశాలాంధ్ర
బతుకు
The Life
ఆదివారం
07 జనవరి 2018

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com



సంక్రాంతి రుచులు



పండగంటే పిండివంటలు గుర్తుకొస్తాయి. పెద్ద పండగ అంటే ఇక రుచులకు కొదవేముంది. కానీ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో రోజువారీ వంటలు చేయడమే కష్టంగా ఉంది. మరి పిండివంటలు చేసేందుకు సమయమెక్కడ! నేటి రోజుల్లో దాదాపుగా అన్నీ బయట కొనుక్కుని తెచ్చుకోవడమే జరుగుతోంది. ఇలా ఈ క్రమంలో ఇళ్ళల్లో సంప్రయదాయ వంటకాల తయారీనే మర్చిపోతున్నారు. అమ్మమ్మలు, బామ్మలు ఉన్న ఇళ్ళల్లో తప్ప ఎక్కడా ఇంటి రుచులు, పండగ రుచులు, పిండి వంటల రుచులు కనిపించడం లేదు. మరి ఈ పెద్ద పండగకైనా ఇంట్లో ఏమైనా తయారు చేద్దామనుకుంటున్నారా! పిల్లలకు పాత రుచులనే సరికొత్తగా మీ చేత్తో వండిపెడదామనే ఆలోచన చేస్తున్నారా! ఏది ఎలా చేయాలి? అని మధనపడుతున్నారా! అయితే ఈ సంప్రదాయ వంటకాల తయారీ వివరాలు మీ కోసమే....పండగ అంటే సంప్రదాయ వంటలేగా ప్రసిద్ధి....అందుకే ఈ సంక్రాంతి సీజన్‌లో సంప్రదాయ వంటల తయారీ వివరాలు....

కట్టె పొంగలి



కావలసిన పదార్థాలు :

ముప్పావు కప్పు బాస్మతి బియ్యం, పావు కప్పు పెసరపప్పు, ఒక టేబుల్ స్పూన్ నెయియ, అర టీ స్పూన్ జీలకర్ర, మూడు పచ్చిమిర్చి, అర టీ స్పూన్ అల్లం, కొద్దిగా కరివేపాకు, ఒక టీ స్పూన్ మిరియాలు, చిటెకెడు ఇంగువ, ఉప్పు రుచికి సరిపడ, మూడు కప్పుల నీళ్ళు, పన్నెండు జీడిపప్పులు.

తయారీ విధానం :

బియ్యం, పెసరపప్పు కడిగి పక్కన పెట్టుకోవాలి. అల్లం, పచ్చిమిర్చి సన్నగా తురిమి ఉంచుకోవాలి. బాగా లోతున్న గిన్నె తీసుకుని పొయ్యి మీద పెట్టి వేడి చేసి అందులో నెయ్యి వేయండి. అది వేడెక్కిన తర్వాత జీలకర్ర, కరివేపాకులు, పచ్చిమిర్చి, మిరియాలు, ఇంగువ, అల్లం తురుము వేసి కొన్ని క్షణాలు ఉంచండి. ఇక ఇప్పుడు ముందుగా కడిగి పెట్టుకున్న బియ్యం, పెసరపప్పు వేసి కొద్దిగా వేయించండి. తర్వాత సరిపడ నీళ్ళు, ఉప్పు వేసి ఉడకనివ్వండి. పప్పు, బియ్యం బాగా ఉడకడానికి తగినంత నీళ్ళు పోయాలి. పైన మూత పెట్టేయండి. నీళ్ళు అన్నీ పూర్తిగా ఆవిరి అయ్యేవరకూ ఉంచాలి. పూర్తిగా ఉడికితే పొంగలి రెడీ అయినట్లే. ఆ పైన ముందుగా వేయించి పెట్టుకున్న జీడిపప్పులు వేయండి. ఇది వేడిగా తింటే రుచి బాగుంటుంది. సన్నాలు, సోనా మసూరి లాంటి బియ్యం దీనికి బాగుంటాయి. ఇందులో వేసే అల్లం, మిరియాలు పారేయకుండా తింటే ఆరోగ్యానికి మంచిది.

స్వీట్ పొంగలి



కావలసిన పదార్థాలు :

ఒక కప్పు బియ్యం, అరకప్పు పెసరపప్పు, ఒకటిన్నర కప్పు బెల్లం, నాలుగున్నర కప్పులు నీళ్ళు, పావు టీ స్పూన్ ఉప్పు, అర టీ స్పూన్ యాలకుల పొడి, మూడు టేబుల్‌స్పూన్‌ల నెయ్యి, పదిహేను జీడిపప్పులు, రెండు టేబుల్ స్పూన్‌ల కిస్‌మిస్‌లు.

తయారీ విధానం :

బియ్యాన్ని శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. పొయ్యి మీద పాన్ పెట్టి వేడి చేసి అర టేబుల్ స్పూన్ నెయ్యి వేయండి. ఇందులో జీడిపప్పు, కిస్‌మిస్‌లు వేసి వేయించి ప్లేట్‌లోకి తీసి పక్కన పెట్టుకోండి. ఇదే పాన్‌లో పెసరపప్పు వేసి ఎరుపురంగు వచ్చేవరకూ దోరగా వేయించి పక్కన పెట్టుకోండి. పొయ్యి మీద మరో గిన్నె పెట్టి తురుమిన బెల్లం వేయండి. బెల్లం అంతా పూర్తిగా కరిగిన తర్వాత దానిని వడకట్టి చల్లారనివ్వండి. మరో గిన్నెలో కొద్దిగా నీళ్ళు పోసి మరగనివ్వండి. సన్నని మంట ఉంచి నీళ్ళు మరగడం ప్రారంభమైన తర్వాత అందులో బియ్యం వేయండి. కడిగి పెట్టుకున్న పెసరపప్పు వేయండి. బియ్యం బాగా ఉడికేవరకూ, బియ్యం పెసరపప్పు మిశ్రమం చిక్కగా దగ్గరపడేవరకూ ఉంచండి. మంట తగ్గించి బెల్లం సిరప్‌నూ ఈ మిశ్రమంలో వేయండి. తర్వాత యాలకుల పొడి, ఉప్పు, వేయించిన జీడిపప్పులూ, కిస్‌మిస్‌లు వేయండి. రెండు, మూడు నిముషాల తర్వాత పొయ్యి కట్టేయండి. అంతే స్వీట్ పొంగలి రెడీ. వేడిగా కావాలనుకుంటే ఐదు నిముషాలు ఆగితే చాలు. అదే చల్లగా తినడానికి ఇష్టపడేవారు దీనిని ఫ్రిజ్‌లో పెట్టండి. స్వీట్ పొంగలి వేడిగానైనా, చల్లగానైనా ఎలా తిన్నా బాగుంటుంది. దీనిని రుచికరంగా చేసుకోవాలంటే వండేటప్పుడు తెలుసుకోవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. అవి 1. బియ్యం పూర్తిగా ఉడికిన తర్వాతే బెల్లం సిరప్ వేయండి. 2. బెల్లం సిరప్ వేసిన తర్వాత మంటను పూర్తిగా సిమ్‌లో ఉంచండి. 3. బెల్లం అందుబాటులో లేనప్పుడు దీనిబదులు పంచదారనైనా వాడుకోవచ్చు. 4. చివరలో జీడిపప్పులు, కిస్‌మిస్‌లు వేసేటప్పుడు నేతిలో వేయించిన తాజా కొబ్బరినీ వేసుకోవచ్చు.

హల్వా బూరెలు



కావలసిన పదార్థాలు

మినపప్పు అరకప్పు, ఒక కప్పు బియ్యం, ఒక టీ స్పూన్ బెల్లం తురుము, చిటెకెడు ఉప్పు, హల్వా తయారీ కోసం కావలసినవి...ఒక కప్పు ఉప్మారవ్వ, అరకప్పు పంచదార, పావుకప్పు నీళ్ళు, పావుకప్పు కరిగించిన నెయ్యి, కొద్దిగా యాలకుల పొడి.

తయారీ విధానం

మినపప్పు, బియ్యం కొన్ని గంటలు నానబెట్టి శుభ్రంగా కడిగి మిక్సీ పట్టుకోవాలి. ఈ పిండి దోశెల పిండి మాదిరిగా ఉండాలి. ఇందులో చిటెకెడు ఉప్పు, బెల్లం కూడా వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోండి. మరో గిన్నె తీసుకుని పొయ్యి మీద పెట్టి వేడి చేసి ఇందులో పంచదార, యాలకుల పొడి, నీళ్ళు పోయండి. పంచదార పూర్తిగా కరిగిపోయి ఉడకడం ప్రారంభమైన తర్వాత గిన్నె పొయ్యి మీద నుంచి దించి పక్కన పెట్టుకోండి. బాగా లోతున్న గిన్నె తీసుకుని నెయ్యి వేసి కరగనివ్వండి. ఇందులో ఉప్మారవ్వ వేసి ఏడెనిమిది నిముషాలు వేగనివ్వండి. తర్వాత నెమ్మదిగా ఇందులో పంచదార పాకం వేయండి. ఇది ఉండలు చుట్టుకుపోకుండా బాగా కలుపుతూనే ఉండాలి. ఇదంతా బాగా చిక్కబడేవరకూ ఉంచండి. చివరలో మూడు, నాలుగు నిముషాలు సన్నని మంట మీద ఉంచి తర్వాత పొయ్యి కట్టేయండి. ఈ మిశ్రమాన్ని కొంచెం చల్లారనివ్వండి. చేతికి పట్టేంత వేడిలో ఉండగా ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండలుగా చేయండి. ఇవే హల్వా ఉండలు. ఈ ఉండలు చుట్టడానికి ముందు చేతులకు నూనె లేదా నెయ్యి రాసుకోవడం మర్చిపోవద్దు. బాగా లోతున్న గిన్నె తీసుకుని పొయ్యి మీద పెట్టి నూనె వేసి కాగనివ్వండి. తర్వాత బియ్యం, మినపప్పు పిండిలో హల్వా ఉండలు ముంచి వాటిని నూనెలో వేసి వేయించండి. గిన్నె సైజును బట్టి ఒక్కోసారి నాలుగైదు ఉండలు వేయవచ్చు. ఇవి వేగితే హల్వా బూరెలు రెడీ. గాలి చొరబడని డబ్బాలో ఉంచితే మూడు, నాలుగు రోజులు నిల్వ ఉంటాయి. ఈ బియ్యం, మినపప్పు పిండి కొంచెం చిక్కగా ఉంటే బూరెలు చిదిగిపోకుండా మంచి ఆకారంలో బాగా వస్తాయి. హల్వా ఉండలు అయిపోతే, ఇంకా బియ్యం, మినపప్పు పిండి మిగిలిపోతే ఇందులో కొద్దిగా ఉప్పు, జీలకర్ర, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, పచ్చిమిర్చి ముక్కలు వేసి పునుగుల్లా వేసుకోవచ్చు.

సొరకాయ పాయసం



కావలసిన పదార్థాలు :

రెండున్నర కప్పుల తక్కువ వెన్న ఉన్న పాలు, ఒక కప్పు సొరకాయ తురుము, నాలుగు టేబుల్ స్పూన్‌ల పంచదార, అర టీ స్పూన్ యాలకుల పొడి, ఒక టీ స్పూన్ పాలల్లో కలిపిన చిటెకెడు కుంకుమ పువ్వు, జీడిపప్పు, బాదం, అర టేబుల్ స్పూన్ నెయ్యి.

తయారీ విధానం :

ముందు సొరకాయను బాగా తురిమి నీళ్ళు లేకుండా పిండేసి పక్కన పెట్టుకోవాలి. పొయ్యి మీద గిన్నె పెట్టి వేడి చేసి నెయ్యి వేసి కాగాక అందులో జీడిపప్పు, బాదం పలుకులు వేసి గోధుమరంగులోకి వచ్చేవరకూ వేగనివ్వండి. ఇదే గిన్నెలో సొరకాయ తురుమును వేసి ఐదారు నిముషాలు ఉంచండి. ఇందులో ముందుగా మరగబెట్టి ఉంచిన పాలు పోయండి. మంట స్విమ్‌లో పెట్టి పావుగంట ఉంచండి.

ఇవి మరగడం ప్రారంభమైన తర్వాత పంచదార వేసి మరో పది, పన్నెండు నిముషాలు ఉంచండి. ఇందులో యాలకుల పొడి, కుంకుమ పువ్వు, జీడిపప్పు, బాదం వేయండి. అంతే సొరకాయ పాయసం రెడీ. దీనిని వేడిగా తిన్నా, చల్లగా తిన్నా రుచికి బానే ఉంటుంది.

బొప్పాయి, క్యారెట్ హల్వా

కావలసిన పదార్థాలు

బొప్పాయి తురుము నాలుగు కప్పులు, క్యారట్ తురుము ఒక కప్పు, అర కప్పు పంచదార, ముప్పావు కప్పు పాలు, అర టీ స్పూన్ యాలకుల పొడి, కొద్దిగా కుంకుమ పువ్వు, రెండు టేబుల్ స్పూన్‌ల బాదం, పావు కప్పు నెయ్యి,

తయారీ విధానం

వెడల్పాటి పాన్ తీసుకుని నెయ్యి వేసి కాగాక బొప్పాయి, క్యారట్ తురుము వేయండి. సువాసన వచ్చేవరకూ వీటిని వేయించండి. తర్వాత ఇందులో పాలు, పంచదార వేసి స్విమ్‌లో ఉంచండి. పాలు బాగా చిక్కబడేవరకూ ఉంచండి. పాలతో పాటు మొత్తం ఈ మిశ్రమం అంతా చిక్కగా అవుతుంది. పాలు అన్నీ ఇంకిపోయిన తర్వాత, ఈ మిశ్రమం బాగా చిక్కబడిన తర్వాత ఇందులో టేబుల్ స్పూన్ నెయ్యి వేసి కలపండి. చివరగా యాలకుల పొడి, కుంకుమ పువ్వు, బాదం ముక్కలు వేయండి. అంతే బొప్పాయి, క్యారట్ హల్వా రెడీ. పొయ్యి కట్టేసి, గిన్నె దింపేసి మరో ప్లేట్‌లోకి దీనిని తీసుకోవడమే తరువాయి ఎంచక్కా ఆరగించేయవచ్చు.



చంద్రకాంతలు



కావలసిన పదార్థాలు :

ఒక కప్పు పెసరపప్పు, ఒకటిన్నర కప్పు పంచదార, అరకప్పు తాగా కొబ్బరి తురుము, పావుకప్పు తరిగిన జీడిపప్పులు, ఒక టీ స్పూన్ యాలకుల పొడి, కొద్దిగా ఉప్పు, వేయించడానికి సరిపడ నూనె.

తయారీ విధానం

పెసరపప్పును శుభ్రంగా కడిగి నానబెట్టాలి. గంట తర్వాత నీళ్ళు వంపేసి మిక్సీలో వేసి కొంచెం నీళ్ళు పోసి మెత్తగా చేయండి. దీనిని నీళ్ళు పోయకుండా కూడా మిక్సీ పట్టవచ్చు. బాగా లోతున్న గిన్నె తీసుకుని పంచదార, తురిమిన కొబ్బరి, జీడిపప్పులు, మిక్సీ పట్టిన పెసరపప్పు పేస్ట్ వేసి బాగా కలపండి. ఈ గిన్నె పొయ్యి మీద పెట్టి పంచదార కరిగేవరకూ ఉంచండి. ఇది ఉడకడం ప్రారంభమైన తర్వాత బుడగలు రావడం మొదలవుతుంది. మంటను స్విమ్‌లో ఉంచి బాగా చిక్కబడేవరకూ ఉంచండి. ఇది అడుగంటిపోకుండా అస్తమానూ గరిటెతో కలుపుతూనే ఉండాలి. ఇది చిక్కబడిన తర్వాత దించేసి యాలకుల పొడి, ఉప్పు వేసి కలపండి. ఒక ప్లేట్‌లో లేదా తడి గుడ్డ మీద ఈ మిశ్రమం అంతా పోసి మొత్తం అంతా సమానంగా పరచండి. కొంచెం చల్లారిన తర్వాత దీనిని మీరు అనుకున్న ఆకారంలో ముక్కలుగా కట్ చేయండి. వేడి మీద ఉండగానే ఈ ముక్కలను విడివిడిగా తియ్యండి. బాగా వెడల్పు, లోతున్న గిన్నె తీసుకుని ఆయిల్ వేసి కాగాక ఈ ముక్కలను అందులో వేసి వేయించండి. ముక్కలు సైజును బట్టి, గిన్నె వెడల్పుని బట్టి ఒక్కోసారి ఆరు నుంచి ఎనిమిది ముక్కలు వేయవచ్చు. ఇవి కూడా వేడిగా లేదా చల్లగా ఎలాగైనా బాగుంటాయి. గాలి చొరబడని డబ్బాలో ఉంచితే నాలుగైదు రోజుల వరకూ నిల్వ ఉంటాయి.



అతడు-ఆమె



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

జయంతరం మహంతు ఖూనీకేసు త్వరగా అయిపోవడం చేత ఇంటికే సరాసరి వచ్చేశా. మూడుగంటలకే గుమ్మంలో కారు దిగుదునుకదా-గుడ్డ కాలినవాసన! "శాంతం! శాంతం! గుడ్డ కాలినట్టు వాసన వొస్తోంది. ఎక్కడో చూడు" అంటూ లోపలికొచ్చా. భోగిమంటలా వాకిలిమధ్య అగ్నిహోత్రం! గుడ్డల మేటు! బనారసు చీర్లు, లోపలికొచ్చా. భోగిమంటలా వాకిలి మధ్య అగ్నిహోత్రం! గుడ్డలమేటు! బనారసు చీర్లు, బెంగుళూరు సిల్కులు, ఇంగ్లీషు వాయిల్సు, అస్క్విత్ అండ్ లార్డు బ్లేటరు, లేసు అండర్వేర్లు, ఉప్పాడ జల్తారు చీర్లు, మధుర చీర్లు! పెద్ద హోమ గుండం, అగ్నిపర్వతం, ఖాండవదహనం. ఎన్ని వేల రూపాయలు ఖర్చుచేసి నేను కొన్నానో. నాకేం పాలుపోలేదు. "ఇదంతా ఏమిటీ శాంతం?" అన్నా, మాటాళ్ళే, దగ్గరకెళ్ళా, చేయిపట్టుకుని వూపే. తపస్సులోనో సమాధిలోనో వున్న మనిషిలా వుండెను. కాని మామూలు శాంతం కాదు. ముఖంలో అదో వర్చస్సు! కొంచెం వెనక్కి తగ్గే. ఏమిటా చేతిలోది అని చూశా. గాంధీగారి యంగిండియా. మళ్ళా మనిషి వేపు చూశా. కట్టుకున్నది పల్నాడుచీరె. బందరు అర్ధకపు రవికె. ఇంక బోధపడింది మంటలు చల్లారాయి.

(నిన్నటి సంచిక తరువాయి)

"ఇదంతా ఏమిటి శాంతం!" అని మళ్ళీ అడిగే. "ఏంలేదూ, నే నీవాళ నుంచి ఖద్దరు దీక్ష తీసుకున్నా అంతే!" "సరే బాగుందికాని ఈ గుడ్డలు భస్మం చెయ్యకపోతే ఎవరికేనా ఇచ్చెయ్యకూడదూ? ఎంత డబ్బు నాశనం అయిపోయింది?" అన్నా. "డబ్బు ఉంటేనేమిటి, పోతేనేమిటోయి? మహానుభావుడు ఆయన చెప్పేదు - మనం చెయ్యాలి, అంతే!" అంది. "నేను మాత్రం కాదన్నానా? అదికాదు. ఈవిధంగా అందరికీ సాధ్యం అవుతుందా? అందరం ఈ ముతక దుస్తులు ధరించగలమా? సాధన అందరికి సాధ్యమా?" "ఈ పిచ్చి ఖబుర్లు తీసెయ్యాయి అబ్బాయీ? మనిషికి సాధ్యం కానిదేంవుంది?" అంది. "నాకూ ఖద్దరు కట్టాలనే ఉంది. ఇన్నాళ్ళనుంచి దేశంలో ప్రచారం అవుతూంటే, నీ మనస్సు కీవేళ స్ఫురించింది కదా, నాకు రేపు స్ఫురించొచ్చు. అంతవరకు నేను ఎట్లా ధరిస్తా? ఆత్మవంచన అవదూ?" "ఓహో లాయరుగారి వాదనలే!" అంది శాంతం హేళనగా. "అది కాదు శాంతం! నే చెప్పేది బాగా ఆలోచించు. నాకూ దేశభక్తి వుంది. గాంధీమహాత్ముడిమీద గౌరవం వుంది. అయితే నాకు కొన్ని ఆశయాలున్నాయి. మొన్న గవర్నమెంటు ప్లీడరుని వేయడంలో నా మాట చీఫ్ జస్టిసు ముంద రొచ్చిందట. బాగా ముందు కొస్తున్నాడు. ఇతన్ని అడ్వకేట్ జనరలుగానేనా వెయ్యాలని జస్టిసు సారంగధరయ్యంగారు అన్నాడట. ఇప్పుడు నువ్వు ఖద్దరులోకి దిగావు అని తెలుస్తే నా భవిష్యత్తు అంతా గుండుసున్నా అయినట్టే అనుకో. అయినా ఇంకా కాలం అంతా ముందుకే వుంది. నేనూ అడ్వకేట్ జనరలుగా ఏ రెండు మూడేళ్ళో చేసి, పాపాయికి మంచి సంబంధం చూచి అప్పుడు ఏకంగా పనే మానేసేస్తా. ఇద్దరం వక్కసారే దిగిపోదాం!" "ఓహో దూరాలోచనండోయ్! మాటా మాణిక్యంకూడా దక్కు తాయండోయి!" అని ఆక్షేపించింది. "అలాక్కాదు. మంచోచెడ్డో యీ సంసార సాగరం మనిద్దరం కలిసే ఈదాలి కాదూ?" అన్నా. "కలిసి ఈదితే ఇద్దరం అడుగితే! ఎవరికి వారే!" అంది. ఖద్దరు పిచ్చితో చాలించకుండా ఉప్పు సత్యాగ్రహంలో కూడా దిగుతుందేమో? ఆర్థిక జ్ఞానం పోవడంతో పాటు రాజకీయంగా మూఢత్వం కూడా వస్తే ఇక చెప్పేదేముంది? నా భవిష్యత్తు గురించేనా చెప్పి మానిపించాలి ఇందులోకి దిగకుండా.

నాకేం పాలుపోకుండా వుంది.... ఒకటనుకుంటే ఒకటవుతున్నాదేం? రెండు మూడు లకారాలు సంపాదించాక రాజకీయంలో దిగుదాం - నేనూ జాతీయవాదినేకదా అని అనికుంటే ఇల్లా తిరిగిందేం? పోనీ, శాంతం నాతో ముందు హుషారేనా చెప్పకూడదా? నిమిషాలమీద దిగకపోతే పోయేదేం లేదుగా? నాకు ఎలాగో సర్దుకోవడానికి వీలుండును. చేతులో పడ్డ ఎడ్వకేట్ జనరలుగిరీ పోయిందే...ఇంతిలా ఎట్లా మారిపోతారా అని నాకేం అర్థంకావడంలే! ఇంక నిలకడే మిటి?..."ఎవరికి వారే" అనేసిందే శాంతం - ఏమి అంతరార్థమో? ఏం తోచడంలే....

47 ఆమె

పదిరోజులై యీ డైరీవేపే చూడలేదు. పాపాయికి కొంచెం సుస్తీ చేసింది. దాని మూలాన్ని, మొన్న రెండురోజులూ కాన్వొకేషను హడావుడులు, అంచేతపూర్తిగా మర్చేపోయాను. పాపాయి పుట్టేక దానాదీనా ఏమిటో క్వీన్ కాలేజీ విందుకి క్రిందటి నాల్గు సంవత్సరాలై వెళ్ళలేదని ఈమాటు వెళ్ళేను. ఆరేళ్ళు అక్కడ చదువు, తరువాత నాల్గేళ్ళక్కడే పని చెయ్యడం - పదేళ్ళు సంబంధం వుండడాన్ని - సహం బతుకు క్వీన్సు కాలేజీలోనే అయింది-రోజూ మెరీనాకి వెళ్ళి కాలేజీ ప్రక్కమ్మట వెళ్ళినప్పుడల్లా పది సంవత్సరాల జీవితం కళ్ళముందర కొస్తుంది. మొన్న రెండు రోజులూ దమయంతి, సులోచన, రంగనాయకి, అన్నపూర్ణ నాదగ్గిరే వుండిపోయారు. శాస్త్రి అందరితోనూ మంచి



సరదాగా, హాస్యాలు చేస్తూ అందరిని నవ్విస్తూ అతిథ్యం ఇచ్చాడు. కాలేజీ విడిచి పెట్టాక ఎవరి మనుగడలెల్లా జరిగేయో చెప్పుకున్నాం. దమయంతి బి.ఏ. ప్యాసయ్యాక ఇంగ్లండు వెళ్ళి, వాళ్ళ మలయాళం అతన్నే ఒకతన్ని పెళ్ళిచేసుకుని అక్కడే వుండిపోయింది. లండనులోనే కాపురంట. జీతం అంతా ఖర్చు అయిపోతుందట. కాని అక్కడే నచ్చిందంది. ఎవడిఘోష వాడిది. ఎవడి ఖర్మం వాడిది. అయినా ఇరుగు పొరుగు సాయం మర్యాదా లేకపోలేదు. మొత్తంమీద స్వదేశం మీద మనసు లేదంది. మూడేళ్ళకోసారి ఇండియాకి రావడానికి ఖర్చులతో కూడా సెలవు ఇస్తారుట. సులోచన కెమిస్ట్రీ ఆనర్సు పేసయి వాళ్ళ నాన్నగారు అలహాబాదులో ఎకౌంటెంటు జనరలుగా వుంటే అక్కడికి వెళ్ళి అక్కడి "రీసెర్చి"లో చేరి తర్వాత అక్కడో మహారాష్ట్రం ఆయన్ని చేసుకుందిట. ఆయన సీతారాం ఆయిల్ మిల్లులో ఇంజనీరుగా వున్నాడట. అప్పుడే ముగ్గురు పిల్లలు. వెయ్యి రూపాయలు జీతం, బంగాళాట. అంతా బాగుంది కాని, అక్కడ వాళ్ళకీ వీళ్ళకీ ఏం పద్దం లేదట. ఆడవాళ్ళెవ్వరూ పైకిరారట. జీవితంఅంతా కూపస్తమండూకంలా వుందంది పాపం! రంగనాయకి నాతోకూడా సంవత్సరం లెక్చరరుగా చేసి, వాళ్ళ బంధువేనట, ఈ మధ్య ఐ.సి.యస్. ప్యాసయాడుట, ఇప్పుడు గోదావరి జిల్లాలో సబ్ కలెక్టరుగా వున్నాడుట, ఆయన్ని చేసుకుంది. మొదటినుంచీ, రంగనాయకి ఐ.సి.యస్. అనే పలవరించేది. నెగ్గించుకుంది. సంబంధం వాళ్ళవాళ్ళు, వీళ్ళవాళ్ళు నిశ్చయించిందేనట. ఈ గవర్నరుగారి పార్టీలు - ఆ కలెక్టరుగారి దర్బార్లు - మహారాజుల అతిథ్యం - జమీందార్ల బహుమతులు - రెండు రోజులు ఇక ఏమిటి యేకధాటిని ఖబుర్లు కురిపించేసింది. కొడుకూ కూతురూ - దొరసాని నర్సుట. గవర్నమెంటువారి పెద్దకోడల్లా మాట్లాడింది మా దగ్గిరకూడా. ఎంతేనా హోదా అధికారం చలాయించడం అలవాటు అయితే అందరూ చులకనగా కనిపిస్తారు. అన్నపూర్ణకి మూడో సంవత్సరం చదువుతుండగానే పెళ్ళియిపోయింది. ఎంతో బ్రహ్మాండం మీద చదువు పూర్తిచేయనిచ్చారు. అత్తవారు వాళ్ళశాఖే. పెంపకం జమీందారు. అతను కాశీలో ఎం.ఏ. పాసయ్యాడుట. మంచి వుద్దేశాలున్న అతనే అంది. "కాని ఎలాగైనా జమీందారీ వేషాలు వ్యవహారాలు నాకు కిట్టవు. అయితేనేం ఆరేళ్ళ సంసారం అయాక ఇదీ బాగానే ఉందని పిస్తోంది. ఎక్కడి కెళ్ళినా ఫస్టుక్లాసు, రిజర్వుడు, పరివార సమేతం, రెండు కార్లు!" అంది. రెండు రోజులు ముచ్చట్లు అయిపోయేయి. అందరూ వెళ్ళిపోయారు. అందరం కలిసి వుండేవాళ్ళం. వకటే ప్రాణం మాది. ఇప్పుడు ఒక్కొక్కరిది ఒక్కొక్క కథ; ఒక్కొక్క గాథ! వాళ్ళందరూ హాయిగా సౌఖ్యంగా ప్రేమానురాగాలతో సంపూర్ణమైన జీవితాలు జీవిస్తున్నారా? వీళ్ళందరికీ డబ్బుకి లోపం లేదుకదా - ఆ విషయంలో నాకంటే వాళ్ళందరూ అదృష్టవంతులే. కాని నాకున్న హాయి వీళ్ళకెక్కడ! పాపం - నేనంటే శాస్త్రి ప్రాణం పెడుతాడు కదా! కాని - నిజం చెప్పాల్సొస్తే - ఎవరి జీవితం వాళ్ళదేకదా! శాస్త్రి - నేను ఎంతో అంత అన్యోన్యంగా వున్నామా - అయినా భావాల్లో కొద్దిగా తేడా లొచ్చేస్తున్నాయి. అయితే ఏం? ప్రేమనివన్నీ అద్దుతాయా?

నిన్న సాయంకాలం మామూలుకంటే ముందే నాలుగు గంటలకే ఇంటికొచ్చేశాడు శాస్త్రి. నేనేదో లోపలి వసారాలో చదువుకుంటున్నాను. వెనుకనుంచే వచ్చి కళ్ళు మూశాడు.కళ్ళు తెరచి విప్పేసరికి ముహమల్ పెట్టెలో తళతళ మెరుస్తూ వజ్రాల ఉంగరం! "ఏమిటి"దన్నా! "అలాక్కాదు ఉంగరం ముందు పెట్టుకో" అంటూ వేలికి తొడిగేడు. "దీని భావమేమి తిరుమలేశ?" అన్నా. "ఉంగరం నీకు నచ్చిందంటే చెప్తా" నన్నాడు. "నచ్చడమేమిటి? భేషుగ్గా వుంది" అన్నా. "అయితే విను" అన్నాడు. "తూర్పు గోదావరి జిల్లాలో లింగాలపల్లి రాజాగారని ఒక గొప్ప జమీందారున్నాడట. సంవత్సరానికి ఇరవై లక్ష లొస్తాయట. ఐదారేళ్ళబట్టి రాజుగారికీ, రైతులకీ శిస్తులగురించి తగాయిదాలుగా వున్నాయట. ఆ తగాయిదాల మీద కక్షలు పెరిగి అక్కడనుంచి రాజాగారు శిస్తులు పెంచడం, పొలంమీద నుంచి తొలగించడం - యిలాగ జరుగుతూనే వున్నాయి. దాంతో పాటు క్రిమినలు చర్యలు, ఇలా వుండగా రాజాగారి వాళ్ళు పెద్ద రయితుని ఒకణ్ణి ఖూనీ చేశారు. అదో కేసు. సెషన్సులో రాజాగారికి వ్యతిరేకం అయింది. ఇప్పుడు హైకోర్టులో అప్పీలు. రాజాగారి తరఫున వకాల్తీకి శ్రీనివాస రాఘవయ్యగారు, బెన్సన్, వెంకటేశన్ అందరూ తంటాలు పడ్డారు. ఈవేళ మధ్యాహ్నం రాజాగారు స్వయంగా కబురుచేసి బెన్సన్‌కి సీనియర్ వకాల్తీని, నాకు రెండో వకాల్తీనీ ఇచ్చారు. అంతేకాదు ఈ ఖూనీకేసు వకాల్తీ ఇలావుండగా, హైకోర్టులో వున్న సివిలు కేసులన్నింటిలో నరసింహయ్యంగారికి, నాకూ జాయింటిచ్చారు.

"రిటైనరు క్రింద ఫీజు అడ్వాన్సు కింద నాకు వెంటనే రెండువేలు ముట్ట చెప్పేరు. ఆ రెండు వేలలోనూ నీకు ఐదు వందలీకట్నం" అని ఎంతో ఉత్సాహంతో చెప్పేరు. ఆ రెండు వేలలోనూ నీకు ఐదువందలీకట్నం" అని ఎంతో ఉత్సాహంతో కౌగిలించుకున్నాడు ... అతని ప్రేమ, ఉత్సాహం ఔదార్యం, నా హృదయానికి హత్తుకుని పోయాయి. కాని ఈ ఉంగరం నేనెట్లా తీసుకోను? ఎవరి డబ్బుతో వచ్చినది? రయితులు రక్తమాంసం కాదూ?... "శాంతం! ఏమిటిలా పెదవి విరిచేస్తున్నావ్?" అన్నాడు.

- ఇంకా వుంది.

బంద్‌లు, ఆందోళనలతో అట్టుడికిన మహారాష్ట్ర

మహారాష్ట్రలో నిరసనలు, వాహనాల కాల్చివేత, రహదారులపై బైఠాయింపులతో ఈనెల రెండో తేదీన ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనేకచోట్ల హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. దుకాణాలు మూతపడ్డాయి. పెద్దఎత్తున బస్సులను దహనం చేశారు. అనేక పట్టణాల్లో జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. ఆంగ్లేయుల పాలనలో చోటుచేసుకున్న భీమా-కోరేగావ్ పోరాటానికి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల ఒకటో తేదీన నిర్వహించిన కార్యక్రమాల్లో చెలరేగిన హింస కారణంగా ఓ 28 ఏళ్ల యువకుడు చనిపోవడం, కొందరు గాయపడటంపై ఈనెల 2వ తేదీన రాష్ట్రమంతటా నిరసనలు ఎగిసిపడ్డాయి. పుణెలో మొదలైన ఆందోళనలు అన్ని ప్రాంతాలకూ విస్తరించాయి. దళిత సంఘాల పిలుపు మేరకు ఈనెల 3వ తేదీన జరిగిన బంద్ హింసాత్మకంగా మారింది. అనేక చోట్ల రైళ్లు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సిటీ బస్సులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. సబర్బన్ రైళ్లను అడ్డుకున్నారు.

రాజకీయ పార్టీ ఏర్పాటుపై రజనీకాంత్ ప్రకటన



ప్రస్తుత రాజకీయాలు భ్రష్టు పట్టాయని, వాటి ప్రక్షాళన లక్ష్యంగా పార్టీని ఏర్పాటు చేస్తు న్నట్లు ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రకటించారు. తమిళనాడులో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని ప్రారంభిస్తానన్నారు. రాజకీయాలంటే తనకు భయం లేదని అన్నారు. డిసెంబర్ 31న చెన్నైలో అభిమానులతో సమావేశంలో రజనీ రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రకటన చేశారు. దీనిపై రాజకీయ పార్టీల్లో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. రజనీ రాజకీయాల్లోకి వస్తారని రెండు దశాబ్దాలుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు ఈ ఊహాగానాలకు ఆయన తెరదించారు.

జాతీయ వార్తలు

కాశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఆత్మాహుతి దాడి

జమ్మూ-కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఒక సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రవాదులు డిసెంబర్ 31వ తేదీ తెల్లవారు జామున ఆత్మాహుతి దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు అమరులయ్యారు. ముగ్గురు గాయపడ్డారు. భద్రతా బలగాల చేతిలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిద్దరూ కాశ్మీరీ లే. స్థానిక ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి దిగడం ఇదే మొదటిసారి. ఈనెల ఒకటో తేదీన మూడో ఉగ్రవాది మృతదేహం లభ్యమైంది.

తలాక్ బిల్లుపై రాజ్యసభలో ప్రతిష్టంభన

మూడుసార్లు తలాక్‌ను నేరంగా పరిగణించే బిల్లుపై రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలా.. వద్దా.. అనే అంశంపై ఈనెల 4వ తేదీన రెండు పక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. తీర్మానా లపై ఓటింగ్ జరగాలని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డెరెక్ ఓ బ్రెన్ కోరారు. విపక్షాల తీర్మానాలు/ సవరణలకు ఆమోదం లభించినట్లే నని సభ చైర్మన్ స్థానంలో ఉన్న కురియన్ అన్నారు. దీనిపై ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఏకీభవించలేదు.

హెచ్-1బీ వీసాపై అమెరికా తాజా ప్రతిపాదనతో కలవరం

అమెరికాలో విదేశీయులు ఉద్యోగాలు చేయడానికి ఉపకరించే హెచ్-1బీ వీసా విధానంలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా తీసుకొస్తున్న ఓ ప్రతిపాదన మరింత ఆందోళన కలిగిస్తోంది. ఆ దేశ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం హెచ్-1బీ వీసాల విధానంలో ఈ కొత్త సవరణను ప్రతిపాదిస్తోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం హెచ్-1బీ వీసా ఉన్నవారు గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేస్తున్న సందర్భాల్లో.. ఒకవేళ గ్రీన్ కార్డు అప్లికేషన్ పరిశీలనలో ఉండగానే హెచ్-1బీ వీసా గడువు ముగిసిపోతే అప్పుడు గ్రీన్‌కార్డుపై నిర్ణయం వెలువడే వరకు హెచ్-1బీ వీసా గడువును పొడిగిస్తారు. ఇకపై ఈ విధానాన్ని కొనసాగించకూడదని, హెచ్-1బీ వీసాదారులు గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. గ్రీన్ కార్డు మంజూరవడానికి ముందే వీసా గడువు పూర్తయితే వారిని స్వదేశానికి పంపించివేయాలని హోంల్యాండ్ సెక్యూరి టీ విభాగం ప్రతిపాదించింది. ఇది కార్యరూపం దాల్చితే దీని ప్రభావం 5 లక్షల నుంచి ఏడున్నర లక్షల మంది భారతీయులపై పడే అవకాశం ఉంది. తద్వారా ఐటీ ఉద్యోగులు, ప్రత్యేకించి పెద్దసంఖ్యలో తెలుగువారు తీవ్రంగా నష్టపోతారని నిపుణులు పేర్కొంటున్నారు.

న్యాయమూర్తుల వేతనాల

పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల వేతనాలను రెండు రెట్లకు పైగా పెంచడానికి ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఈనెల 4వ తేదీన ఆమోదం తెలిపింది. ఈ బిల్లు చట్టరూపం దాల్చాక భారత ప్రధాన న్యాయమూర్తి నెలవారీ వేతనం ఇప్పుడున్న లక్ష రూపాయల నుంచి రూ.2.8 లక్షల వరకు పెరుగుతుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల వేతనం రూ.90,000 నుంచి రూ.2.50 లక్షలకు పెరుగుతుంది. హైకోర్టు న్యాయమూర్తుల వేతనం కూడా రూ.2.25 లక్షలకు పెరుగుతుంది.

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 29 నుండి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టాలని ఈనెల 5వ తేదీన భేటీ అయిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సిఫారసు చేసింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈనెల 29న పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తారని, అదే రోజు ఆర్థిక సర్వే సభ ముందు ఉంటుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ వెల్లడించారు.



పాక్ దళాల కాల్పుల్లో బీఎస్‌ఎఫ్ జవాన్ మృతి

పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో జమ్మూలో అంతర్జాతీయ సరిహద్దులో ఈనెల మూడో తేదీన విధులు నిర్వహిస్తున్న బీఎస్‌ఎఫ్ జవాన్ మృతిచెందారు. సాంబ సెక్టార్‌లోని భారత పోస్టుపై పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో ఆర్.పి.హజ్రా అనే బీఎస్‌ఎఫ్ జవాన్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఆయనను ఆస్పత్రికి తరలించగా, మృతిచెందారు. ఈ ఘటనకు ప్రతీకారంగా అదేరోజు రాత్రి సాంబా సెక్టార్ సమీపంలో పాక్ ఔట్‌పోస్టులు మూడింటిని ధ్వంసం చేశాయి. ఈ ఘటనలో 8 నుంచి పది వరకు పాక్ రేంజర్లు మరణించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. పాక్‌కు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లిందని బీఎస్‌ఎఫ్ ఐజీ రామ్ అవతార్ వెల్లడించారు.

నాలుగు భారీ రాకెట్ ప్రయోగాలకు సన్నాహాలు

ఇస్రో ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సరంలో శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం (షార్) నుంచి నాలుగు భారీ రాకెట్‌లను ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తోంది. జనవరిలో పీఎస్‌ఎల్‌వీ-సీ40ని ప్రయోగించనుంది. అలాగే చంద్రయాన్-2 ద్వారా లూనార్, ల్యాండర్‌ను నింగిలోకి పంపనుంది.

మధుకోడాకు శిక్షపై ఢిల్లీ హైకోర్టు స్టే



బొగ్గు కుంభకోణం కేసులో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడాకు ప్రత్యేక న్యాయస్థానం విధించిన శిక్షను ఢిల్లీ హైకోర్టు ఈనెల 22 వరకు నిలిపివేసింది. శిక్షను సవాలు చేస్తూ కోడా దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ఆ తేదీలోగా స్పందన తెలపాలని ఆదేశించింది. కోడా రూ.25 లక్షల జరిమానా చెల్లించాలన్న ఆదేశాలపైనా స్టే విధించడంతోపాటు, ఈనెలలో జరిగే తదుపరి విచారణ వరకు ఆయనకు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది.

పాకిస్థాన్‌కు అమెరికా సాయం నిలిపివేత

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడం లేదన్న కారణాలతో పాకిస్థాన్‌కు ఏటా ఇచ్చే 1.15 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.7,290 కోట్లు) భద్రతా సాయాన్ని అమెరికా ఈనెల 5వ తేదీన నిలిపివేసింది. ఇందులో 2016 సంవత్సరానికి కాంగ్రెస్ ఆమోదించిన 255 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1,616 కోట్లు) విదేశీ మిలటరీ నిధులు కూడా ఉన్నాయి. ఇది కాకుండా రక్షణశాఖ సంకీర్ణ మద్దతు నిధుల కింద 2017 సంవత్సరా నికి కేటాయించిన మొత్తం 900 మిలియన్ డాలర్ల (రూ. 5,703 కోట్లు)ను, ముందు సంవత్సరాలలో ఖర్చు కాకుండా మిగిలిన నిధులను కూడా రద్దు చేసింది.

అంతర్జాతీయ వార్తలు

కోస్టారికాలో కూలిన విమానం

క్రిస్మస్ సెలవులు గడిపేందుకు కోస్టారికా కు వచ్చిన అమెరికా సైనికులు పదిమంది విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. వీరిలో ఐదుగురు ఒకే కుటుంబానికి చెందినవారు. మరో ఇద్దరు విమాన సిబ్బంది. ఈ ప్రమాదంలో ఇంకో ఇద్దరు స్థానికులు కూడా చనిపోయారు.

పెరూలో రోడ్డు ప్రమాదం.. 48 మంది మృతి

పెరూలో ఈనెల రెండోతేదీన హువాచో నగరం నుంచి రాజధాని లిమాకు బయలుదేరిన ఓ బస్సు ట్రక్కును ఢీకొనడంతో 48 మంది మరణించారు. ట్రక్కును బలంగా ఢీకొనడంతో బస్సు కొండపై నుంచి పల్టీలు కొడుతూ దాదాపు 100 మీటర్లు కిందకు జారిపోయింద ని అధికారులు తెలిపారు.

నా టేబుల్‌పైనే న్యూక్లియర్ బటన్ : కిమ్

అణ్వాయుధాలను ఉపయోగించేందుకు అవసరమైన న్యూక్లియర్ బటన్ ఎప్పుడూ తన టేబుల్ మీదనే ఉంటుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తన దేశ ప్రజలకు ఇచ్చిన సందేశంలో ఆయన ఈ విషయాన్ని తెలియజేశారు. ఉత్తర కొరియా ఇప్పటికే అణ్వస్త్ర దేశంగా అవతరించిందని, భవిష్యత్ అవసరాల కోసం ఇంకా ఎక్కువ వార్‌హెడ్‌లను, క్షిపణులను తయారుచేయాల్సి ఉందన్నారు.

కిమ్ వ్యాఖ్యలు అమెరికాను హెచ్చరిస్తూ చేసినవిగా ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. కిమ్ వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, కిమ్ దగ్గర ఉన్నదానికన్నా పెద్దదైన, శక్తివంతమైన న్యూక్లియర్ బటన్ తనవద్ద ఉందని హెచ్చరించారు.

కోడిపందేల నిర్వహణను అడ్డుకోండి : హైకోర్టు

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కోడిపందేలు జరగకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీలను హైకోర్టు ఆదేశించింది. కోడిపందేలు నిలువరించాలని గతంలో తాము జారీచేసిన ఉత్తర్వులు అమలు కాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోడిపందేలకు సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈనెల రెండోతేదీన హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కోడిపందేలను కట్టడి చేయాల్సిందేనని ఉమ్మడి హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది. 2016 డిసెంబర్ 26న తాము ఇచ్చిన ఉత్తర్వులను ఈ సంక్రాంతికి కచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఈనెల నాలుగో తేదీన రాష్ట్రప్రభుత్వానికి తేల్చిచెప్పింది. తమ ఉత్తర్వులకు విరుద్ధంగా పందేలు జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించింది.

రాష్ట్ర వార్తలు

నూతన డీజీపీగా మాలకొండయ్య

రాష్ట్ర నూతన పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ)గా ఎం.మాలకొండయ్య డిసెంబర్ 31న బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని ఏపీ పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఎస్.సాంబశివరావు డీజీపీగా పదవీ విరమణ చేశారు. ఆయనను ఉన్నతాధికారులు, సిబ్బంది వీడ్కోలు పలికారు.

'జన్మభూమి- మావూరు' ప్రారంభం

రాష్ట్రవ్యాప్తంగా జన్మభూమి-మావూరు' కార్యక్రమాలు ఈనెల రెండోతేదీన ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా దర్శిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ నాలుగు లక్షల మందికి పింఛన్లు ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు.దీంతో పింఛన్లు పొందేవారి సంఖ్య 50 లక్షలకు చేరుకుంటుందన్నారు.

ప్రకృతి సేద్య సంవత్సరంగా 2018 : సీఎం

2018ని ప్రకృతి సేద్య సంవత్సరంగా ప్రకటిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో ప్రకృతి వ్యవసాయంపై ఎనిమిదివేల మంది రైతుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని గతనెల 31న ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలో త్వరలోనే ప్రకృతి వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు.

క్రీడా వార్తలు

విదర్భకు తొలిసారిగా రంజీట్రోఫీ

ఇండోర్‌లో ఈనెల ఒకటో తేదీన ముగిసిన రంజీ ఫైనల్‌లో విదర్భ జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఏడుసార్లు విజేత అయిన ఢిల్లీ జట్టును ఓడించింది. 29 పరుగుల నామ మాత్ర లక్ష్యాన్ని విదర్భ జట్టు ఒక వికెట్ కూడా కోల్పోకుండా సాధించింది. విదర్భ జట్టు ఈ ట్రోఫీని గెలుచుకోవడం ఇదే ప్రథమం.




అండర్- 16 క్రికెట్ మ్యాచ్‌లో నితీశ్ 441 పరుగులు

విజయ్‌మర్చంట్ ట్రోఫీ అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా రాజ్‌కోట్‌లో నాగాలాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు ఆటగాడు నితీశ్‌కుమార్ రెడ్డి 441 పరుగులు చేశాడు. ఇందులో 60 ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. బీసీసీఐ జూనియర్స్ టోర్నమెంట్ల చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాళ్ల జాబితాలో మహారాష్ట్ర ప్లేయర్ విజయ్ జోయల్ (451) తరువాత నితీశ్ రెండో స్థానంలో నిలిచాడు.ఈ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌ను రెండు వికెట్లకు 801 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో నాగాలాండ్ జట్టు 56 పరుగులకు ఆలౌట్ అయింది.

దుర్గగుడిలో పూజల ఆరోపణలపై

నిజనిర్ధారణ కమిటీ



విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో డిసెంబర్ 26వ తేదీ రాత్రి ఆలయ వేళలు దాటిన తరువాత పూజలు చేశారనే ఆరోపణలపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటైంది. ఈ అంశంపై వాస్తవాలు నిగ్గు తేల్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ అనూరాధ నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేస్తూ ఈనెల 4వ తేదీన ఉత్తర్వులిచ్చారు. సంఘం సభ్యులైన దేవాదాయశాఖ అదనపు కమిషనర్ రఘునాథ్, ఆగమశాస్త్ర పండితుడు చిర్రావుల శ్రీరామశర్మ ఈనెల 5వ తేదీన గుడికి వచ్చి 40 మందిని విచారించారు. వీరిలో కొందరి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు.

ఎల్వీ సుబ్రహ్మణ్యంపై కేసు కొట్టివేత

ఎమ్మార్ కేసులో 11వ నిందితుడిగా ఉన్న ఐఏఎస్ అధికారి ఎల్.వి.సుబ్రహ్మణ్యంపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు ఈనెల 4న తీర్పు చెప్పింది. ఎమ్మార్ ప్రాజెక్టుకు సంబంధించి సీబీఐ స్పష్టమైన ఆధారాలు చూపలేదని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ బి.శివశంకరరావు 169 పేజీల తీర్పును వెలువరించారు.

అత్యున్నత ప్రతిభకు అరుదైన ఆహ్వానం

ఢిల్లీ/విజయవాడ : విజయవాడ యువకుడికి అరుదైన గౌరవం దక్కింది. విజయవాడ నీడ్స్ యూ (వీఎన్‌యూ) వ్యవస్థాపకుడు, కిలారు నాగ శ్రావణ్‌ను ఐక్యరాజ్యసమితిలో జరిగే యువజన సమావేశాలకు భారత ప్రతినిధిగా పాల్గొనేందుకు ఆహ్వానించారు. ఈ ఏడాది ఆగస్టు 10 నుంచి 12 వరకు న్యూయార్క్‌లో జరిగే యువజనోత్సవాల్లో ఆయన పాల్గొనున్నారు. కెనడా, అమెరికా, బ్రెజిల్, మలేషియాకు చెందిన యువ ప్రతినిధులతో కలసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీఎస్)లను ఆయన రూపొందిస్తున్నారు. సెప్టెంబరు 13న ఐక్యరాజ్యసమితిలో 193 దేశాలు పాల్గొనే సార్వత్రిక 71వ సమావేశాలకు హాజరై ప్రసంగిస్తారు. ప్రపంచవ్యాప్తంగా 'సారూప్యభావాలు' గల యువకులతో కలసి ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో విధివిధానాలు రూపొందించి సుస్థిర అభివృద్ధికి బాటలు పరచడమే తన లక్ష్యమన్నారు. యువజన సదస్సులో 2030 లక్ష్యం చేసుకొని 'దార్శినికత నుంచి క్రియా సాఫల్యత వరకు' (ట్రాన్స్‌ఫారం విజన్ ఇన్‌టు యాక్షన్) రూపొందిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం సుస్థిర అభివృద్ధి కలిగిన 149 దేశాల్లో భారత్ 110గా నిలుస్తోందన్నారు.

అనేక యాప్‌లను రూపొందించడంలో ముందుండే నాగ శ్రావణ్ బెంగళూరు ఆర్వీ కాలేజీలో ఇంజనీరింగ్ చదివాడు. ఆపై సత్‌నూర్ లిమిటెడ్, ఐక్యరాజ్య సమితి ఇంటర్ ఏజెన్సీ నెట్‌వర్క్ ఆన్ యూత్ డెవలప్‌మెంట్, విజయవాడ నీడ్స్ యూ రూపొందించారు. లింక్డ్ ఇన్ ద్వారా వివిధ రంగాలకు చెందిన 500 మిలియన్ల మందితో ఆయన భావాలను పంచుకుంటున్నారు. ఏడాదిన్నర నుంచి పంట నష్టం మేనేజ్‌మెంట్, వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడం ఎలా ? పర్యావరణ సమాచారం పై తులనాత్మక పరిష్కారాలను అందిస్తున్నారు. పౌరుల హక్కులు, ఆర్థిక సాధికారత, రాజకీయాలు, పేదరిక నిర్మూలన, సామాజిక సేవ విభాగాల్లో ఆయన తన సేవలు అందిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు యువజన సమితిలో సభ్యులుగా కొనసాగుతున్న బహుముఖ ప్రజ్ఞాశాలిగా శ్రావణ్ గుర్తింపు తెచ్చుకున్నారు.



లైంగిక వేధింపులపై నారీ భేరీ...





విశాలాంధ్ర, సెంట్రల్‌డెస్క్ : కూలీల నుంచి సెలబ్రిటీల దాకా ప్రదేశాలు వేరయినా, ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొనే లైంగిక వేధింపులు ఒక్కటే...అయితే ఇవి ఒక్కొక్కచోట ఒక్కో రకంగా ఉన్నాయి. ప్రపంచంలో... మనదేశంలో... తెలుగు రాష్ట్రాల్లో.... రోజూ ఇవే వార్తలు వినవస్తున్నాయి. ఇందుకు ప్రపంచంలో ఏ ప్రాంతమూ మినహాయింపు కాదు, ఎవరూ మినహాయింపు కాదనీ చెప్పవచ్చు....

'గజల్ 'నే తన ఇంటి పేరుగా మార్చుకున్న శ్రీనివాస్ ఉదంతంతో లైంగిక వేధింపులు మరో మారు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మన దేశంలో మహిళలపై లైంగిక హింస పెరిగిపోవడానికి కారణాలు ఏమిట? లింగ నిష్పత్తి తగ్గిపోవడమా...? మత,నైతిక పరమైన నిషేధాల కారణంతో పురుషుల లైంగిక లాలస తీరకపోవడమా..ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ల ద్వారా నీలి చిత్రాలు అందుబాటులోకి రావడమా ...లేక స్త్రీల పట్ల చులకన భావమా....వ్యవస్థలో పెరిగి పోతున్న ఆర్థిక వ్యత్యాసాలా....సామాజిక అంశాలా... అనేది తేలకుండా ఉంది. భారతదేశంలో పెరిగిపోతున్న అత్యాచారాలపై యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో సోషియాలజీ లెక్చెరర్‌గా పనిచేస్తున్న వాసి ఎస్.కులకర్ణి తన బృందంతో జరిపిన అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. ఆర్థిక,సామాజిక కారణాలు, పోలీసు, న్యాయవ్యవస్థ తీరు.. ఒక ఎత్తయితే సామాజిక మాధ్యమాలు మరింత ప్రచారం కల్పించడం మరొక కారణమన్న వాస్తవాలు నివ్వెరపరచాయి. ఈ అధ్యయనం ప్రకారం లింగ నిష్పత్తిలో అసమానతలు ఎక్కువగాఉన్నచోట అత్యాచార కేసులు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి.

ఆల్కాహాలిజం కూడా అత్యాచారాలకు ఒక ప్రధాన కారణంగా చెబుతున్నప్పటికీ మహిళల వస్త్రధారణ మరొక కారణంగా యువత చెప్పినట్టు తేలింది. డ్రగ్స్ వినియోగం పెరగడం, సినిమాలు, అరచేతిలో అశ్లీలం అందుబాటులోకి రావడం వంటివి యువత ప్రవర్తనలో బాగా మార్పు తెచ్చాయని ఆ అధ్యయనం తేల్చింది. ఇప్పుడు సంతోషంగా ఉంటే చాలు, రేపు ఏదైనా పరవాలేదన్న ధోరణి యువతలో బాగా పెరిగిపోవడం విశృంఖలతకు ప్రధాన కారణంగా ఆ అధ్యయనం తెలిపింది.

లైంగిక వేధింపులకు ఒక దేశం,ప్రాంతం మాత్రమే పరిమితం కాదు అన్ని రంగాలలోనూ ఈ దుష్ట సంస్కృతి విషపుకోరలు చాచి ఉంది. వేధింపులకు అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, క్రీడాకారులు,సినిమా, టీవీ, మోడలింగ్, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏది మినహాయింపు కాదు. అయితే పద్ధతులు మాత్రమే వేరుగా ఉంటాయి అంతే.. గతి తప్పిన గజల్ శ్రీనివాస్ ఉదంతం ఇటువంటి ప్రత్యేక సందర్భాన్ని తట్టి లేపింది. పురుష వేధింపులను ఇక ఏ మాత్రం భరించలేరంటూ మహిళాలోకం చేస్తున్న హెచ్చరికగా ఈ ఉదంతాన్ని పేర్కొనవచ్చు. ఈ విషయంలో మహిళా లోకాన్ని ఏకం చేసేందుకు ప్రయత్నాన్ని హాలీవుడ్ సినీ పరిశ్రమ ప్రారంభించడం ముదవహం.

హాలీవుడ్‌లో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న ప్రముఖ నటీమణులంతా ఏకమయ్యారు. అందుకనే హాలీవుడ్ నటి అసిఫామిలాన్ నడుంకట్టి ' మీటూ' ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఈ ఉద్యమానికి హాలీవుడ్‌లో వెలిగిపోతున్న తారలు సైతం మద్దతు ప్రకటించడమే గాకుండా తాము ఏ విధంగా వాటికి గురయ్యామో బహిరంగంగానే వివరించారు.. అలాగే ఈ ఉద్యమానికి బాలివుడ్‌తారలు సైతం మద్దతు ప్రకటించారు. బాలివుడ్‌లో తమ ప్రతిభా పాటవాలతో ఎదిగిన కొంకణ్‌సేన్,కంగనా రౌనత్, రాధికా ఆప్టే వంటి తారలు తాము కూడా లైంగిక వేధిం పులు ఎదుర్కొన్నామంటూ సోషల్ మీడియాలో వెల్లడించారు. హాలీవుడ్‌లో 'మీటూ' ఉద్యమానికి కొనసాగింపుగా భారత్‌లో 'టైమ్ ఈజ్' అప్ మొదలైంది. గజల్ వేధింపులకు బలైన ఉద్యోగికి ఇదే స్ఫూర్తిగా నిలిచింది.

నేషనల్ క్రైమ్ రికార్డు ప్రకారం 2016 సంవత్సరంలో సేకరించిన వివరాల ప్రకారం తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రాల్లో రెండువేల రేప్ కేసులు నమోదైన విషయం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో ఒక్క తెలంగాణలో 1276 కేసులు నమోదయ్యాయి. గతంతో పోలిస్తే మహిళలపై నేరాల సంఖ్య తగ్గినప్పటికీ అత్యాచారాలు మాత్రం గణనీయంగా పెరిగాయని ఆ నివేదిక తెలిపింది. ఇదిలాఉంటే....మానసిక, లైంగిక కారణాలతో రేప్‌లు ఎక్కువగా జరుగుతున్నాయనీ...సామాజిక కారణాలతో జరిగేవి చాలా తక్కువనీ...మరీ ముఖ్యంగా మానసిక సమస్యలు, పర్సనాలిటీ డిజార్డర్లు అత్యాచారాల వేధింపులకు ప్రధాన కారణాలని మానసిక నిపుణులు చెబుతున్నారు.

యువతే ఓ అద్భుతం...



విశాలాంధ్ర, సెంట్రల్‌డెస్క్ : సెల్‌ఫోన్‌లో మెమరీ తక్కువగా ఉంది...త్వరగా మాట్లాడు...షార్ట్ ఫామ్‌లో మెసేజ్‌లు...ఈ లోపు వాట్సాప్ కాల్స్...రెండు క్రాష్ కాకుండా ప్రోగ్రామ్ చేసిన మన పిల్లల మేధస్సు...ఫోన్ ఛార్జింగ్‌లో పెట్టి..డెస్క్‌టాప్‌లో ఫేస్‌బుక్‌లో ఛాటింగ్...ఆన్‌లైన్ లావాదేవీలు....రోజుకో టెక్నాలజీ...ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్..మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్,క్లౌడ్ కంప్యూటింగ్..., హడూప్..ఏ కోర్సులో చేరావురా...అనే పెద్దల ఆరా.....వినీ వినీ వాళ్లకు కూడా బేసిక్స్ తెల్సిపోయాయి..ఇంతలోనో హార్డ్‌వేర్ తీసుకుంటే పోయేది...దానిలో ఇంత లేటెస్ట్ టెక్నాలజీ నేర్చుకోకుండా సరిపోయేది అని సలహాలు... ఓరినాయనో...పిల్లల్ని కన్ఫ్యూజన్ అనే కొక్కెంలో ఇరికించిన స్థితి ఎవరిది మనదే...అంటే.... సమాజానిదే...యువత ఎటువెళ్లాలో,,ఏం చేయాలో తెలియని స్థితి. వారి మనస్తత్వాన్ని బట్టి ఎన్నుకోవాలా....డిమాండ్ వైపు పరుగులుతీయాలా.... తమలోని శక్తిని వారే అంచనా వేసుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న యువత...ఈ సమయంలోనే యువతకు 'యూత్ ఐకాన్' వివేకానంద బోధనలు అవసరం. ఈ నెల 12న వివేకానంద జయంతి సందర్భంగా....యువతలోని వివేకాన్ని, ఉత్తేజాన్ని కలిగించి తట్టిలేపేందుకు వివేకానంద పలుసూచనలు, బోధనలు చేశారు. దేశం అభివృద్ధి పథంలో కొనసాగాలంటే ఆ దేశంలోని యువత శక్తి యుక్తులమీదే ఆధారపడి ఉంటుందనేది సత్యం. ఆత్మస్థైర్యానికి, దేశభక్తికి మారుపేరైన స్వామి వివేకానంద, భగత్‌సింగ్, చంద్ర శేఖర్ ఆజాద్, సుఖదేవ్, రాజ్‌గురు వంటి త్యాగమూర్తుల జీవితాలే యువతకు ఆదర్శం. ఎలా జీవించాలి... ఎందుకు జీవించాలి... యువత సమస్యలకు పరిష్కారాలు ఏమిటి..? ఎలా చెప్పారు...?

చిన్న వైఫల్యంతోనే జీవితంలో అన్నీకోల్పోయినట్లు నెగెటివ్ ఆలోచనలు పారద్రోలమని సూచించేవారు.

నా దేశంలోని యువత మీద నాకు అపారమైన నమ్మకం ఉందని పదేపదే పేర్కొనేవారు. యువతే దేశంలోనే పలుసమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తారని నమ్మేవారు. యువతలోని బలమే దేశపురోభివృద్ధికి మార్గమని నమ్మేవారు. మనిషి జ్ఞానాన్ని సమకూర్చుకోవాలని ప్రోత్సహించేవారు. బద్ధకాన్ని పారద్రోలమని దేనికీ భయపడవద్దనీ అనేవారు. జ్ఞానంతోనే సంతోషం లభిస్తుందనేవారు. కాలిఫోర్నియా లోని లాస్‌ఏంజిల్స్‌లో 1900లో మాట్లాడు తూ, తనజీవితంలో నేర్చుకున్న అతిపెద్ద పాఠం ఏదైనా ఉందంటే అది లక్ష్యాన్ని సాధించాలంటే ఏకాగ్రత ఉండాలన్నదే... ఏకాగ్రత, కార్యదీక్ష ఉంటే జీవితంలో సాధిం చలేనిది ఉండదని ఓ ప్రశ్నకు సమాధానమి చ్చారు. జీవితంలో అత్యుత్తమ ఆదర్శాన్ని ఎంచుకుని దానికోసం శ్రమపడాలని సూచించేవారు. "రోజులో ఒకసారి తమకు తామే మాట్లాడుకోకపోతే జీవితంలో అద్భుత మైన వ్యక్తిని కలుసుకోకపోవచ్చు" పని, పని.. పని.. ఇదే యువత నినాదంకావాలని ఉద్బోదించేవారు. "మీకుమీరే గొప్పవారమని భావించాలనీ, ఎప్పుడో ఒకప్పుడు మీరే అత్యుత్తములవుతారని" అనేవారు. " లేవండి, మేల్కొనండి...లక్ష్యాన్ని చేరేవరకు విశ్రమించ కండి"అని యువతను పలు సందర్భాల్లో ప్రోత్సహించేవారు. "మీ మీద నమ్మకం కలిగేవరకు దేవుడ్ని నమ్మకండి" అన్నారు.

తగ్గనున్న తలసరి ఆదాయం

న్యూఢిల్లీ : భారతదేశ తలసరి ఆదాయ వృద్ధి 2017-18లో 8.3 శాతానికి తగ్గవచ్చునని సెంట్రల్ స్టాటిస్టిక్స్ అంచనా.. 2016-17లో 9.7శాతంగా ఉన్న తలసరి ఆదాయం ఈసారి రూ.1,11,782తో 8.3శాతానికి పరిమితం కావచ్చుననే సూచనలు ఉన్నాయి. తలసరి ఆదాయం వారి జీవనశైలిపై ఆధారపడిఉంటుంది. 2016-17లో భారతీయ తలసరి ఆదాయం 9.7శాతం పెరిగి రూ.103,219గా నిలిచింది.

2017-18 సంవత్సరానికి తలసరి నికర జాతీయ ఆదాయం 8.3 శాతంతో రూ.111,782 లకు పరిమితమైంది. 2017-18 సంవత్సరంలో ఆర్థిక వృద్ధి నాలుగేళ్ల కనిష్టానికి దిగజారనున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా వ్యవసాయం, తయారీరంగాల్లో వృద్ధి నమోదుచేయకపోవడం ప్రధానకారణంగాఉంది. జీడీపీ 2016-17లో 7.1శాతం కాగా అంతకు ముందు సంవత్సరంలో 8శాతం, 2014-15లో 7.5శాతం నమోదైంది.

విశాలాంధ్ర బిజినెస్

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
యెస్ బ్యాంక్	337.95	5.03
అదానీ పోర్ట్స్	426.90	3.71
భారతి ఎయిర్‌టెల్	542.25	3.36
ఇన్‌డస్‌ఇండ్ బ్యాంక్	1,702.00	3.17
డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్	2,472.65	2.40

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఓఎన్‌జీసీ	200.30	-0.83
ఐసీఐసీఐ బ్యాంక్	315.15	-0.70
ఎస్‌బీఐ	311.80	-0.60
విప్రో	314.00	-0.56
సన్ ఫార్మా	587.50	-0.39

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.40	63.36
యూరో	76.39	76.24
పౌండ్	85.79	86.00
ఆస్ట్రేలియా డాలర్	49.74	49.81
సింగపూర్ డాలర్	47.75	47.79

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,180	30,139
చెన్నై	28,250	30,214
బెంగళూరు	27,600	29,519
ముంబై	28,970	30,984
విజయవాడ	28,250	30,500

2022నాటికి 75శాతం ఉద్యోగాల్లో మరింత నైపుణ్యం అవసరం

సాంకేతికతకు పెద్దపీట



న్యూఢిల్లీ : ఐటిరంగంలోని బిపిఎమ్(బిజినెస్ ప్రాసెస్ మేనేజిమెంట్) రంగంలోని ఉద్యోగాలపై 2022నాటికి డిజిటల్, ఆటోమేషన్ ప్రభావం 70నుండి 75శాతం ప్రభావంచూపవచ్చు నని తాజా నివేదిక హెచ్చరించింది. ఫిక్కీనాస్కామ్ చేసిన అధ్యయనంలో భారతీయ ఆర్థికవ్యవస్థపై నూతన ఉపాధి అవకాశాలు పలు ప్రభావం చూపనున్నట్లుతెలుస్తోంది. 2022నాటికి 60-65శాతం ఐటీ-బిపిఎమ్ శాఖలో తమ నైపుణ్యా లసు భారీగా పెంచుకోవలసి ఉంది. 97శాతం రిస్కిల్లిం గ్‌తో ముందుకురావలసిఉంది. ప్రపంచీకరణ, భౌగోళిక మార్పుల కారణంగా 2022 నాటికి 4.5 మిలియన్ల మందిలో 10-20 శాతం 3డి డిజైనింగ్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లలో ప్రత్యేకతలను సంతరించుకోవలసి ఉంది. మార్కెటింగ్ మేనేజర్, డాటాబేస్, అడ్మినిస్ట్రేటివ్, డాటా ఎనలిస్ట్ వంటి పదాల్లో పలు మార్పులు రానున్నట్లు 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ ఇన్ ఇండియా' తెలియజేసింది. సాంకేతికపరంగా నైపుణ్యంలేకపోవడం ఆటోమేషన్ అవరోధంగా ఉంటుందని 72శాతం మంది తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. భారతీయ విద్యావిధానం ఎలా ఉందంటే నైపుణ్యాల కొరతతో సర్వీసు రంగంలో మాత్రం ఆధిపత్యం వహించిందని చెప్పవచ్చునని ప్రముఖులు వెల్లడించారు. మన విద్యా విధసంల పెనుమార్పులు రావలసిఉంది. సాంకేతికపర మైన విధానాలతో మరింత ఆర్థిక అవకాశాలు వచ్చే వీలున్నందున నైపుణ్యాలకు తగిన విద్యావకాశాలు అందించవలసిఉంది.

స్టెర్లింగ్ హాలిడే రిసార్ట్స్ ఆవిష్కరణ



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సమకాలీన బ్రాండ్ అనుభవాన్ని, ఆవిష్కరణల్ని అందించే కొత్త సర్వీస్ ఫిలాసఫీతో కొత్త, అత్యాధునిక బ్రాండ్‌ని స్టెర్లింగ్ హాలిడే రిసార్ట్స్ ఆవిష్కరించింది. క్యూరేటెడ్ అనుభవాలు, ప్రత్యేక అసాధారణ అనుభవాలను స్టెర్లింగ్ అందించనుం దని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ రామనాథన్ తెలిపారు. గొప్ప సర్వీస్, ప్రత్యేక అనుభవాలు, అద్భుతమైన ఆవిష్కర ణలకు దోహదపడే కొత్త స్టెర్లింగ్ బ్రాండ్‌ని అందించడం సంతోషంగా ఉందన్నారు. రిసార్ట్ విస్తరణ ప్రణాళికల కోసం కంపెనీ తన బ్రాండ్ గుర్తింపును పూర్తిగా మార్చిందని, మేనేజ్‌మెంట్ కాంట్రాక్ట్ రూట్ ద్వారా రాబోయే నాలుగైదు సంవత్సరాల కాలంలో రూమ్ ఇన్వెంటరీని రెట్టింపు చేయాలను కున్నట్లు తెలిపారు. 50కి పైగా ప్రదేశాల్లో రిసార్ట్‌లను విస్తరించ నున్నామన్నారు. స్టెర్లింగ్ హాలిడే రిసార్ట్స్ దేశంలో ప్రముఖ లీజర్ హాస్పిటాలిటీ కంపెనీ అని, 1986 నుంచి హాలిడేకు సంబంధించిన గొప్ప సేవలు అందిస్తోం దన్నారు. ప్రస్తుతం స్టెర్లింగ్‌కు ఆగ్రా, అనాకట్టి, కార్బెట్, దాబోసా, డామన్, డార్జిలింగ్, దిండి, ధర్మశాల, దుర్షిత్, గోవా, ఊటీ, పూరీ, సాజన్, షిర్డీ వంటి 33 ప్రదేశాల్లో రిసార్ట్‌లు ఉన్నాయని తెలిపారు.

హోమ్ క్రెడిట్స్ మరో మైలురాయి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్యాంకేతర ఆర్థిక సంస్థ హోమ్ క్రెడిట్స్ ఇండియా ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఐదేళ్లలో 5 మిల్లియన్ కస్టమర్ల మైలురాయిని దాటినట్లు వెల్లడించింది. 2012లో తొలిసారిగా భారత్‌లో ఆవిష్కృతమైన ఈ సంస్థ 2016కి మిలియన్ కస్టమర్ల బెంచ్ మార్కును దాటింది. దీంతో వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న సంస్థగా పేరొందిందని హోమ్ క్రెడిట్స్ ఇండియా సీఈవో పావెల్ మాకొ తెలిపారు.

కాయకల్ప్‌తో సస్యరక్షణ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : సేంద్రీయ సస్యరక్షణ ఉత్పత్తిగా అందుబాటులో ఉన్న కాయకల్ప్‌ను వాడటం ద్వారా మరింత దిగుబడిని సాధించడంతో పాటు రసాయనాల వాడకాన్ని తగ్గించుకోవచ్చని ఇన్‌సెక్టిసైడ్ ఇండియా లిమిటెడ్ ఏరియా మేనేజర్ శేఖర్‌రెడ్డి చెప్పారు. నాగర్ కర్నూలు జిల్లా కొండనాగులు గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో రైతులకు అవగాహనలో ఆయన పాల్గొన్నారు. ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గడిచిన ఆరు నెలలుగా కాయకల్ప్ వాడుతున్న రైతులు తమ అనుభవాలను వివరించారు. దిగుబడి పెరిగిందని, ఎరువుల వాడకం తగ్గించామని వెల్లడించారు.

విజ్ఞానం

అమ్మాయిల్లో ఆటిజం గుర్తింపు కష్టమే...



అమ్మాయిల్లో తొలిదశలో ఆటిజం గుర్తించడం కష్టమేనని తెలుస్తోంది. నలుగురితో కలివిడితనం,వేషధారణ అంశాలతో అమ్మాయిలు కాస్త ఎక్కువగా ఇబ్బంది పడటమే ఇందుకు కారణంగాఉంది. అమెరికాలోని 'ఆటిజం' స్పెక్ట్రం పరిశోధక కేంద్ర శాస్త్రవేత్తే అల్లిసన్ చేసినఅధ్యయనంలో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిల్లో రోజువారీపనులలో సైతం ఎక్కువ ఇబ్బందిపడుతున్నట్లు గ్రహించారు.అబ్బాయిలకుచేసే పరీక్షలు అమ్మాయిలకుచేస్తే సులువుగా గుర్తించలేమని తెలిపారు. ఆటిజం లక్షణాలు లింగంపై ఆధారపడిఉంటాయని అంచనా వేసింది వీరే...



క్లోరిన్‌తో ఓజోన్‌ను నియంత్రణ

రసాయన నిషేధం ఓజోన్ పొర రంధ్రం మూసివేతకు సహాయపడిందని నాసా వెల్లడించింది. ఓజోన్ పొరను నాశనం చేస్తున్న క్లోరిన్ శాతాన్ని అంతర్జాతీయంగా నిషేధించేందుకు నిర్ణయించింది. మనుషులు తయారుచేసే క్లోరిన్ ఉండేటువంటి క్లోరోఫ్లోరోకార్బన్స్ (సిఎఫ్‌సి) ఓజోన్ పొరను20శాతం నిర్వీర్యం చేస్తున్నట్లు అమెరికాలోని మేరిలాండ్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. స్ట్రాటో ఆవరణలో ఉన్న సిఎఫ్‌సి రసాయన సమ్మేళనం ఎక్కువకాలం వాతావరణంలో ఉంటుంది. ఇది సూర్యుని నుండి వెలువడే అల్ట్రా వయెలెట్ కిరణాల రేడియేషన్‌ను బ్రేక్ చేసి ఓజోన్ మాలిక్యూల్ నిర్వీర్యంచేసే క్లోరిన్ ఆటమ్స్‌ను విడుదల చేస్తుంది. స్కిన్ కేన్సర్, కాటరాక్ట్,ఇమ్యూన్ సిస్టమ్‌ను నిర్వీర్యంచేసి వృక్షజాతులను డేమేజ్ చేసే అల్ట్రా వయెలెట్ కిరణాలను స్ట్రాటో స్ఫియర్‌లో ఉండే ఓజోన్ పరిరక్షిస్తుంది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి	డాలరు Vs రూపాయి	ముడి చమురు
184.21 ▲	54.05 ▲	-150 ▼	▲		▲
34,153.85	10,558.85	28,250	41,000	63.87	67.62
		22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)		బ్రెంట్ ధర (డాలర్లలో..)



మధ్యతరగతి వారికి అనువైన
10 పెట్టుబడి మార్గాలు

> మధ్యతరగతి వారు కూడా పైసా పైసా కూడబెట్టి ధనవంతులు అవ్వొచ్చు. అయితే వారు తమ పెట్టుబడులను దీర్ఘకాలంపాటు సురక్షితమైన వాటిలో పెడితేనే ఇది సాధ్యం. సురక్షితమైన పథకాల్లో పెట్టిన పెట్టుబడి కోల్పోయే ప్రమాదం దాదాపు ఉండదు. పదవీ విరమణ పొందినవారికి, ఎలాంటి రిస్క్ తీసుకోలేనివారికి సురక్షితమైన పథకాలు మంచివి. పెట్టుబడుల విషయంలో చాలా మంది రిస్క్ తీసుకునే పరిస్థితి ఉండదు. వారి అభిరుచులకు అనుగుణంగానే మన దేశంలో ఇలాంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. వాటికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

నెలవారీ ఆదాయ పథకం

తక్కువ రిస్క్ ఉండాలి, మంచి రాబడి రావాలి, సురక్షితమైన పెట్టుబడి మార్గం ఉండాలి, ప్రభుత్వ ఆధీనంలో ఉండితీరాలి.. ఈ లక్షణాలన్నీ దేనికున్నాయంటే వెంటనే పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకం గుర్తుకొస్తుంది. అయితే ఈ పథకం పెద్దగా ప్రయోజనకారి కాదంటారు నిపుణులు. ప్రజా భవిష్య నిధితో పోలిస్తే తక్కువ వడ్డీ రేటు లభిస్తుంది. పైగా పన్ను వర్తిస్తుంది. వాస్తవంగా అందుకునే రాబడి తక్కువే ఉంటుంది. ఈ పథకంలో పెట్టినవారు మరింత మంచి రాబడిని ఆశిస్తున్నట్టయితే ఇతర మార్గాలను ఆశ్రయించవచ్చు. ప్రస్తుతానికి పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకం 7.6శాతం వడ్డీనిస్తోంది. మరీ తక్కువేం కాదు! ఫర్వాలేదు. మన దేశంలో అత్యంత సురక్షితమైన పెట్టుబడి పథకాల్లో ఇదీ ఒకటి. స్వయాన భారత ప్రభుత్వమే దీనికి హామీ ఇస్తోంది.

ప్రజా భవిష్య నిధి

ఉద్యోగులకు అత్యంత ఇష్టమైనది ప్రజా భవిష్య నిధి(పీపీఎఫ్) పథకం. దీంతో చాలానే ప్రయోజనాలున్నాయి. ఈ ఆదాయంపై వచ్చే వడ్డీకి ఎలాంటి పన్ను వర్తించదు. ఇక రెండోది .. సెక్షన్ 80సీ కింద పన్ను ఆదా చేసుకోవచ్చు. పదవీ విరమణకు అనుకూలమైన పథకమిది. వడ్డీ రేటు మాత్రం 9 శాతం నుంచి 7.9 శాతానికి పడిపోవడం విచారకరం. మరింత తగ్గే సూచనలు లేకపోలేదు.



దీర్ఘకాలంలో పెట్టుబడి చేసేవారైతే దీని గురించి పెద్దగా చింతించాల్సిన అవసరం లేదు. మన దేశంలో అత్యంత సురక్షితమైన పెట్టుబడి పథకాల్లో దీనికి అగ్రస్థానం ఉంది. పదవీ విరమణకు నిధి సృష్టించుకునేందుకు ఈ పథకం ఎంతో అనుకూలమైంది. ఒకే ఒక్క అంశం పీపీఎఫ్ కు ప్రతికూలంగా ఉంది. అదేమిటంటే దీని లాకిన్ పీరియడ్. ఇది ఆరేళ్లు ఉంది. ఈ కాలవ్యవధిలో ఇందులోంచి సొమ్మును విత్ డ్రా చేసుకోలేం.

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్

వయో వృద్ధుల సంక్షేమానికి మన ప్రభుత్వం వివిధ రంగాల్లో అనేక చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ ప్రవేశపెట్టారు. ప్రభుత్వమే వడ్డీరేటును నిర్ణయించి ప్రతి మూడు నెలలకోసారి సవరణ చేస్తుంది. ఒకప్పుడు 10శాతంగా ఉండే వడ్డీ ఇప్పుడు 8.4 శాతానికి చేరాయి. ఈ పథకాన్ని పోస్టాఫీసుతో పాటు ఐసీఐసీఐ, ఎస్‌బీఐ లాంటి బ్యాంకుల ద్వారా కూడా ప్రారంభించవచ్చు. పేరుకు తగ్గట్టుగానే ఈ పథకం కేవలం పెద్దలకు ఉద్దేశించింది మాత్రమే. ఈ పథకం పెద్దలకు కాబట్టి వచ్చే రాబడిపై పన్ను ఆదా ప్రయోజనాలు ఉంటాయనుకుంటే పొరబడినట్టే. దీనికి కాంట్రవర్సీగా ఎలాంటి పన్ను ప్రయోజనాలు లేవు. ఈ డిపాజిట్లపై టీడీఎస్ వర్తిస్తుంది. క్రమమైన కాలవ్యవధుల్లో ఈ పథకాలపై ప్రభుత్వం వడ్డీ రేట్లను సవరిస్తూ ఉంటుంది.

సుకన్య సమృద్ధి యోజన

ఆడపిల్లలను చదువుకునేలా ప్రోత్సహించేందుకు సుకన్య సమృద్ధి యోజనను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ ఖాతాను ఏదేని పోస్టాఫీసులో లేదా వాణిజ్య బ్యాంకుల్లో ప్రారంభించవచ్చు. సుకన్య సమృద్ధి ఖాతాలో డబ్బులు పెట్టడం వల్ల అనేక ఉపయోగాలున్నాయి. తొలి ప్రయోజనంగా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలు పొందవచ్చు. రెండో ప్రయోజనంగా ఆడపిల్లల పేరిట నిధి జమచేయవచ్చు.



దీర్ఘకాల పెట్టుబడిదారు అయితే ఇది చాలా మంచి పథకం. ఇది మరీ దీర్ఘకాలంపాటు కొనసాగించాల్సి వస్తుంది అదే దీంతో పెద్ద ఇబ్బంది. ప్రస్తుతానికి ఈ పథకంపై వార్షికంగా 8.4శాతం వడ్డీనందిస్తున్నారు. ఇతర పోస్టాఫీసు పథకాల మాదిరిగా వీటి వడ్డీ రేట్లలో ప్రభుత్వం సవరణలు చేస్తూనే ఉంటుంది.

డెట్ మ్యూచువల్ ఫండ్లు

బ్యాంకు డిపాజిట్ల కంటే మెరుగైన రాబడులను డెట్ మ్యూచువల్ ఫండ్లు అందించగలవు. దీంట్లోని సొమ్మును కొంత ఈక్విటీల్లోనూ పెడతారు. డెట్ మ్యూచువల్ ఫండ్లు సురక్షితమైనవి. ఎందుకంటే వీటిలో కొంత సొమ్మును కార్పొరేట్ బాండ్లు, ప్రభుత్వ బాండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల లాంటివాటిలో పెట్టి లాభాలను గడించి అవి ఫండ్లో పెట్టుబడి పెట్టేవారికి అందజేస్తారు. స్వల్పకాలానికి లేదా దీర్ఘకాల అవసరాలకు డెట్ మ్యూచువల్ ఫండ్లు సరిపోతాయి. 6. పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్లు

ఇలాంటి పథకాల్లో పెట్టుబడులతో సెక్షన్ 80సీ కింద పన్ను ఆదా ప్రయోజనాలను పొందవచ్చు. పెట్టుబడిపై వడ్డీ రూపంలో ఆదాయం సంవత్సరానికి రూ.10 వేలు దాటితే మాత్రం టీడీఎస్ విధిస్తారు. పాన్ కార్డు ఇస్తే 10శాతమే పన్ను పడుతుంది. లేదా 20శాతం టీడీఎస్ విధిస్తారు. ఈ డిపాజిట్లపై వడ్డీ 6 నుంచి 7శాతం మధ్యలో ఉంటాయి. ఇటీవలే బాగా తగ్గాయి.

ఎంపిక చేసిన కంపెనీ డిపాజిట్లు

కంపెనీ డిపాజిట్లు కూడా సురక్షితమైన పెట్టుబడి పథకాలే. AAA రేట్ ఉన్న డిపాజిట్లు సురక్షితమైనవి. ఉదాహరణకు బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా ఫైనాన్స్ లాంటివి AAA రేట్ ఉన్న డిపాజిట్లను అందిస్తాయి. బ్యాంకు డిపాజిట్ల కంటే కాస్త మెరుగైన వడ్డీ రేట్లను ఇవి అందిస్తుంటాయి. బ్యాంకులతో పోలిస్తే కనీసం 1శాతం అధికంగా వడ్డీని ఇస్తాయి. అయితే ఇలాంటివి కాస్త రిస్క్ తో కూడుకున్నవి.

ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్స్

వీటి కాలవ్యవధి సాధారణంగా ఏడాది లోపే ఉంటుంది. సురక్షితమైన మ్యూచువల్ ఫండ్ రకాల్లో ఇవీ ఒకటి. ఇందులో మదుపరుల సొమ్మును AAA రేటు ఉన్న సాధనాల్లో పెట్టుబడి పెడతారు. ఏడాదిపాటు పెట్టుబడి పెట్టాలనుకునేవారికి ఇవి అనుకూలం. లాభాలు ఫర్వాలేదు. అయితే ఇవి పన్ను ఆదా పథకాలు కావు. కాబట్టి వాస్తవ రాబడులు చాలా తగ్గవచ్చు.

పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్లు

సురక్షితమైన పెట్టుబడి మార్గం గురించి ఆలోచించేవారు పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్లను పరిశీలించవచ్చు. ఈ మధ్య కాలంలోనే వడ్డీ రేట్లు పడిపోయాయి. అయితే దీర్ఘకాలానికి సంపద సృష్టించుకోవాలంటే మాత్రం ఇది చాలా మంచి పథకం. అయితే ఈ పథకంలో అందుకునే ఆదాయానికి పన్ను వర్తిస్తుంది. ఇదొక్కటే దీనికున్న ప్రతికూలత. అయిదేళ్ల పాటు స్థిరంగా వీటిలో పెట్టుబడి పెడితే మంచి లాభం వచ్చే అవకాశాలున్నాయి. ఉద్యోగులకు ఈ పథకం మంచి అవకాశం.

మ్యూచువల్ ఫండ్లలో ఎంఐపీలు

డెట్ మ్యూచువల్ ఫండ్లలో సురక్షితమైనవి మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్లు. వీటిలోని సొమ్మును ఎక్కువగా ప్రభుత్వ పథకాల్లో లేదా అధిక రేటు ఉండే డెట్ మ్యూచువల్ ఫండ్లలో పెడతారు. కాబట్టి ఇవి సురక్షితమని చెప్పొచ్చు. దీర్ఘకాల పెట్టుబడిదారు అయితే ఎంఐపీలను పరిశీలించవచ్చు. గతంలో ఈ పథకాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తిన దాఖలాలు లేవు. కొన్ని సార్లు వీటిలో ఈక్విటీ, డెట్ మిశ్రమంగా పెట్టుబడులు పెడతారు. దీంతో అధిక రాబడులు వచ్చేలా చేస్తారు. కొన్ని ఎంఐపీలు గత ఏడాది కాలంలో 10శాతం దాకా రాబడినిచ్చాయి.



మమ్ముట్టి స్ట్రీట్ లైట్స్ టీజర్ విడుదల

మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి హీరోగా నటించిన చిత్రం స్ట్రీట్ లైట్స్. ప్లే హౌస్ మోషన్ పిక్చర్ ప్రై.లి నిర్మాణంలో శ్యామ్ దత్ సైనుద్దీన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. విభిన్నమైన కథల్ని ఎంచుకునే మమ్ముట్టి ఈ సారి కూడా ఆడియెన్స్‌ని థ్రిల్‌కు గురి చేసే కథాంశంతో స్ట్రీట్ లైట్స్ చిత్రంతో రానున్నారు. ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేశారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే విభిన్నమైన కథ ఇది. తమిళ, మలయాళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రాన్ని స్ట్రీట్ లైట్స్ పేరుతోనే రిలీజ్ చేస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ... మమ్ముట్టికి తెలుగులో వీరాభిమానులున్నారు. ఆయనకున్న క్రేజ్ దృష్ట్యా స్ట్రీట్ లైట్స్ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. స్ట్రీట్ లైట్స్ తెలుగు టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. దర్శకుడు శ్యామ్ దత్ చెప్పిన కథ, కథనం ఆడియెన్స్‌ను మెస్మరైజ్ చేస్తుంది. క్రైం థ్రిల్లర్‌గా సాగే ఈ కథ అందరినీ మెప్పిస్తుంది. మమ్ముట్టి గారి కెరీర్లో మరో మైలురాయిగా నిలిచే చిత్రంగా నిలుస్తుందనే నమ్మకం ఉంది. అని అన్నారు. నటీనటులు మమ్ముట్టి, స్టంట్ శివ, మొట్ట రాజేంద్ర, పాండి రాజన్, మనోబాల, బ్లాక్ పాండి, శ్రీరామ్, పృథ్వీ పాండిరాజ్, సంపత్ రామ్, రోనీ, మాస్టర్ ఆశిష్, మురుగన్, జుడే ఆంటోని, సోహన్ లాల్, లిజో మోల్, సెమ్మలార్, పొన్నం బాబు, సెమ్మా జీ నాయర్.



నిర్మాతగా రానా



'హలో' సినిమాతో విజయం అందుకున్న అక్కినేని హీరో అఖిల్ తన తర్వాతి ప్రాజెక్టు కథకు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సత్య పినిశెట్టి ('మలుపు' ఫేం) దర్శకత్వం వహించనున్నారట. అయితే ఈ చిత్రం కోసం రానా నిర్మాతగా మారినట్లు చెబుతున్నారు. దీని నిర్మాణ బాధ్యతల్ని ఆయనే చూసుకుంటున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. అయితే దీనికి సంబంధించి చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోపక్క అఖిల్ తన మూడో సినిమాను కొరటాల శివ దర్శకత్వంలో చేయనున్నారని ఇటీవల గుసగుసలు వినిపించాయి. సినిమా కథ కూడా సిద్ధమైపోయినట్లు చెప్పుకొచ్చారు. మరి ఇందులో ఏది నిజమో తెలియాలంటే వేచి చూడాల్సిందే. 'హలో' సినిమాకు విక్రమ్ కె కుమార్ దర్శకత్వం వహించారు.

అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మించారు. కల్యాణి ప్రియదర్శన్ కథానాయిక. అనూప్ రూబెన్స్ స్వరాలు అందించారు. క్రిస్మస్ సందర్భంగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది.



ఫిబ్రవరి 9న గాయత్రి..

డా. మోహన్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'గాయత్రి' చిత్రాన్ని ఫిబ్రవరి 9న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విలక్షణ నటుడి పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్ క్రిస్మస్‌కు విడుదల కాగా విశేష స్పందన వచ్చింది. ఈ చిత్రంలో మొదటి సారిగా విష్ణు మంచు, శ్రియలు జంటగా నటిస్తున్నారు. వీరిరువురు ఆదర్శ దంపతులుగా కనిపిస్తూ కొత్త సంవత్సరం రోజున విడుదలైన పోస్టర్ సందడి చేసింది. తాజాగా చిత్ర బృందం శ్రియ పోస్టర్ విడుదల చేసింది. మధ్యతరగతి గృహిణిగా చక్కటి చీరకట్టుతో ఆకర్షణీయంగా ఉన్న శ్రియ లుక్‌కి కూడా మంచి స్పందనే వస్తుంది. "నేనేదనుకుంటే అది చెప్పడం నాకు అలవాటు, తర్వాత సంగతి తర్వాత" అని పోస్టర్‌పై ఉన్న కాప్షన్ శ్రియ పాత్రకు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తుంది. మదన్ దర్శకత్వం వహించిన గాయత్రి చిత్రానికి ఎస్.ఎస్.తమన్ సంగీతం సమకూర్చారు. నిఖిల విమల్, బ్రహ్మానందం ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఫిబ్రవరి 9 న మన ముందుకు రాబోతున్న గాయత్రి చిత్రాన్ని డా.యమ్.మోహన్ బాబు తన ప్రతిష్టాత్మక బ్యానర్ అయిన శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్‌పై నిర్మించగా అరియానా, వివియానా మరియు విద్యా నిర్వాణ సమర్పిస్తున్నారు.

విశాలాంధ్ర సినిమా

జూన్ నుంచి ఆర్.జె. సినిమాస్ కొత్త చిత్రం

డైనమిక్ లేడీ డైరెక్టర్ జయ బి. దర్శకత్వంలో 'ప్రేమలో పావని కళ్యాణ్', 'చంటిగాడు', 'గుండమ్మగారి మనవడు', 'లవ్‌లీ', 'వైశాఖం' వంటి సూపర్‌హిట్ చిత్రాలను నిర్మించి అభిరుచిగల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు ప్రముఖ నిర్మాత బి.ఎ.రాజు. జనవరి 7 నిర్మాత బి.ఎ.రాజు పుట్టినరోజు సందర్భంగా తమ ఆర్.జె. సినిమాస్ బేనర్‌పై మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించనున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత బి.ఎ.రాజు మాట్లాడుతూ - "మా బేనర్‌లో నిర్మించిన మొదటి సినిమా 'ప్రేమలో పావని కళ్యాణ్'. నిర్మాతగా ఎంటర్ అయి 15 సంవత్సరాలు పూర్తయింది. మా బేనర్‌లో వచ్చిన 'ప్రేమలో పావని కళ్యాణ్', 'చంటిగాడు', 'గుండమ్మగారి మనవడు', 'లవ్‌లీ', 'వైశాఖం' చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇప్పుడు మా ఆర్.జె. సినిమాస్ బేనర్‌లో జయ దర్శకత్వంలో మరో చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ని నిర్మించబోతున్నాం. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన స్టోరీ డిస్కషన్స్ జరుగుతున్నాయి. జూన్‌లో ఈ సినిమాని స్టార్ట్ చేస్తాం. అలాగే మా సూపర్‌హిట్ మ్యాగజైన్ 24వ సంవత్సరంలోకి సక్సెస్‌ఫుల్‌గా అడుగుపెట్టింది. మా వెబ్‌సైట్ ఇండస్ట్రీ హిట్ డాట్ కామ్ మంచి రేటింగ్‌తో నాలుగో సంవత్సరంలోకి ఎంటర్ అయింది" అన్నారు.



విశాల్ 'అభిమన్యుడు' టీజర్ విడుదల

మాస్ హీరో విశాల్... విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై పి.ఎస్.మిత్రన్ దర్శకత్వంలో హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న 'అభిమన్యుడు'. ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ ఓ డిఫరెంట్ క్యారెక్టర్‌తో అలరిస్తారు. మాస్ హీరో విశాల్ సరసన సమంత నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను విడుదల చేశారు. 'ఈ కాలపు దొంగకి నీ ఇంటి తాళాలు అక్కర్లేదు. నీ గురించిన ఓ చిన్న ఇన్‌ఫర్మేషన్ చాలు..' అంటూ ప్రారంభమయ్యే టీజర్‌లో సినిమా ఏ ఫార్మాట్‌లో ఉండబోతోంది, టెక్నికల్‌గా ఎలాంటి స్టాండర్డ్స్‌లో ఈ చిత్రాన్ని రూపొందించారు అనే విషయాలు స్పష్టంగా అర్థమవుతాయి. యువన్ శంకర్ రాజా అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వల్ల సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందనేది టీజర్‌లోనే అర్థమవుతుంది. విశాల్ న్యూ లుక్, యాక్షన్ సీక్వెన్స్‌లు, యాక్షన్ కింగ్ అర్జున్ డిఫరెంట్ లుక్, సమంత గ్లామర్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. విశాల్ కెరీర్‌లో మరో సూపర్‌హిట్ సినిమాగా 'అభిమన్యుడు' నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ చిత్రాన్ని జనవరిలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు విశాల్. మాస్ హీరో విశాల్, సమంత, యాక్షన్ కింగ్ అర్జున్‌తోపాటు భారీ తారాగణం ఈ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్‌రాజా, సినిమాటోగ్రఫీ: జార్జ్ సి. విలియమ్స్, ఎడిటింగ్: రూబెన్, ఫైట్స్: దిలీప్ సుబ్బరాయన్, ఆర్ట్: ఉమేష్ జె.కుమార్, మాటలు: రాజేష్ ఎ.మూర్తి, నిర్మాత: విశాల్, దర్శకత్వం: పి.ఎస్.మిత్రన్.

జువ్వ మోషన్ పోస్టర్ విడుదల

రంజిత్, పాలక్ లల్వానీ హీరో, హీరోయిన్లుగా నటిస్తోన్న చిత్రం జువ్వ దిక్కులు చూడకు రామయ్య ఫేం త్రికోటి పేట దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్. వి. రమణ సమర్పణలో సొమ్మి ఫిలింస్ పై డా. భరత్ సోమి నిర్మిస్తున్నారు. కీరవాణి సంగీతం.



అజ్ఞాతవాసి చిత్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణలు శనివారం రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సచివాలయంలో కలిశారు. ఈ నెల 10 వ తేదీన విడుదల కానున్న అజ్ఞాతవాసి చిత్రాన్ని చూసేందుకు రావాలని మంత్రిని కోరారు. వీరితో పాటు మంత్రిని కలిసిన వారిలో ఎఫ్‌డిసీ ఛైర్మన్ రామ్మోహన్ రావు కూడా ఉన్నారు.

చేతులు కట్టి..కాళ్లతో తన్నుతూ...

వైరల్‌గా పోలీసు అధికారి వికృతం



కొప్పాల్(కర్నాటక) : పోలీసుల అధికార దర్పం మరోసారి బహిర్గతమైంది. ఇద్దరు వ్యక్తులను బూటుకాళ్లతో తన్నుతూ కిరాతకంగా వ్యవహరించిన వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇది కర్నాటకలోని ఓ పోలీసు స్టేషన్‌లో జరిగింది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై ఇద్దరిని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ ఇద్దరి చేతులను పోలీసు అధికారి గట్టిగా కట్టేశారు. తీవ్రంగా కొట్టారు. అందులో ఒకడు దెబ్బలు తట్టుకోలేక పడిపోయాడు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. మరో పోలీసు అధికారి వచ్చి రెండో వ్యక్తిని చిత్రహింసలకు గురిచేశాడు. ఆ ఇద్దరినీ పోలీసు అధికారులు చేతులు కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు. ఈ దిగ్భ్రాంతికరమైన ఘటన బెంగళూరుకు 350 కిలోమీటర్ల దూరంలో గల కొప్పాల్‌లో చోటుచేసుకున్నది. స్థానిక దేవాలయం వద్ద పెద్దఎత్తున ప్రజలు గుమిగూడటంతో పోలీసులు ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేశారు. ఈ ప్రత్యేక నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరిని అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ అదుపులోకి తీసుకున్నాడు. కొప్పాల్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చాడు. అక్కడ ఆ ఇద్దరికీ నరకం చూపించారు.

అది మోడీ 'జీడీపీ'

- అంటే జాతీయ స్థూల విభజన విధానం
- జైట్లీ ఆర్థిక వ్యవస్థ వినాశకారి
- రాహుల్ వ్యంగాస్త్రాలు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తాజాగా ప్రధాని నరేంద్రమోడీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీలపై విరుచుకుపడ్డారు. వారి నేపథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రస్థాయిలో విమర్శించారు. మోడీ రాజకీయ శైలికి తనదైనా భాష్యం చెప్పారు. మోడీ, జైట్లీ విధానాలతో దేశ ఆర్థికవ్యవస్థ నష్టాల ఊబిలో కూరుకుపోతోందన్నారు. 2016-17లో 7.1శాతమున్న స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) 2017-18లో నాలుగేళ్లలో లేనంత కనిష్టానికి (6.5శాతానికి) పడిపోతుందన్న అంచనా ఉన్నట్టు రాహుల్ వెల్లడించారు. మోడీ జీడీపీ అంటే 'జాతీయ స్థూల విభజన విధానం' అంటూ సొంత నిర్వచనం చెప్పారు. ఫిబ్రవరి 1న కేంద్రబడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మోడీ ట్విట్టర్ వేదికగా జైట్లీ ఆర్థికవిధానాలను ఎండగట్టారు. అరుణ్ జైట్లీ ఓ మేధావంటూ ఎద్దేవా చేశారు. మోడీ జాతీయ స్థూల విభజన విధానం కారణంగా దేశ ఆర్థికవ్యవస్థ ఎంతో పురోగతి సాధింస్తోం దంటూ వ్యంగాస్త్రాలు సంధించారు.

ఈశాన్యంపై అమితాశ..!

- మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్‌లపై దృష్టి
- ముందస్తు ప్రచారంలో బిజీబిజీ



న్యూఢిల్లీ : అసోంలో విజయంతో, మణిపూర్‌లో మనీపవర్, అరుణాచల్ ప్రదేశ్‌లో అనైతిక రాజకీయాలతో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన బీజేపీ.. అదే ఊపుతో ఈశాన్య భారతంలోని మరో మూడు రాష్ట్రాల్లో పాగా వేయాలని ఉవ్విళ్లూరుతోంది. మేఘాలయ, త్రిపురా, నాగాలాండ్ అసెంబ్లీలకు ఈ ఏడాది మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. ఈశాన్య భారతాన్ని కైవశం చేసుకోవాలనే లక్ష్యంతో అన్ని పార్టీల కంటే ముందే బీజేపీ ప్రచారపర్వానికి తెరలేపింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా శనివారం మేఘాలయలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆదివారం త్రిపురలో పర్యటిస్తారు. మేఘాలయలో అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ, మోడీ అభివృద్ధి మంత్రాన్ని జనంలోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది. వ్యూహాత్మకంగా సీఎం ముకుల్ సంగ్మాకు గట్టిపట్టున్న టిక్రికిల్లా (గారో హిల్స్) నుంచే శనివారం మధ్యాహ్నం అమిత్ షా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సాయంత్రం షిల్లాంగ్‌లో బీజేపీ రాష్ట్రకార్యాలయానికి శంకుస్థాపన చేస్తారు. 60 స్థానాలున్న మేఘాలయలో కనీసం 40 స్థానాలు గెల్చుకోవాలనే ప్రణాళికతో బీజేపీ వ్యూహాలు పన్నింది. అటు త్రిపురలో అప్రతిహతంగా కొనసాగుతోన్న సీపీఎంను నిలువరించాలని పావులు కదుపుతోంది. ఆదివారం త్రిపురలో అమిత్‌షా పర్యటిస్తారు. డిసెంబర్ మొదటివారంలో ఈశాన్యంలో పర్యటించిన ప్రధాని మోడీ.. పలు అభివృద్ధిపనులను ప్రారంభించిన సంగతి విధితమే. ఈశాన్యంలో పాగా కోసం అధికారం ఎరతో స్థానిక బలమైన పార్టీలను ఆకర్షించాలని బీజేపీ ఇది వరకే నిర్ణయించింది. నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్డీఏ)లో అంతర్భాగంగా 2016లో నార్త్ ఈస్ట్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్‌ఈడీఏ)ని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. గత సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగిన ఎన్‌ఈడీఏ రెండో వార్షిక సదస్సులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈశాన్యంలోని అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లలో బీజేపీ సొంతగా అధికారంలో ఉంది. నాగాలాండ్, సిక్కింలలో ఎన్డీఏ ప్రభుత్వాలున్నాయి. ఇక మేఘాలయ (కాంగ్రెస్), త్రిపుర (సీపీఎం), మిజోరం (కాంగ్రెస్)లను కూడా కైవసం చేసుకుంటే ఈశాన్యంలో ఎనిమిదికి ఎనిమిది రాష్ట్రాలూ బీజేపీ ఖాతాలోకి చేరతాయి. మిజోరం అసెంబ్లీకి ఈ ఏడాది డిసెంబర్‌లో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈశాన్యంలో జైత్రయాత్ర జరపాలని మురిసి పోతున్న మోడీషా ద్వయానికి త్రిపురలో ఎలాంటి షాక్ తగులుతుందో?వేచి చూడాల్సిందే.

కాశ్మీర్‌లో సరిహద్దు వాసుల కోసం


5,390 బంకర్ల నిర్మాణం

జమ్మూ : కాశ్మీర్‌లో సరిహద్దు గ్రామాలలో నివసించే వారు 5,390 బంకర్లను పొందనున్నారు. రాజౌరి జిల్లాలో పాకిస్థాన్ దళాలు అడపాదడపా జరిపే కాల్పులు, దాడులను ఎదుర్కొనేందుకు సరిహద్దు వాసులు 54,000 మందికి ప్రభుత్వం సురక్షితమైన వసతిని కల్పించనున్నది. ఇందుకోసం వారికి 5,300కుపైగా వ్యక్తిగత, కమ్యూనిటీ బంకర్లను నిర్మించనున్నది. నిర్మాణంలో ఉన్న వంద బంకర్లతో పాటు 4,918 వ్యక్తిగత బంకర్లు, 372 కమ్యూనిటీ బంకర్లను నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాజౌరి జిల్లా అభివృద్ధి కమిషనర్ షహీద్ ఇక్బాల్ చౌదరి తెలిపారు. ఒక్కొక్క కమ్యూనిటీ బంకరులో 800 చదరపు అడుగుల్లో 40 మందికి వసతి కల్పిస్తారు. వ్యక్తిగత బంకర్లలో 60 చదరపు అడుగులలో 8 మందికి వసతి కల్పిస్తారని చెప్పారు. 54,000 మంది ప్రజలకు సురక్షిత వసతి కల్పించేందుకు ఈ ప్రాజెక్టును సృష్టించినట్టు తెలిపారు. జిల్లా అభివృద్ధి కమిషనర్ అధ్యక్షతన సరిహద్దు నివాసితులు, ఫీల్డ్‌ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి సహాయ, పునరావాస చర్యలపైన సమీక్ష జరుపుతారు. ఎల్‌ఓసీ వెంబడి సుందర్‌బని, నౌషెరా, దూంగి, మంజెకోటే ప్రాంతంలోని ప్రముఖ ప్రతినిధులు ఈ శుక్రవారం జరిగిన సమావేశానికి హాజరయ్యారు. నిర్ణీత కాలవ్యవధిలో బంకర్ల నిర్మాణానికి సంబంధించి విధివిధానాలు రూపొందించేందుకు స్థానికులు, ఇంజినీర్లు, సైనికాధికారులు, పాలనాపర అధినేతలతో సవివరమైన సమీక్ష జరిపారు.

మహారాష్ట్రలో కుల విద్వేష విధ్వంసం

శివసేన తీవ్ర విమర్శ

ముంబై : కుల వివాదాల కారణంగా మహారాష్ట్ర 'గందరగోళం, విధ్వంసం' దిశగా సాగుతోందని శివసేన పేర్కొన్నది. భీమా-కొరేగావ్ గ్రామంలో చోటుచేసుకున్న హింసకు సంబంధించి దేవేంద్ర ఫడ్నావిస్ ప్రభుత్వంపై దాడిని కొనసాగించింది. ఉద్దవ్ థాకరే నేతృత్వంలోని శివసేన మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నది. పూణె జిల్లా కొరేగావ్ గ్రామంలో పెద్దఎత్తున హింసాకాండ చోటుచేసుకున్న హింసకు వ్యతిరేకంగా దళిత సంఘాలు జనవరి 3వ తేదీన ఇచ్చిన బంద్ పిలుపు సందర్భంగా భారీ విధ్వంసం సంభవించింది. "దళితులు బంద్‌కు పిలుపునిచ్చారు. హిందుత్వవాది గ్రూప్‌లు మార్చ్‌లు నిర్వహించాయి, సౌభ్రాతృత్వానికి బదులుగా కుల విభేదాల కారణంగా మహారాష్ట్ర కల్లోలం, విధ్వంసం దిశగా సాగుతున్నట్టు కనిపిస్తోంది" అని శివసేన అధికార పత్రిక సామ్నా సంపాదకీయం పేర్కొంది. ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలోని భరిపా బహుజన్ మహాసంఘ్ (బీబీఎం) ఇచ్చిన పిలుపు మేరకు బంద్ శాంతియుతంగా జరిగివుంటే నాయకునిగా ఆయన స్థాయి పెరిగివుండేదని తెలిపింది. "అయన అనుచరులు దిశా, నిర్దేశన లేనట్టుగా సాగారు. కొల్హాపూర్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు" అని సామ్నా పేర్కొంది. కుల విభేదాలు చెలరేగుతున్న ఈ తరుణంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావిస్‌కి శివసేన సంఘీభావం ప్రకటిస్తోంది. మహారాష్ట్ర గౌరవాన్ని పరిరక్షించాలని, శాంతి-భద్రతలు కాపాడాలని కోరుకుంటోందని చెప్పారు. "కులవిభేదాలు బీజేపీ లేదా ఇతర పార్టీకి లబ్ధి చేకూర్చాయా? అని విశ్లేషించే సమయం ఇది కాదని పేర్కొంది. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు ఫడ్నావిస్ నాయకత్వంలోని రాష్ట్ర హోం మంత్రిత్వ శాఖ వైఫల్యానికి అద్దంపడుతోందని తెలిపింది.



లోయలో పడిన మినీబస్సు

ఆరుగురి దుర్మరణం : 24మందికి గాయాలు

ఉధంపూర్ : జమ్మూకాశ్మీర్‌లోని కొండప్రాంతమైన ఉధంపూర్‌లో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఉధంపూర్ నుంచి రాంనగర్‌కు బయలుదేరిన మినీబస్సు మార్గంమధ్యలో కరోవా వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న 100 అడుగుల లోయలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మరణించారు. 24 మంది గాయపడ్డారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కర్వావా సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నదని పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టినట్టు వివరించారు. ఘటనాస్థలం నుంచి నాలుగు మృతదేహాలను వెలికితీశామన్నారు. గాయపడిన 24 మందిని సమీప ఆసుపత్రులకు తరలించగా వారిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారని, మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు.

ఐఐఆర్‌ఎస్‌లో కేంద్ర భద్రతాదళాలు

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్‌ఎస్)లో భద్రత కోసం 60 మంది సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని నియమించారు. ఉగ్రదాడుల హెచ్చరికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఆధీనంలో పనిచేస్తున్న ఐఐఆర్‌ఎస్ శిక్షణ, విద్యావకాశాలను కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నిపుణులను అందిస్తోంది.భూగర్భ, జీపీఎస్ రిమోట్ సెన్సింగ్, ప్రకృతి వనరులు, పర్యావరణ, ప్రకృతి విపత్తుల మేనేజ్‌మెంట్‌లను అందిస్తోంది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్‌ఎఫ్)కు చెందిన 63 మంది నియామకాలు జరిగాయని ఆ శాఖ అధికార ప్రతినిధి, ఏఐజీ హేమేంద్ర సింగ్ తెలిపారు. పారామిలటరీ దళాలు నిరంతర భద్రతను కల్పిస్తుండగా, సెంట్రల్ దళాల కమెండోలు వాహనాలను పరిశీలిస్తూ, ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనడంలో ముందుంటాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ ఇన్ ఆసియా, పసిఫిక్ కేంద్రమైన ఈ క్యాంపస్ ఐక్య రాజ్యసమితి అనుబంధంగా పనిచేస్తుంది. దేశ వ్యాప్తంగా అంతరిక్ష సంస్థలకు ఉగ్రసంస్థల నుంచి ముప్పు ఉన్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతను రూపొందించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సీఐఎస్‌ఎఫ్‌కు మొత్తం 340 యూనిట్లు పటిష్టమైన నిఘాతో భద్రతను అందిస్తున్నాయని సింగ్ వెల్లడించారు.

ముగ్గురు సీనియర్ సభ్యులకు రాజ్యసభ వీడ్కోలు

27న పదవీ విరమణ చేయనున్న కరణ్, ద్వివేది, హష్మీ

వారి సేవలు ఎనలేనివని ప్రశంస

న్యూఢిల్లీ : ముగ్గురు సీనియర్ సభ్యులు కరణ్ సింగ్, జనార్థన్ ద్వివేది, పర్వేజ్ హష్మీలకు రాజ్యసభ ఘనంగా వీడ్కోలు పలికింది. ఇతర సభ్యులతో పాటు ఈ ముగ్గురు ఈ నెలాఖరుకు పదవీవిరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతూ, ఈ ముగ్గురు సభ్యులు సభకు అందించిన సేవలను ప్రశంసించారు. పదవీవిరమణ చేస్తున్న ఈ ముగ్గురు ఎంపీలు కూడా ఢిల్లీ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ముగ్గురు సభ్యులు జనవరి 27వ తేదీన పదవీవిరమణ చేస్తున్నప్పటికీ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ రోజుతో ముగుస్తున్నం దున నేడే వారికి వీడ్కోలు పలికారు. ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ, తమ పార్టీ సీనియర్ సహచరుడు కరణ్‌సింగ్ 18 ఏళ్ల వయస్సులోనే జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాధినేత అయ్యాడని, అంతచిన్న వయస్సులో ఆ పదవిని అలంకరించిన పిన్నవయస్కుడు ఆయనే కావచ్చునని అన్నారు. వీడ్కోలు కార్యక్రమం జరిగినప్పుడు హష్మీ సభలో లేరు. 86 ఏళ్ల కరణ్ సింగ్ తన 57 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి నేటి ప్రధాని నరేంద్ర మోడీ వరకూ అందరు ప్రధానమంత్రులతో అభిప్రాయాలను మార్చుకునే అవకాశాన్ని పొందారని చెప్పారు. లోక్‌సభ, రాజ్యసభలకు ఆయన నాలుగేసి దఫాలు ప్రాతినిధ్యం వహించారని ఆజాద్ తెలిపారు. రాచరిక కుటుంబంలో జన్మించినా, అత్యున్నత రాజకీయ పదవులను అధిష్టించినా సింగ్ ఎన్నడూ కూడా మద్యం ముట్టలేదని, సిగరెట్లను తాగలేదని, పాన్ సైతం వేసుకునే వారు కాదని, ఆయన జీవితం మొత్తం గౌరవనీయంగా సాగిపోయిందని ఆజాద్ చెప్పారు. దివేదితో సోషలిస్టు ఉద్యమం నుంచి ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

సభా ఛైర్మన్ వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, పదవీ విరమణ చేస్తున్న ముగ్గురు సభ్యులు కూడా గణనీయమైన సేవలు అందించారని కొనియాడారు. సభ, పార్లమెంటరీ కమిటీల చర్చలలో చురుకుగా పాల్గొనేవారన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య పటిష్టతకు వారు అందించిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. రాజ్యసభ గౌరవం, ప్రతిష్ఠను ఇనుమడింపజేశారని అన్నారు. న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తదితర సభ్యులు వీరి సేవలను ప్రశంసించారు.

ఛత్తీస్‌గఢ్‌లో సర్పంచ్ హత్య

రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు గ్రామసర్పంచ్ గొంతును కోసి చంపిన సంఘటన ఇది. బస్తర్ జిల్లాలోని చింద్‌గూర్ గ్రామసర్పంచ్ పాండ్రూ(45)పై ఆయుధాలతో దాడిచేసి, గొంతుకోసి హతమార్చారని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్‌పోలీస్ (దక్షిణ బస్తర్‌రేంజి) పీ.సుందరరాజ్ తెలిపారు. రాయ్‌పూర్‌కు దాదపు 375 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో చింద్‌గూర్ గ్రామం ఉందని ఆయన పేర్కొన్నారు.

గుప్తా అనర్హుడు.. కాదు అర్హుడే

న్యూఢిల్లీ : ఆప్ రాజ్యసభ అభ్యర్థిత్వానికి ఎన్‌డీ గుప్తా అనర్హుడంటూ ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌మాకెన్ రిటర్నింగ్ అధికారికి అభ్యంతర పిటిషన్‌ను దాఖలు చేశారు. జాతీయ పింఛన్ వ్యవస్థ ట్రస్టుకు ట్రస్టీగా మార్చి30 నుంచి లాభదాయక పదవుల్లో ఉన్నందున ఆయన నామి నేషన్‌ను తిరస్కరించాలన్నారు. గుప్తాతోపాటు మరో ఇద్దరు సంజయ్ సింగ్, సుశీల్ గుప్తా రాజ్యసభకు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం నామినేషన్ల పరిశీలన సందర్భంగా సెక్షన్ 36 ప్రకారం ప్రజా ప్రతినిధి చట్టం 1951 ఆర్టికల్ 102ప్రకారం అతని నామినేషన్‌ను తిరస్కరించాలని మాకెన్ కోరారు. దీనిపై ఆప్ విరుచుకు పడుతూ ట్రస్టీ నియామకానికి చట్టం అభ్యంతరం చెప్పబోదని, మాకెన్ కావాలనే చౌకబారు ప్రచారానికి తెరలేపారని పేర్కొంది. చట్టం 1959 సెక్షన్ 3, క్లాజ్ (ఎల్) ప్రకారం పార్లమెంటు అభ్యర్థి త్వానికి అనర్హుడుకాడని ఆప్ నేత రాఘవ్ చద్దా ట్వీట్ చేశారు. నామినేషన్ తిరస్కరణకు ఆర్‌వో స్థాయి చెల్లదని రాఘవ్ స్పష్టం చేశారు.

రోడ్డుపై ఆలుగడ్డలు..!

విశాలాంధ్ర - లక్నో : ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి పాలనలో రైతులు గిట్టుబాటు ధర కోసం అల్లాడిపోతున్నారు. రైతులకు రుణాలు మాఫీ చేస్తాం, ఆదాయం రెట్టింపు చేస్తామనే నినాదంతో అసెంబ్లీ ఎన్నికల్లో హోరెత్తించిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతు ముఖం చూడటం లేదు. గిట్టుబాటుధర కోసం చెరకు రైతులు ఆందోళన జరిపి..జరిపి అలసి సొలసి పోగా, తాజాగా బంగాళ దుంప రైతులు రోడ్డెక్కారు. గిట్టుబాటు ధర ఇప్పించండి మహాప్రభో అంటూ రైతుల ఆవేదన హోరెత్తినా సర్కారు కనీసం వినిపించుకోలేదు. దీంతో తీవ్ర నిరాశ, నిస్పృహలతో తమ పంటను రోడ్డుపాలు చేసి రైతులు ఇంటి ముఖం పట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం బంగాళాదుంపలకు క్వింటాలుకు రూ .487 గా కనీస మద్దతు ధరను నిర్ణయించింది. ప్రస్తుతం కిలో బంగాళదుంపల ధర రూ.4ల కంటే దిగువకు పడిపోయింది. కనీస ధర రూ.10 లు లేకపోతే తమకు పెట్టుబడులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో చర్చలు జరిపారు. కానీ ప్రభుత్వం నుంచి స్పందన కనిపించలేదు. ఈ స్థితిలో అసెంబ్లీ భవనం ఎదుట రోడ్డుపై బంగాళదుంపలను పోసి నిరసన వ్యక్తం చేశారు. " పంటలకు గిట్టుబాటు ధరకు రాకపోతే, ఏం చేస్తాం రాష్ట్ర, జిల్లా అధికారులతో మాట్లాడాం. కాని ఫలితం కనిపించ లేదు. మా అభ్యర్థనను కనీసం వినలేదు. అందుకే పంటను రోడ్డుపాలు చేశాం"అని ఒక రైతు చెప్పారు. "మొత్తం వ్యవస్థ నిద్ర పోతోంది. ప్రభుత్వం మా పరిస్థితిని గుర్తించటం లేదు. అందుకే సర్కారు కళ్లు తెరిపించేందుకు ఇలా నిరసన



వ్యక్తం చేశాం అని మరో రైతు వివరించారు.

సీషోర్ గ్రూప్ సీఎండీ అరెస్టు

భువనేశ్వర్(ఒడిశా) : చీటీల కేసులో అరెస్టు అయి జైలుకు వెళ్లి,శుక్రవారం విడుదలైన సీషోర్ గ్రూప్ సీఎండీ ప్రశాంత్ దాస్‌ను పోలీసులు మళ్లీ అరెస్టు చేశారు. ప్రశాంత్ దాస్‌ను మరో చీటీ కేసులో ఆయన నివాసంలోనే అరెస్టు చేసినట్టు ధన్కనల్ పోలీసు సూపరింటెండెంట్ బసంత్ పానీగ్రాహి తెలిపారు. చీటీల పేర మోసం చేశాడని ప్రశాంత్‌పై 2013లో టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని ఆయన పేర్కొన్నారు.

అగ్నిప్రమాదం కేసులో తండ్రీకొడుకులు అరెస్టు

ముంబై(మహారాష్ట్ర) : అక్రమంగా నిర్మించిన ఇళ్లను మున్సిపల్ అధికారులు తొలగిస్తుండగా ఉద్దేశపూర్వంగా సిలిండర్ పేల్చి, అగ్నిప్రమాదానికి కారణమైన తండ్రీకొడుకులను పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో సలీం సయ్యద్ అలియాస్ సలీం లైట్‌వాలా, అయన కుమారుడు సల్మాన్ మున్సిపల్ అధికారులు నిర్వహిస్తున్న నివాసాల తొలగింపు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వంగానే గ్యాసు సిలిండర్‌ను పేల్చారని పోలీసులు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల అరెస్టు

రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్): ఛత్తీస్‌గఢ్‌లోని కోండ్గావ్ జిల్లాలో ముగ్గురు మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10 కిలోల టిఫిన్ బాంబును స్వాధీనం చేసుకున్నామని వారు తెలిపారు. మర్దపాల్ పోలీసు స్టేషన్ పరిధిలోని రాణాపాల్-నవగావ్ గ్రామల మధ్య ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులకై రక్షణ కల్పించేందుకు వెళ్లిన భద్రతా దళాలు తనిఖీ చేస్తుండగా మావోయిస్టులు పట్టుబడ్డారని కోండ్గావ్ అదనపు ఎస్పీ మహేశ్వర్ నాగ్ తెలిపారు.

త్రిపుర ఓటర్ల తుది జాబితా రెడీ

అగర్తాలా(త్రిపురా) : ఈ ఏడాది ప్రథమార్థంలో జరగనున్న త్రిపురా అసెంబ్లీ ఎన్నికలకు ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేసినట్టు ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) శ్రీరాం తరనికంటీ తెలిపారు. ఓటర్ల జాబితాలో మొట్టమొదటి సారిగా హిజ్రాలకు కూడా చోటు కల్పించామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా11 మంది హిజ్రాలు తమ పేర్లను నమోదు చేసుకున్నారని, మొత్తం 25,69,205 ఓట్లలో 13,03,420 మంది మగవారు కాగా, 12,65,785 మంది మహిళలని ఆయన తెలిపారు.

మణిపూర్‌లో మాదకద్రవ్యాల పట్టివేత

ఇంఫాల్(మణిపూర్) : మణిపూర్‌లోని పశ్చిమ ఇంఫాల్ జిల్లాలో పోలీసులు రూ.3 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు పశ్చిమ ఇంఫాల్‌లో ఎంజీ కాలేజి గేటు వద్ద ట్రక్కులో ఇసక బస్తాల మధ్య దాచిన డబ్ల్యూవై మత్తుపదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్రక్కు భారత-మయన్మార్ సరిహద్దుల్లోని మొరెహ్ టౌను నుంచి వచ్చిందని, ట్రక్కుడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

కమల్ ఫొటోలు దహనం

కోయంబత్తూర్(తమిళనాడు) : అన్నాడీఎంకే బహిష్కృత నేత టీటీవీ దినకరన్‌కు విధేయతలుగా ఉన్న లాయర్ల బృందం నటుడు కమల్ హాసన్ ఫొటోలను దహనం చేశారని పోలీసులు తెలిపారు. జిల్లా కోర్టు ఎదుట గుమ్మిగూడిన లాయర్లు కమల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డిసెంబర్ 21న ఆర్కే నగర్ ఉప ఎన్నికల్లో దినకరన్ డబ్బు వెదజల్లి గెలుపొందారని కమల్ వ్యాఖ్యలు చేయడం ఓటర్లను కించపరిచినట్లేనని వారు అన్నారు.

గోవా ఎయిర్‌పోర్ట్ విస్తరణ

పనాజీ(గోవా) : గోవాలోని దబోలిం ఎయిర్‌పోర్ట్‌ను విస్తరించనున్నారు. ఉత్తర గోవాలోని ప్రతిపాదిత మోపా విమానాశ్రయం 2019లో పూర్తవడానికి ఇంకా వ్యవధి ఉండటం వల్ల రాష్ట్రంలోని ఎకైక ఎయిర్‌పోర్ట్ అయిన దబోలిం ఎయిర్‌పోర్ట్‌కు పెరిగిన రద్దీ కారణంగా విమానాశ్రయ పరిధిని పెంచనున్నట్టు గోవా ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ బీసీహెచ్ నేగీ తెలిపారు. దబోలిం ఎయిర్‌పోర్ట్ సామర్థ్యం 5 లక్షలేనని, అయితే ప్రస్తుతం ఏడాదికి 6.9 లక్షల ప్రయాణికుల సామర్థ్యంతో పని చేస్తుందని ఆయన తెలిపారు.

కేజ్రీవాల్‌కు అనుమతివ్వని పోలీసులు

బుల్ధానా(మహారాష్ట్ర) : సింధ్‌ఖేడ్ రాజాలో జనవరి 12న ప్రజలనుద్దేశించి ప్రసంగించేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు పోలీసుల అనుమతి లభించలేదు. సభకు వచ్చే జనాన్ని అదుపు చేయడం కష్టసాధ్యమని, అందుకే అనుమతి ఇవ్వడం లేదని విదర్భా ఎస్పీ సుశీల్ కుమార్ మీనా తెలిపారు. విదర్భా జిల్లాలోని సింధ్‌ఖేడ్ రాజాలో జనవరి 12న 'జిజావ్ జన్మోత్సవ్ సోహలా' కార్యక్రమంలో పాల్గొని, ప్రజలనుద్దేశించి ప్రసంగించాల్సివుంది. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ తల్లి అయిన జిజాబాయి(జిజావ్) జన్మదినం వేడుకలు ఏటా సింధ్‌ఖేడ్‌లో జరుగుతాయి.

పోలీసులకు గాయాలు

హౌరా(పశ్చిమ బెంగాల్): పశ్చిమ బెంగాల్‌లోని హౌరా జిల్లాలో అల్లరి మూక పోలీసులపై దాడి చేయడంతో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. గాయపడిన వారిలో పోలీసు ఆఫీస్‌ఇన్‌చార్జ్ కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. బర్గార్చముఖ్ గ్రామంలో రెండు వర్గాలు గొడవ పడుతున్నట్టు శ్యాంపూర్ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందగా, సంఘటన స్థానానికి వచ్చిన పోలీసులపై ఒక వర్గం దాడి చేసి గాయపర్చిందని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ఏడుగురుని అరెస్టు చేసినట్టు వారు పేర్కొన్నారు.

కిరణ్ బేడి జోక్యం తగదు: అన్నాడీఎంకే

పుదుచ్చేరి: బడ్జెట్‌తో పాటు ఇతర ఫైళ్లను లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడికి ప్రభుత్వం పంపడంపై అన్నాడీఎంకే మండిపడింది. 2017-18 బడ్జెట్ ఫైళ్లను అసెంబ్లీ ఆమోదించిన నేపథ్యంలో గవర్నర్ జోక్యం ఏమిటని ప్రశ్నించింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై కిరణ్ బేడి పెత్తనం తగదని, ఇది ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నాడీఎంకే శాసనసభ నేత ఏ.అన్బాలగన్ విమర్శించారు.

యూపీలో మహిళపై సామూహిక అత్యాచారం

బందా(ఉత్తరప్రదేశ్) : ఆయుధాలను చేతబూనిన ముగ్గురు వ్యక్తులు ఓ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత మహిళతో పాటు ఆమె భర్తను, మరిదిని భదవాల్ అడవుల్లోకి తీసుకెళ్లిన దుండగులు తుపాకీతో బెదరించి ఈ దుస్సాహసానికి ఒడిగట్టారని పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబం బందా-చిత్రకూట్ సరిహద్దుల్లోని నదిని దాటుతుండగా ఈ సంఘటన జరిగిందని వారు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు అదనపు ఎస్పీ లాల్ భారత్ కుమార్ పేర్కొన్నారు.

నేటి నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్



విశాలాంధ్ర- సూళ్లూరుపేట : రాష్ట్ర ప్రభుత్వ పక్షుల పండగ అయిన ఫ్లెమింగో ఫెస్టివల్ ఆదివారం నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో ప్రారంభం కానుంది. పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ, పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ, వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్‌రెడ్డితోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు రానున్నారు. కళాశాల మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. హిట్రీ మీడియా (హైదరాబాద్) ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను సిద్ధం చేశారు. శ్రీహరికోటకు చెందిన రాకెట్ల నమూనాలను షార్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు రకరకాల చేపలు, పూలు, పండ్లతో బొమ్మలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వాలీబాల్, పుట్‌బాల్, త్రోబాల్ వంటి క్రీడా పోటీలు తొలి రోజు నుంచే ప్రారంభం కానున్నాయి. విజేతలకు ముగింపు రోజు బహుమతులు ప్రదానం చేయనున్నారు. సినీ తారలు, కమెడియన్స్, మ్యూజిక్ డైరెక్టర్లతో మ్యూజికల్స్ నైట్స్ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి అవసరం



విశాలాంధ్ర - మంగళగిరి : క్రీడాకారులు మైదానంలో క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగితే తప్పకుండా ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అంతర్జాతీయ మాజీ వెయిట్‌లిఫ్టర్ కరణం మల్లేశ్వరి అన్నారు. దీనికి ఎవరూ గాడ్‌ఫాదర్లు ఉండాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అంగీకరిస్తే చేనేతకు తాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేందుకు సిద్ధమన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఓ హ్యాండ్‌లూమ్స్ దుకాణంలో చేనేత వస్త్రాల కొనుగోలుకు శనివారం ఆమె ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి విలేకరులతో మాట్లాడుతూ నూతన రాజధానిలో క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తున్నదన్నారు. క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో మంగళగిరి మునిసిపల్ ఛైర్మన్ గంజి చిరంజీవి, స్థానిక ప్రముఖులు గంజి రవీంద్ర, తోలేటి రవీంద్ర పాల్గొన్నారు.



శ్రీవారిసేవలో కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు

విశాలాంధ్ర - తిరుమల : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని శనివారం సాయంత్రం కేంద్ర విమానయానశాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత తిరుమల చేరుకున్న ఆయనకు పద్మావతి అతిథి గృహాల వద్ద ఓఎస్డీ లక్ష్మీనారాయణ యాదవ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. శ్రీవారి ఆలయం ఎదుట సహస్ర దీపాలంకార సేవలో పాల్గొన్న ఆయన తర్వాత శ్రీ భూవరాహస్వామి వారిని దర్శించుకుని ఆలయంలోకి చేరుకున్నారు. స్వామి వారి మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో అశోక్‌గజపతిరాజు కుటుంబసభ్యులకు వేదపండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

విశాఖ కలెక్టర్, సాంఘిక సంక్షేమ డీడీపై అట్రాసిటీ కేసు

విశాలాంధ్ర - విశాఖపట్నం క్రైం : మోసపోయిన ఓ గిరిజన యువతి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డీవీ రమణమూర్తిపై కేసు నమోదు చేయాలన్న హైకోర్టు ఆదేశాలతో ఎంవీపీ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కిందటేడాది అధికారుల వల్ల జరిగిన తప్పిదానికి హైకోర్టు కొత్త ఏడాది జనవరి 3వ తేదీన కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2016 ఆగస్టు 26వ తేదీన సవర రుతూ అనే గిరిజన యువతి ఆకుల శివ నారాయణమూర్తి చేతిలో మోసపోయినట్టు ఎస్సీ, ఎస్టీ సెల్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో సిటీ పోలీసులు క్రైం నెం.313/2016 తో అట్రాసిటీ చట్టంతో పాటు 417, 420 సెక్షన్‌ల కింద శివనారాయణ మూర్తిపై కేసు నమోదు చేశారు. మోసపోయిన యువతి ప్రభుత్వ సాయం కోసం సాంఘిక సంక్షేమశాఖకు అర్జీ పెట్టుకుంది. పోలీసులు నమోదు చేసిన సెక్షన్‌లో నిబంధనల ప్రకారం బాధిత గిరిజన యువతికి రూ.3.75 లక్షల ఆర్థిక సాయం అందాల్సి ఉంది. దీని కోసం సాంఘిక సంక్షేమశాఖను ఆశ్రయించిన యువతికి సంబంధించిన ఫైలులో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డీవీ రమణమూర్తి సెక్షన్లు మార్చివేసి కేవలం రూ.25 వేలు మాత్రమే వచ్చేలా సెక్షన్లతో రూపకల్పన చేసి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ముందు ఉంచారు. డీడీ ఏమి ఆశించి చేశారోగానీ ఈ ఫైలును కలెక్టర్ కనీసం పరిశీలించకుండా సంతకం పెట్టేశారు. ఆయన ఏ మాత్రం గమనించినా ఆ యువతికి న్యాయం జరిగి ఉండేది. రూ.25 వేలు మాత్రమే మంజూరు కావడంతో ఆ యువతి గత ఏడాది నవంబరు 4వ తేదీన హైకోర్టులో సవాల్ చేసింది. విచారణ అనంతరం బాధ్యులపై అధికారులపై కేసు నమోదు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్‌లు మార్చి సంతకం పెట్టేందుకు పంపిన డీడీది ఎంత తప్పు ఉందో, ఫైలును పరిశీలించకుండా సంతకం పెట్టేసిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ది అంతే తప్పని కోర్టు భావించింది. దీంతో ఈ నెల 3వ తేదీన కోర్టు ఆదేశాలతో ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌లో ఏ1గా రమణమూర్తి, ఏ2 కలెక్టర్‌ను చేర్చుతూ కేసులు నమోదు చేశారు. అయితే ఈ కేసులో దర్యాప్తు అధికారిని నియమించలేదని, మాకు సంబంధం లేదని ఎస్సీ ఎస్టీ సెల్ ఏసీపీ-1 ప్రవీణ్‌కుమార్ చెబుతుంటే, ఎంవీపీ సీఐ మళ్లా మహేష్ అదే విషయం చెప్పడం గమనార్హం. డీడీ రమణమూర్తి అందుబాటులో లేరు. హైకోర్టుకు వెళ్లిన యువతికి న్యాయం చేశామని చెబుతున్న కలెక్టర్ ఆమె కేసు విషయంలో తప్పు ఎక్కడ జరిగింది అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులు ఇలా గిరిజన యువతికి తెలిసి ఒకరు, తెలియకుండా మరొకరు అన్యాయం చేయడం విమర్శలకు దారితీసింది.

రూ.3.75 లక్షలు త్వరలో అందుతాయి

కిందటేడాది ఆగస్టు 26వ తేదీన యువతి మోసపోయినట్టు ఫిర్యాదు చేసింది. 30న సీపీ యోగానంద్ ఆమెకు నష్ట పరిహారం చెల్లించాలని కేసుకు సంబంధించి న అంశాలను కలెక్టర్‌కు పంపారు. సెప్టెంబర్ 17న అటెస్టెడ్ కాపీస్ కలెక్టర్ ఆఫీస్‌కు ఎస్‌సీ, ఎస్టీసెల్ నుంచి అందాయి. యువతి ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించిన నగదు విషయంలో సరిగ్గా స్పందించలేదంటూ అదే నెల 19వ తేదీన కోర్టు నుంచి బి.రామారావు అడ్వకేట్ ద్వారా నోటీసులు డీడీ రమణమూర్తికి, నాకు అందాయి. అదే నెల 23వ తేదీన రూ.25 వేలు ఆమెకు అందజేశాం. నవంబరు 11న యువతి హైకోర్టును ఆశ్రయించడంతో మళ్లీ మా ఇద్దరికీ నోటీసులు జారీ అయ్యాయి. కేసు పూర్తి వివరాలు కావాలని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్‌ను అదే నెల 21వ తేదీన కోరాం. డిసెంబర్ ఎనిమిదో తేదీన ఆ కార్యాలయం నుంచి సెక్షన్ ప్రకారం రూ.3.75 లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు.. దీనికి నోటీసులు నేను అందుకున్నా. 10వ తేదీన రూ.3.50 లక్షలు విడుదల చేశాం. ముందు ఇచ్చిన రూ.25వేలతో కలిపి రూ.3.75 లక్షలు మంజూరు చేశాం. ఈ నెల 7వ తేదీన సవర రూతూ బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. ఇంతలోగా 3వ తేదీన ఎంవీపీలో కేసు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



ఛాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పల్లవి

60 నిమిషాల్లో 60 సామాజిక అంశాలపై అనర్గళ ప్రసంగం

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : అతి చిన్న వయస్సులో 60 నిమిషాల్లో 60 సామాజిక అంశాలపై అనర్గళ ప్రసంగంతో ప్రపంచ రికార్డు నెలకొల్పిన విజయవాడకు చెందిన విద్యార్థిని కె.సాయిపల్లవి ఛాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో విజయవాడ సత్యనారాయణపురం సెయింట్ జాన్స్ స్కూల్‌లో అయిదవ తరగతి చదువుతున్న సాయిపల్లవి విజయవాడ ప్రెస్‌క్లబ్ వేదికగా శనివారం ఛాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు-2018లో పేరు నమోదు కోసం 60 నిముషాల్లో 60 విభిన్న సామాజిక అంశాలపై అనర్గళ ప్రసంగంతో తొలి ప్రయత్నంలోనే సత్తా చాటి ఛాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వ్యవస్థాపకులు డాక్టర్ తుర్లపాటి పట్టాభిరామ్ ద్వారా సర్టిఫికెట్ అందుకుంది. భ్రూణ హత్యలకు పాల్పడవద్దు, ప్రభుత్వం ఆదాయం కోసం ప్రజలను ఏ విధంగా మద్యానికి బానిసలుగా చేస్తున్నదీ... ఇలా 60 అంశాలపై ధారాళంగా మాట్లాడి ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సంగీత విద్వాంసులు పోపూరి గౌరినాథ్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన పిల్లలను వారి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఒక్క విద్యతోనే అన్నీ సాధించలేమని, సామాజిక అంశాలపై అవగాహన ఎంతో అవసరమన్నారు. డాక్టర్ తుర్లపాటి పట్టాభిరామ్ మాట్లాడుతూ అవార్డులు అనేక మందికి వస్తాయి కానీ రికార్డులు చాలా తక్కువ మంది మాత్రమే నెలకొల్పుతారన్నారు. అటువంటి కోవలోకి సాయిపల్లవి చేరడం విజయవాడకు గర్వకారణమన్నారు. పారిశ్రామిక వేత్త కోగంటి సత్యం మాట్లాడుతూ అవార్డులకే వన్నె తెచ్చిన పల్లవి 10వ తరగతి వరకు చదవడానికి అయ్యే ఖర్చు మొత్తం తానే భరిస్తానన్నారు. సీపీఐ విజయవాడ నగర నాయకులు నక్కా వీరభద్రరావు మాట్లాడుతూ అతి చిన్న వయస్సులో సామాజిక అంశాలపై అవగాహనతో ప్రపంచ రికార్డు సొంతం చేసుకోవడం విజయవాడకు గర్వకారణమన్నారు. నక్కా రాములు, కోటేశ్వరమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున నక్కా రాజ్యలక్ష్మి ద్వారా పల్లవికి ఆర్థిక సహాయం అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు మరీదు రామకృష్ణ, ప్రతినిధులు గోళ్ళ నారాయణరావు, వీణా పాణి, సెయింట్ జాన్స్ స్కూల్ సత్యనారాయణపురం బ్రాంచ్ ప్రిన్సిపాల్ కేవీ కళ్యాణి పాల్గొన్నారు.





గుంటూరు రూరల్ పోలీసులకు ఐపీఎస్ అవార్డులు

విశాలాంధ్ర-గుంటూరుక్రైం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసులకు ప్రతి నెలా డీజీపీ చేతుల మీదుగా అందచేసే ఐపీఎస్ (ఇంప్రెసివ్ పబ్లిక్ సర్వీస్) అవార్డుకు గతనెలకుగాను గుంటూరు రూరల్ పోలీసులు ఎంపికైనట్లు రూరల్ ఎస్పీ సిహెచ్ వెంకట అప్పలనాయుడు శనివారం తెలిపారు. విధి నిర్వహణలో చక్కటి ప్రతిభను కనపరిచి, ప్రజలలో పోలీసు ఇమేజిని పెంచిన సిబ్బందికి ఇచ్చే ఐపీఎస్ అవార్డులను గుంటూరు రూరల్‌కు చెందిన వారు సాధించినట్లు ఆయన వెల్లడించారు. ప్రతిభ కనపరిచి ప్రజల మెప్పు పొందిన ఉత్తమమైన మూడు ఘటనల్లో ఎంపికయిన వారికి ఈ అవార్డులు అందచేస్తుంటారన్నారు. ఈ నేపథ్యంలో సూర్యలంక పోలీసుస్టేషన్‌లో హెూంగార్డుగా విధులను అందచేస్తున్న కొక్కిలిగడ్డ నాగరాజు ప్రథమ స్థానం, సూర్యలంక మెరైన్ పోలీసుస్టేషన్‌కు చెందిన మరొక హెూంగార్డు ఎస్ శ్రీనివాసరావు ద్వితీయస్థానం సాధించినట్లు, వీరికి త్వరలో డీజీపీ మాలకొండయ్య అవార్డులను బహూకరించనున్నట్లు ఆయన వెల్లడించారు.

బోయవాల్మీకులను ఎస్టీలో చేర్చొద్దు



విశాలాంధ్ర - పార్వతీపురం : ప్రస్తుతం బీసీ-ఏ జాబితాలోని బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దంటూ మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు రఘుపతుల శశిభూషణ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, కేంద్ర గిరిజన తెగల కమిషన్ ఛైర్మన్ నందకుమార్‌సాయి, కేంద్ర ఎస్టీ కమిషన్ వైస్‌ఛైర్ పర్సన్ అనసూయకే, కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జ్యూయల్ ఓరం, కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ నరసింహన్, కేంద్ర రిజిస్ట్రార్ జనరల్ జనాభా లెక్కల కమిషనర్ సైలేష్, పార్లమెంటరీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ సోలంకీకిరీట్ ప్రేమ్‌జీభాయ్‌లకు లేఖలను పోస్టు ద్వారా పంపించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మందిగా ఉన్న బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే రిజర్వేషన్ సమస్యతో గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగంలో ఆర్టికల్ 341, ఆర్టికల్ 342 లను ఉల్లంఘించి బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఈ ఆలోచన విరమించుకోవాలని కోరారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయాలు మూసివేయాలనడం తగదు

విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : దేశంలో ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయాలను, కళాశాలలను మూసివేయాలని సుభాష్ పాలేకర్ చేసిన వ్యాఖ్యలను శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఖండించారు. గుంటూరులో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి సేద్యం సృష్టికర్త సుభాష్ పాలేకర్ చేసిన వ్యాఖ్యలు సరైనవి కాదన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం సన్న చిన్నకారు రైతులు చేసేందుకు వీలు ఉంటుందిగానీ వేలాది ఎకరాల్లో చేయడానికి వీలు ఉండదన్నారు. అలాంటి తరుణంలో సేంద్రియ వ్యవసాయ విధానాల ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయాలంటే రాష్ట్రంలో పెద్దఎత్తున గోసంతతి కావాలన్నారు. కానీ ప్రస్తుతం గోవుల సంతతి తక్కువగా ఉందన్నారు. దేశంలో వ్యవసాయశాస్త్రవేత్తల పరిశోధనల వలన ఉపయోగం లేదని పాలేకర్ చేసిన వ్యాఖ్యలను కూడా ఖండిస్తున్నామన్నారు. వ్యవసాయశాస్త్రవేత్తల పరిశోధనల వలన ఎన్నో నూతన హైబ్రిడ్ వంగడాల సృష్టి జరిగిందన్నారు. దీనిద్వారా పెద్దఎత్తున దిగుబడులు సాధించామన్నారు. దీనివలనే దేశంలో ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు.

ఒంగోలు ఇరిగేషన్ ఉద్యోగి ఆత్మహత్య

విశాలాంధ్ర - ఒంగోలు : ప్రకాశం జిల్లా ఒంగోలు ఇరిగేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ బి. హనుమంతరావు (46) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసిన ఘటన శనివారం వేకువజామున చోటు చేసుకుంది. కార్యాలయ ఆవరణలో ఆత్మహత్య చేసుకోవటంతో ఉదయాన్నే ఆఫీసుకు వచ్చిన వాచ్‌మెన్ గమనించి స్థానికుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేయించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి గ్రామానికి చెందిన హనుమంతరావు స్థానిక సిరిగిరికొండపై నివాసముంటున్నారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం హనుమంతరావు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కిడ్నీరాకెట్.. మరికొందరికి నోటీసులు

- విజయకుమార్‌తోపాటు నలుగురికి
- 8న విచారణకు రావాలని పోలీసుల ఆదేశాలు
- ముమ్మర దర్యాప్తుతో నిందితుల్లో ఆందోళన

విశాలాంధ్ర - గుంటూరుబ్యూరో / గుంటూరుసిటీ/ నరసరావుపేట : రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేకెత్తించిన కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇప్పటికే అదుపులోకి తీసుకున్నవారి నుంచి రాకెట్ మూలాలు రాబడుతున్నట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితులైన వెంకటేశ్వర నాయక్‌తో పాటు కొంతమందిని శుక్రవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు నరసరావుపేటలో ప్రముఖ వ్యాపారవేత్త కపిలవాయి విజయ్‌కుమార్‌తో సహా మరో నలుగురిని ఈ నెల ఎనిమిదో తేదీన విచారణకు రావాల్సిందిగా శనివారం నోటీసులు జారీ చేశారు. ఒకరి పేరుతో మరొకరి కిడ్నీలను మార్చుతున్నట్టు ప్రచారం నేపథ్యంలో గుంటూరు జిల్లా రూరల్ ఎస్పీ అప్పలనాయుడు పర్యవేక్షణలో నరసరావుపేట వన్‌టౌన్ సీఐ శివప్రసాద్, ఎస్ఐ గోపీకృష్ణ సిబ్బందితో వివిధ కోణంలో విచారణ చేపట్టారు. ఫొటో మార్ఫింగ్ చేసిన ఆధార్‌కార్డు ఆధారంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేసిన తహశీల్దార్ విజయజ్యోతికుమారిని విచారించారు. గుంటూరు, తెనాలి, నరసరావుపేట పట్టణాలకు చెందిన మరికొందరితో సంబంధాలు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. కిడ్నీ మార్పిడి కోసం దరఖాస్తులు రూపొందించిన వారితో సహా సూత్రధారులను విచారణకు రావాల్సిందిగా పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ రాకెట్‌తో తెలుగుదేశం పార్టీ నాయకునితోపాటు రెండు ప్రైవేటు ఆస్పత్రులకు సంబంధం ఉండటంతో కేసు దర్యాప్తుపై ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ రాకెట్ మూలాలు గుర్తించే పనిలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేయడంతో నిందితుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

కిడ్నీ రాకెట్‌తో సంబంధం లేదు : వేదాంత ఆస్పత్రి ఎండీ డా. రామకృష్ణ

కిడ్నీ రాకెట్ కేసులో తమ ఆస్పత్రిపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, తమ ఆస్పత్రికిగానీ, తన మామ విజయ్‌కుమార్‌కుగానీ ఎటువంటి సంబంధంలేదని వేదాంత ఆస్పత్రి అధినేత డాక్టర్ చింతా రామకృష్ణ వెల్లడించారు.

గుంటూరులోని ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవాలనే ఉద్దేశంతోనే రోగి బంధువులు తమకు తప్పుడు సమాచారం అందించారన్నారు. ఆగస్టు 4వ తేదీన చిగురుపాటి శివరామకృష్ణ తన బంధువులతో కలిసి దాత ఆర్.రవిని తీసుకు వచ్చారన్నారు. వీరిరువురికి పరీక్షలు నిర్వహించిన కొన్ని రోజుల తర్వాత ఆస్పత్రికి వచ్చి ఆపరేషన్ వద్దని వెళ్ళిపోయారని తెలిపారు. అనంతరం దేవరాజుగట్టు గోపి అనే వ్యక్తిని తీసుకువచ్చారన్నారు. వీరిరువురికి సంబంధించి ఆస్పత్రిలో ఇచ్చిన సమాచారం అంతా అసత్యమని తమ వద్ద ఉన్న రికార్డుల ద్వారా స్పష్టం అవుతుందన్నారు. గోపి ఇచ్చిన చిరునామాలో ఖాళీ స్థలం ఉందనే విషయం తెలిసిందని వివరించారు. తమ ఆస్పత్రినే కాకుండా రెవెన్యూ, పోలీసు శాఖలను రోగి బంధువులు తప్పుదోవ పట్టించారన్నారు.

గొంతుకోసి, కళ్లు పీకి దారుణహత్య

విశాలాంధ్ర - ఓర్వకల్లు : కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని హుస్సేనాపురం సమీపంలో కర్నూలు-చిత్తూరు 40వ నంబరు జాతీయ రహదారి పక్కన పత్తి పొలంలో చింతలపల్లె గ్రామస్తుడు వడ్డె ఎల్లస్వామి (62) దారుణహత్యకు గురయ్యాడు. శనివారం ఉదయం గ్రామస్తుల సమాచారంతో సీఐ నాగరాజుయాదవ్, ఎస్సై చంద్రబాబునాయుడు హత్యజరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. హంతకులు బీరుసీసాలతో పొట్టలో పొడిచి పేగులు బయటకు లాగి, తలపై కొట్టి, తర్వాత గొంతుకోసి, కను గుడ్లు పీకి దారుణంగా హత్యచేశారు. ఈ హత్య శుక్రవారం రాత్రి జరిగినట్లు భావిస్తున్నారు. మృతునికి మద్యం అలవాటు ఉండేదని, శుక్రవారం మధ్యాహ్నం కాల్వబుగ్గ ఆలయంలో భోజనం చేసి హుస్సేనాపురంలోని తన కుమారుడు లక్ష్మీకాంత్ కుటుంబ సభ్యులను చూసేందుకు వచ్చినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. వైన్‌షాప్‌లోని సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



డీసీఐ ప్రైవేటీకరణ తగదు

విశాలాంధ్ర-విశాఖపట్నం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ప్రైవేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత డిమాండ్ చేశారు. విశాఖలో డీసీఐ ఉద్యోగులు చేస్తున్న దీక్షకు మద్దతుగా శనివారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌ను ఆమె లెక్కించారు. అనంతరం సభలో ఆమె మాట్లాడుతూ ప్రజా బ్యాలెట్‌లో పాల్గొన్న లక్షా 2 వేల మంది ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటువేశారన్నారు. విశాఖతో సహా దేశంలో 413 రైల్వేస్టేషన్లను ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదన్నారు. ఇప్పటికే 43 స్టేషన్లకు టెండర్లు కూడా పిలిచారన్నారు. రక్షణరంగంలో పెట్టుబడుల పేరుతో విదేశీ సంస్థల చేతుల్లో పెట్టడాన్ని ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ నర్సింగరావు, డీసీఐ నాయకులు నర్సింగరావు, ఏఐటీయూసీ నాయకులు మార్కండేయులు పాల్గొన్నారు.

అక్షరాన్ని వేలం వేస్తూ అక్షరాంధ్ర ఎలా సాధ్యం

సీఎం చంద్రబాబును ప్రశ్నించిన సీపీఐ నేత హరినాథరెడ్డి



విశాలాంధ్ర - చిత్తూరు : రాష్ట్రంలో ఓ వైపు అక్షరాన్ని వేలం వేస్తూ మరో వైపు అక్షరాంధ్రప్రదేశ్‌గా ఎలా మారుస్తారంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్ విద్యారంగాన్ని శాసిస్తున్న నారాయణ లాంటి వారికి మంత్రివర్గంలో ప్రముఖస్థానం కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యకు ప్రాధాన్యత నిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర జరుగుతోందన్నారు. రాష్ట్రంలో మూడు వేల పాఠశాలలను మూసివేస్తున్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌ను విద్యాంధ్రగా మారుస్తానని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ చర్యలు కార్పొరేట్ విద్యారంగాన్ని ప్రోత్సహించే విధంగా ఉన్నాయన్నారు. ప్రాథమిక, ఉన్నత స్థాయి విద్యారంగంలో 22 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఎందుకు భర్తీ చేయలేదన్నారు. చిత్తూరు జిల్లాలో 650 పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం సిద్ధమైతే విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేయడంతో హాజరు లేదనే కారణంతో 150 పాఠశాలలు మూసి వేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నేటికీ 65 డీవైఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మరో 6 వేల జూనియర్ అధ్యాపకుల ఖాళీలు భర్తీ చేయలేదన్నారు. మౌలిక వసతులు కల్పించకుండా విద్యాభివృద్ధి ఎలా సాధ్యమన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అవినీతి విలయ తాండవం చేస్తోందని, భవన నిర్మాణ కార్మికుల నిధులను ఇతర పథకాలకు బదిలీచేయడంపై సమాధానం చెప్పాలన్నారు. రూ. 5వేల కోట్లతో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామంటున్న ముఖ్యమంత్రి ఈ నిధులు కూడా ఏ పథకాలకు ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అవినీతితో పాటు ఇసుకమాఫియా విజృంభిస్తున్నదన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హెూదాపై కమ్యూనిస్టు పార్టీలు చేసిన సూచనలు పరిగణనలోకి తీసుకొని అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. రామానాయుడు మాట్లాడుతూ ఫిబ్రవరి 17, 18, 19 తేదీల్లో చిత్తూరులో జిల్లా మహాసభలు జరుగనున్నాయని, ఆ సభల్లో జిల్లా సమగ్రాభివృద్ధిపై పలు తీర్మానాలు చేయనున్నామన్నారు. సహకార రంగంలో నడుస్తున్న చక్కెర ఫ్యాక్టరీలు, పాల డైరీలు తెరిపించాలని, మామిడి రైతును ఆదుకోవడానికి సహకార రంగంలో గుజ్జు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తామన్నారు. జన్మభూమి సభలు అధికార పార్టీకి ప్రచార వేదికలుగా మారాయని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి నాగరాజన్, నాయకులు రవి, బాలాజీరావు, గజేంద్రబాబు, మణి, గోపీనాథ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.



విద్యతోపాటు నైపుణ్యం అవశ్యం

విశాలాంధ్ర - మచిలీపట్నం : ప్రస్తుత సమాజంలో విద్యార్థులు కేవలం చదువుకు పరిమితం కాకుండా వారిలోని నైపుణ్యతను వెలికితీస్తూ ప్రతిభను చాటుకోవాల్సిన అనివార్య పరిస్థితి నెలకొందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు అభిప్రాయపడ్డారు. మనకున్న గొప్ప సంపదైన యువతను సరైన మార్గంలో నడిపిస్తే గొప్ప దేశంగా రూపుదిద్దు కుంటుందన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం హిందూ కళాశాల మైదానంలో 'యువకెరటాలు - 2018' రెండు రోజుల కార్యక్రమాన్ని శనివారం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ విదేశాల్లో పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇవ్వడం ద్వారా అంతర్జాతీయ క్రీడాపటంలో ఆయా దేశాలు ప్రత్యేకతను చాటుకుంటున్నాయన్నారు. మనకున్న మానవ వనరులలో యువశక్తిని సద్వినియోగం చేసుకుంటే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు.

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 35 శాతం ఉన్న యువతను సన్మార్గంలో నడిపిస్తే అద్భుత విజయాలు సాధించవచ్చున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త యువజన పాలసీలో స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమాలు కీలకమన్నారు.

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో బందరుపోర్టు పనులు ప్రారంభం కానున్నాయన్నారు. పోర్టు వస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. బందరు పార్లమెంటు సభ్యులు కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ వివేకానంద స్ఫూర్తితో గత నాలుగేళ్లుగా ఆటలు, పాటలు, నృత్యాలు, పెయింటింగ్ పోటీలతో సాగుతున్న యువకెరటాలు మధురస్మృతిగా మిగిలిపోతాయన్నారు.

జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ యువత ప్రగతికి చిహ్నాలని, వారిలో దాగియున్న శక్తియుక్తులను వెలికితీయడం ఎంతో అవసరమన్నారు. తొలుత పాఠశాల విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బచ్చుల అర్జునుడు, రాష్ట్ర మాజీ మంత్రి నడకుదుటి నరసింహారావు, మున్సిపల్ ఛైర్మన్ మోట మర్రి వెంకటబాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఉగ్ర ఘాతుకం..!

నలుగురు పోలీసుల మృతి

శ్రీనగర్ : కాశ్మీర్‌లో ఉగ్రమూకలు మారణహోమం సృష్టించారు. శక్తివంతమైన మందుపాతరను పేల్చి నలుగురు పోలీసులను పొట్టన పెట్టుకున్నారు. దీంతో కాశ్మీర్‌లో మళ్లీ అలజడి సెలరేగింది. కాశ్మీర్‌లోయలో ఉగ్రవాదులను సైన్యం ఏరివేస్తున్న తరుణంలో ఇటీవల ప్రారంభమైన బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు యాగీకి దిగాయి. సైన్యం దాడుల్లో సాధారణ పౌరులు చనిపోతున్నారని, కాశ్మీర్‌లో అణచివేత కొనసాగుతోందని ప్రభుత్వంపై విరుచుకు పడ్డాయి. లోయలో అశాంతిని నివారించటంలో ప్రభుత్వం విఫలమైందని, గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఇదిలా ఉంటే. 1993లో జనవరి 6న పోలీసుల కాల్పుల్లో 57 మంది మృతి చెందారు. ఈ ఘటనకు నిరసనగా శనివారం ఏర్పాటువాదులు బంద్‌కు పిలుపు ఇచ్చారు. బారాముల్లా జిల్లాలోని సోపోర్‌లో దుకాణాలను మూసివేశారు. ఈ సందర్భంగా పోలీసులు, పారా మిలటరీ దళాలు పహారా కాస్తున్నారు. ఈ స్థితిలో గోలె మార్కెట్‌లో ఆరుగురు పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. వీరంతా చోటా బజార్, బడాబజార్ మధ్యకు వెళ్లే సరికి అత్యంత శక్తివంతమైన ఐఈడీ బాంబును పేల్చారు. ఈ బాంబు విస్ఫోటనంలో ముగ్గురు పోలీసులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో పోలీసు ప్రాణాలొదిలాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఉత్తర కాశ్మీర్ డీఐజీ వీకే బిర్ది తెలిపారు. ఈ దాడిలో దోడాకు చెందిన అసిస్టెంట్ ఇన్స్‌పెక్టర్ ఇర్షాద్ అహ్మద్, కుప్వారాకు చెందిన ముహమ్మద్ అమీన్, సోపోర్‌కు చెందిన గులామ్ నబీ ఘటన స్థలిలోనే ప్రాణాలు వదిలారు. పేలుడు తాకిడికి జనం కకావికలం అయ్యారు. ఈ దాడిని జైషేమహ్మద్(జేఈఎం) సంస్థ తన ఖాతాలో వేసుకుంది. అమరుడు అఫ్జల్ గురు దళం ఈ దాడి చేసిందని జేఈఎం అధికార ప్రతినిధి తెలిపారు.

మంచుతుపానులో 11 మంది మృతి

మృతుల్లో ఏడాది చిన్నారి, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ ఇంజినీర్

కొనసాగుతున్న సహాయక చర్యలు



శ్రీనగర్ : కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లా టాంగధర్ ప్రాంతంలోని సాధనా టాప్ వద్ద శుక్రవారం సంభవించిన భారీమంచు తుపానులో ప్రయాణికులతో నిండివున్న ఓ వాహనం చిక్కుకుపోయింది. ఈ ఘటనలో ఏడాది చిన్నారని, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ అధికారితో సహా 11 మంది చనిపోయారు. పోలీసులు, సైన్యం, ఎస్‌డీఆర్‌ఎఫ్, మౌంటెయిన్ రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. మంచుతుపానులో చిక్కుకున్న టాటాసుమో నుంచి ఇద్దరిని సజీవంగా రక్షించారు. మృతిచెందిన వారిలో బీఆర్‌ఓ ఇంజినీర్, ఓ చిన్నారి ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు కుప్వారా నుంచి కర్నాకు వస్తుండగా మంచుతుపాన్ వారిని కబళించిందని తెలిపారు. అదే ప్రాంతంలో చిక్కుకున్న ఇంజినీర్ మంగలా ప్రసాద్ సింగ్ సమయానికి వైద్యం అందక ప్రాణాలు విడిచినట్టు ఓ పోలీసు అధికారి వెల్లడించారు. డాక్టర్ అందుబాటులో లేని కారణంగా మరికొందరు ప్రయాణికులు తుదిశ్వాస విడిచినట్టు తెలిపారు. పర్వతంపై దాదాపు సున్నా డిగ్రీల ఉష్ణోగ్రత నేపథ్యంలో సహాయ చర్యలు కొనసాగించడం కష్టసాధ్యంగా మారినప్పటికీ రక్షకదళాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారన్నారు.

కార్మికోద్యమ నవ్య సౌధమా ! ఏఐటీయూసీ దివ్య తేజమా !

కార్మికలోకపు కళ్యాణానికి, శ్రమైక జీవన సౌందర్యానికి
ప్రభవించిన ఉద్యమ నిర్మాణ కేంద్రమా!
సామాజిక చైతన్య కెరటమా! సామూహిక సంక్షేమ కిరణమా!
సంఘం శరణం గచ్ఛామి! బుద్ధం శరణం గచ్ఛామి!
ధర్మం శరణం గచ్ఛామి!
త్రిపీఠికాల హోరుతో కృష్ణాతరంగాల జోరులో
తరతరాల అసమానతలను ప్రశ్నించిన బౌద్ధం నీడలో
యుగ యుగాల దోపిడిపై ధ్వజమెత్తిన కమ్యూనిజం దారిలో
ఊపిరి పోసుకున్న శ్రామిక జన హృదయమా!
ఏఐటీయుసీ కార్మికోద్యమ సౌధమా!
నీ వెచ్చని ఒడిలో, నీ చల్లని బడిలో రూపుదిద్దుకున్న
కార్మికోద్యమ సమరవీరులెందరో....అమరవీరులెందరో....
సంఘసంస్కరణోద్యమ పతాకగా జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ
కాలి గజ్జెలు ఘల్లు ఘల్లున మ్రోగెనిచ్చట-
పీడిత తాడిత జనగానమై జోశ్యభట్ల సత్యనారాయణ
అడుగుల సవ్వడి ఉద్యమబాటై నిలిచెనిచ్చట-
దశబ్దాల శ్రమ సాధనతో ఎర్రజెండా రెపరెపలతో
వర్ధిల్లిన కార్మికోద్యమ పాఠశాల, బెజవాడ పోరటాల నేల-
కపర్థీ, విజయకుమార్, వెల్లంకి, సి.వి.కె.రావు, కొఠారి,
తమ్మినపోతరాజు, ఉప్పలపాటి,బూరాడ, పూడి అప్పలస్వామి,
జీ.వి.కృష్ణారావు, సూర్యం, సుబ్బరాయశాస్త్రి, కలిదిండి భీమరాజు,
మారెళ్ళ నరశింహారావు, శేఖర్‌బాబు, కడప సుబ్బన్న, పి.ఎస్.శర్మ,
పిల్లల మర్రి, పొట్లూరి, కనపర్తి నాగయ్య, మల్లయ్యలింగం,
నేటికీ కార్మికోద్యమ రథసారథియై తొమ్మిది పదుల వయస్సులో కూడా
అవిశ్రాంత కృషివలుడైన చిట్టూరి ప్రభాకరచౌదరి,
నాటి శ్రామికోద్యమ వారసుల శ్రమశక్తి,
ఆశయాల ధీయుక్తి పెనవేసుకున్న
మహోద్యమ నిర్మాణ దివ్యతేజమా!
రేపటి ఆశయాల సాధనకై రూపొందిన కార్మికోద్యమ నవ్య సౌధమా!
ఆధునిక ఆంధ్రదేశ రాజధాని అమరావతి నగరమున కొలువైన
శ్రామిక జనసమరమా! ఏఐటీయుసీ సంక్షేమ భవనమా!
తరతరాల ప్రవాహం నీ శ్రమగానం
యుగ యుగమ్ముల పరిమళం నీకార్మికోద్యమ జీవం
సమ సమాజ స్థాపనకై, నవ నిర్మాణ సాధనకై
నడుంకట్టి, పిడికిలెత్తి, మహోద్య రణ నినాదమై
నలుదిశలా అరుణారుణ కిరణమై,
దేశ దేశాల అవిశ్రాంత కెరటమై సాగిపో...సాగిపో....!

విజయవాడలో ఏపీ ఏఐటీయూసీ కార్యాలయం ప్రారంభం సందర్భంగా

– చలసాని వెంకట రామారావు,
ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు

విప్లవ శుభాకాంక్షలు

శ్రమజీవులు సమరాల సౌధంగా
విజయవాడ గొల్లపూడిలో వెలసిన ఏఐటీయుసీ ఉద్యమ కేంద్రానికి
జనవరి 7 ప్రారంభోత్సవాన విప్లవ శుభాకాంక్షలు తెలుపుదాం
2018 నూతన సంవత్సరాన నీ ప్రయాణం
సాగాలి కలకాలం దేదీప్యమానంగా
పాత తరం కార్మిక నాయకుల త్యాగాలకు చిహ్నంగా
సాటిలేని నేటి తరం నాయకుల కృషి ఫలితంగా
భవిష్యత్ తరాల కార్మిక నాయకుల తయారీ కార్యశాలగా
నిరంతర కార్మిక వర్గ పోరాటాల వేదికగా
నిలవాలి శ్రామికజన హృదయమందిరాన వేడుకగా
జోశ్యభట్ల సత్యనారాయణ భవన సముదాయంలో
సామాజికసేవతో వెంకట సుబ్బమ్మ ట్రస్ట్
కార్మికోద్యమ నిర్మాణంలో ఏఐటీయసీ కార్యాలయం
వర్గ చైతన్య కల్పనలో జీ.వి.కృష్ణారావు సమావేశ మందిరం
కార్మిక నేతలు సేద తీరేందుకు విశ్రాంతి గదులలో
విరాజిల్లుతుంది కష్టజీవుల బడిగా

తెలుగు నేల రెండుగా విడువడిన వేళ
భాగ్యనగరాన్ని వీడి అమరావతికి చేరి
13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో
పట్టుదలగావించి మొట్టమొదట నిర్మించి
అన్ని సంఘాలకు ఆదర్శంగా నిలిచి
తొట్టతొలుత పుట్టిన కార్మిక సంఘమనిపించి
నవ్యాంధ్ర చరితలో నీ స్థానాన్ని నిలిపావు

శ్రమైక జీవన రుధిర పోరాట సౌధాన్ని
కార్మిక వర్గ శ్రేణులకు అంకితమిచ్చు
వేడుకకు విచ్చేయు
జాతీయ నాయకులకు,
పొరుగు రాష్ట్రాల ప్రతినిధులకు
స్వాగతం...సుస్వాగతం ఏపీ ఏఐటీయుసీ పక్షాన
పలుకుతున్నాము....
నూతన సంవత్సర విప్లవ శుభాకాంక్షలు
ఆశిస్తున్నా.....
మీ అందరి అరుణారుణ ఆశీస్సులు

యస్.వెంకటసుబ్బయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి

దుర్గగుడి ఈవో బదిలీ

పూర్తిస్థాయి విచారణకు సీఎం ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: దుర్గగుడి వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఆలయంలో నియమాలకు విరుద్ధంగా సంబంధంలేని వ్యక్తులు ప్రవేశించినట్లు విచారణ కమిటీ నిర్ధారించింది. సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం రాత్రి కమిటీ చంద్రబాబుతో భేటీ అయి మధ్యంతర నివేదికను అందచేసింది. ఆలయానికి సంబంధం లేని వ్యక్తులు అంతరాలయంలోకి ప్రవేశించకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) సూర్యకుమారి విఫలమైనట్లు మధ్యంతర నివేదికలో పేర్కొంది. కమిటీకి నేతృత్వం వహించిన దేవాదాయశాఖమంత్రి పి మాణిక్యాలరావుతోపాటు దేవాదాయశాఖ కమిషనర్ అనూరాధ సీఎంను కలసి వాస్తవాలను వివరించారు. దీంతో ఈవో వైఫల్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రబాబు సూర్యకుమారిని తక్షణమే బదిలీ చేయాలని, తాత్కాలికంగా ఆ బాధ్యతలను స్వయంగా నిర్వహించాలని అనూరాధను ఆదేశించారు. విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ కూడా పోలీసుశాఖ పరంగా జరిపిన విచారణ వివరాలను చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు.

స్వీట్ ఫెస్టివల్ వెబ్‌సైట్, యాప్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్‌కు సంబంధించిన వెబ్ సైట్, యాప్‌ను సచివాలయంలో రాష్ట్రప్రభుత్వ సలహాదారులు డా.కేవీ రమణచారి, టూరిజం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రతిష్ఠాత్మకంగా జనవరి 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న 3వ అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌తో పాటు అనుబంధంగా అంతర్జాతీయ స్థాయి స్వీట్ ఫెస్టివల్ ప్రచారంలో భాగంగా వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను రూపొందించింది. ప్రపంచంలో మొట్టమొదటి సారిగా స్వీట్ ఫెస్టివల్‌కు హైదరాబాద్ వేదిక కాబోతుందన్నారు. 15 దేశాల పాటు 25 రాష్ట్రాల నుంచి తెలంగాణలోని వివిధ సంస్కృతి సంప్రదాయాల వారు తయారు చేసిన 1000 పైగా మిఠాయిలను ప్రదర్శించబోతున్నారు. ప్రజలందరు స్వచ్ఛంధంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎలాంటి ప్రవేశ రుసము లేదని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా హైదరాబాద్ స్వీట్స్ హబ్‌గా నిలుస్తుందని అన్నారు.

సీఎం, ఎమ్మెల్యేదే నైతిక బాధ్యత



విశాలాంధ్ర- విజయనగరం మున్సిపాలిటీ : విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస గ్రామంలో శుక్రవారం జన్మభూమి కార్యక్రమానికి వెళ్తున్న దళితులపై దాడులు చేయడం అత్యంత దుర్మార్గమని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జేవీ ప్రభాకర్ అన్నారు. భౌతిక దాడులకు గురై స్థానిక మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఫోన్‌లో పరామర్శించారు.సాక్షాత్తూ ముఖ్యమంత్రి జిల్లాలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, ముందస్తు ప్రణాళిక ప్రకారం దళితులపై దాడి చేసినందుకు ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహించాలన్నారు. దాడిచేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయకుంటే దళితుల తడాఖా చూపుతామని ప్రభాకర్ హెచ్చరించారు.

కేసీఆర్‌కు స్వామినాథన్ కృతజ్ఞతలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ లేఖ రాశారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వడం సంతోషకరమని పేర్కొన్నారు. తెలంగాణలో నీటి వసతి తక్కువగా ఉంటుందని, కానీ 24 గంటల ఉచిత కరెంట్ రైతులకు గొప్ప ఊరటని చెప్పారు. రైతుల తరపున కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెబుతున్నట్లు లేఖలో స్వామినాథన్ తెలిపారు.



కబ్జాచేసేందుకు యత్నిస్తున్న దళితకాలనీ



బాధిత మహిళను ఓదారుస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వర్రావు

దళితవాడను కొల్లగొడదాం..!

- అధికార పార్టీ పెద్దల కుట్ర
- 30 ఏళ్లుగా ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్న ఎస్సీలు
- మోదవలస గొడవలకు అసలు కారణం ఇదేనా?

విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం : అసలే జాతీయ రహదారి పక్కనే ఉన్న స్థలం. ఆ ఖరీదైన స్థలంపై కన్ను పడింది అధికార పార్టీ పెద్దలకు. ఇంకేముంది అక్కడి నుంచి నయానో భయానో దళితులను వెళ్లగొట్టేందుకు చేయని ప్రయత్నం లేదు. పన్నని కుట్ర లేదు. పెద్దలు. పెత్తందారుల పన్నాగాలను తట్టుకొని నిలువ నీడకోసం పోరాడుతున్నారు మోదవలస దళితులు. ఒకటీ రెండూ కాదు ఏకంగా 30 ఏళ్లుగా గూడు కోసం పోరాటం జరుగుతోంది ఈ గ్రామంలో.

విశాఖపట్నం-విజయనగరం మధ్యలో 26వ నెంబరు జాతీయ రహదారి పక్కనే ఉంది మోదవలస గ్రామం. ఈ గ్రామంలోని సెంటు భూమి కూడా లక్షల్లోనే పలుకుతోంది. గ్రామం చుట్టూ ఉన్న స్థలాలన్నీ రియల్ ఎస్టేట్లుగా మారిపోయాయి. దీంతో కేవలం గ్రామమే ఇప్పుడు మిగిలి ఉంది. ఈ గ్రామంలో సుమారుగా వంద దళిత కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామాన్ని ఆనుకొని సర్వే నెంబరు 186లో సుమారు 49 ఎకరాల్లో చిన్నపాటి గుట్టతో కూడిన ఖాళీ స్థలం ఉంది. ఈ గుట్టపై ఇళ్లు కట్టుకోడానికి 30 ఏళ్ల క్రితమే మూడు దశల్లో దళితులకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలిచ్చింది. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పుడు భోగాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడే కొందరు దళితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం విశేషం. కాగా నియోజకవర్గం పేరుమారి నెల్లిమర్లగా అవతరించినప్పటికీ, ఇప్పుడు అదే నారాయణస్వామి నాయుడు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ, ఆయన కుమారుడు పతివాడ రామినాయుడు తమ కాలనీని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని మోదవలస దళితులు ఆరోపిస్తున్నారు. తమను కాలనీ నుంచి వెళ్లగొట్టి మొత్తం 49 ఎకరాల కొండను రియల్ ఎస్టేట్‌గా మార్చేందుకు ఎమ్మెల్యే తనయుడు ప్రయత్నం చేస్తున్నాడని, ఊరిలో దళితులే లేకుండా చేస్తామని అతని అనుచరులు తరచూ తమను హెచ్చరిస్తున్నారని వీరంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు సుమారు 12 ఎకరాల్లో ఇళ్ల పట్టాలిచ్చినప్పటికీ, ఏళ్ల తరబడి తమను ఇళ్లు కట్టుకోనీయకుండా అడ్డుపడుతున్నారని చెబుతున్నారు. చివరికు తామంతా కోర్టుకు వెళ్లి అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకున్నప్పటికీ, వాటిని అమలు చేయనీయకుండా అధికారులపై వత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తమ ఊరిలో తమకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇళ్లు కట్టుకోనీయకుండా అడ్డుకోవడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడా కట్టుకొని నివాసం ఉంటున్న ఇళ్లను సైతం కూలగొట్టేసి, గ్రామం నుంచి తన్ని తరిమేస్తామని తరచూ బెదిరిస్తున్నారని వీరంతా భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఈ నేపథ్యంలోనే దాడి..?

రెండురోజుల క్రితం మోదవలసలో జరిగిన కొట్లాటకు నేపథ్యం కూడా ఇదే. గ్రామంలోని దళితులను జన్మభూమి సభకు రానీయకుండా అడ్డుకొనేందుకు వారిపై దౌర్జన్యానికి దిగారు. ఈ ప్రభుత్వం రాకముందు దళితవాడలో రూ.200 పింఛన్లు ఉండేవని, తమను ఇబ్బంది పెట్టి అక్కడి నుంచి తరిమేయాలన్న ఉద్దేశంతో ఎస్సీల పింఛన్లను ఆపేశారని చెబుతున్నారు. దీంతో పింఛన్ల కోసం దరఖాస్తు చేసేందుకు అర్జీలు రాస్తున్న సమయంలో ఎమ్మెల్యే కుమారుడు రామినాయుడు ముఖ్య అనుచరుడు, స్థానిక టీడీపీ నాయకుడు కాగితాల సత్యనారాయణ రౌడీలతో తమపై దాడి చేయించారని, తమను తరిమితరిమి కొట్టారని ఆరోపిస్తున్నారు. దళితులు జన్మభూమి సభకు రావడానికి వీల్లేదని హెచ్చరించి మరీ చితకబాదారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఏదోవిధంగా భయభ్రాంతులకు గురిచేసి, గ్రామం నుంచి తరిమేయడానికి పెద్దలు పన్నిన పన్నాగమే ఇదంతా అని దళితులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో గతంలో తమపై పలుమార్లు తప్పుడు కేసులు కూడా పెట్టడం జరిగిందని తెలిపారు. కాగా బాధిత దళితులకు అండగా నిలిచేందుకు వామపక్ష పార్టీలు ముందుకు వచ్చాయి. పెత్తందారుల చేతిలో దెబ్బలు తిని ఆస్పత్రి పాలైన దళితులను సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వర్రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ శనివారం జిల్లా కేంద్రాసుపత్రిలో పరామర్శించారు. అలాగే మోదవలస వెళ్లి దళితవాడలోని దళితులను ఓదార్చారు. వారికి అన్నివిధాలా అండదండలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీని కలిసి, దళితులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండు చేశారు. అధికారులు ఈ వ్యవహారంలో ఉపేక్షిస్తే రాష్ట్రస్థాయి ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

వికాసానికి విరుద్ధంగా సర్కారు నీతి

నోట్ల రద్దు, జీఎస్‌టీ సామాన్యుల నడ్డి విరిచాయి

ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం సహేతుకం కాదు

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్



విశాఖ ఉక్కు హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

విశాలాంధ్ర – గాజువాక : కేంద్రంలో మోడీ సర్కారు వికాసానికి విరుద్ధమైన నీతిని అనుసరిస్తోందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ఆక్షేపించారు. నోట్ల రద్దు, జీఎస్‌టీ వంటి సంస్కరణలు సామాన్యుల నడ్డి విరిచాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఎంత మాత్రం సహేతుకం కాదని ఖండించారు. రాజకీయ కోణంలో విరుద్ధ నీతిపై ఏఐటీయూసీగా పోరాడతామని స్పష్టం చేశారు. శనివారం విశాఖ ఉక్కు కర్మాగారానికి వచ్చిన ఆమె సాయంత్రం ఉక్కు హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లాభనష్టాలు అని కాకుండా బడా పెట్టుబడి దారులకు తొత్తులుగా దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమలను పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అత్యంత ప్రతిభావంతంగా నడుస్తున్న బీఎస్ఎన్ఎల్ సంస్థను సంబంధిత మంత్రి అందులో పని చేస్తున్న దాదాపు లక్షా యాభై వేల మందిని ఇంటికి పంపే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. సెయిల్, ఆర్ఐఎన్ఎల్‌లో కూడా అవే పద్ధతులు అమలు చేస్తున్నారని, ఇది సరికాదని ఖండించారు. ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సహా కార్మికులకు పింఛను సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. బ్యాంకులు, ఎల్ఐసీ తదితర సంస్థలను పబ్లిక్ సెక్టార్ యూనిట్లుగానే కొనసాగించాలన్నారు. ప్రతికూలతల వైపు అడుగులేస్తే కార్మిక వర్గం విరుచుకు పడుతుందని ఆమె హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షుడు జి.బోసుబాబు, నాయకులు ఎన్.మిశ్ర, కేఎస్ఎన్ రావు, జె.రామకృష్ణ, జి.సోమన్న, కె.రాజబాబు, మసేన్‌రావు, దేముడు తదితరులు పాల్గొన్నారు.




ఒకప్పుడు వేగం.. ఇప్పుడు కర్ర సాయం

కొలంబో: జయసూర్య ఇది పేరు కాదు పరుగుల వెల్లువ. ఓపెనర్‌గా జయసూర్య బ్యాట్ ఎత్తాడంటే ఫోర్లు, సిక్సర్లు వర్షంలా కురుస్తాయి. పిచ్‌లో విద్యుత్‌లా మెరుస్తూ.. పరుగులు పరుస్తూ శ్రీలంక జట్టు విజయానికి బాటలు వేసి, టీంకు ప్రాణం పోసిన మెగా స్పోర్ట్స్‌మేన్. 48 ఏళ్ల జయ సూర్య 2011తో రిటైర్ అయినా ఆ క్రీడపై ఆసక్తి చంపుకోలేదు. అయితే ఇప్పుడు పరిస్థితి అలా లేదు.. జీవితం ఎవ్వరిని.. ఎప్పుడు ఎలా విసిరిగా డుతుందో ఎవరికీ తెలియదు. జయసూర్యకు అలాగే జరిగింది. గ్రౌండ్‌లో మెరుపు వేగంతో కదిలే అతడి ఉత్సాహం ఒక్కసారి ఆగిపోయింది. పరుగుల తుపాను లాంటి జయసూర్య ఇవాళ కర్ర సాయం లేకపోతే అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి వచ్చింది. ఇది ఇప్పటి సంగతి కాదు... ఏడాదిగా జయ సూర్య జీవితం ఇలానే సాగుతోంది. అతడి విధిరాత చూసి క్రికెట్ అభిమానులు కన్నీరుపెడు తున్నారు. ఏడాది క్రితం మోకాలి గాయంతో బాధపడుతున్న జయ సూర్య ఆపరేషన్ చేయించుకోగా... అది వికటించింది. ఇది నానాటికీ తీవ్రమవుతుం డటంతో ప్రస్తుతం జయసూర్య నడవలేని స్థితికి వచ్చాడు. చివరకు గత్యంతరం లేక ఆస్ట్రేలి యాకు చికిత్స కోసం వెళుతున్నట్లు సమాచారం. అయితే అక్కడ ఆపరేషన్ చేయించుకున్న తర్వాత మూడు నెలలు నడవకూడదని వైద్యులు తెలిపారు. చిరుత వేగంతో పరిగెత్తే జయసూర్య వికలాం గుడిలా కర్ర సాయం లేనిదే నడవలేకపోవడంతో ఆయనపై క్రికెట్ అభిమానులు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. జయసూర్య త్వరగా కోలుకోవాలని వాళ్లు ఆశిస్తున్నారు.

పాండ్య పటాకా



- తృటిలో చేజారిన సెంచరీ
- దక్షిణాఫ్రికా ధాటికి టాప్ ఆర్డర్ విలవిల
- ఎదురొడ్డి నిలిచిన హార్దిక్
- ఫిలాండర్, రబదకు 3 వికెట్లు


దక్షిణాఫ్రికా ధాటికి టీమిండియా టాప్ ఆర్డర్ విలవిలలాడింది. మహామహులు, అనుభవజ్ఞులైన బ్యాట్స్‌మెన్ పెవిలియన్ ముఖం పడుతున్న సమయంలో ఫాలోఆన్‌లో పడుతుందేమో అనుకున్న జట్టును ఆదుకున్నాడు హార్దిక్‌పాండ్య. వీరోచితమైన బ్యాటింగ్‌తో వికెట్లముందు అడ్డుగోడగా నిలబడి ఫాలోఆన్ ప్రమాదం నుంచి బయట పడేశాడు. 77 పరుగుల వెనుకబడి భారత్ ఇన్నింగ్స్ ముగించింది.

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 209 పరుగులకే ఆలౌట్ అయి.. 77 పరుగుల వెనుకంజలో ఇన్నింగ్స్ ముగించింది. సఫారీగడ్డపై ఆదేశ బౌలర్ల ధాటికి భారత టాప్ ఆర్డర్ ఆటగాళ్లు విఫలమైనా యువ ఆటగాడు హార్దిక్ పాండ్యా మాత్రం చెలరేగిపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో సఫారీలు ముందుంచిన ఆధిక్యాన్ని ఛేదించే క్రమంలో భారత బ్యాట్‌మెన్లు తడబడినప్పటికీ పాండ్యా మాత్రం సఫారీలకు ధీటుగా సమాధానం చెప్పాడు. స్టెయిన్, రబాడా, మోర్కల్ అనే తేడా లేకుండా అందరి బౌలింగ్‌లోనూ మెరుపులు మెరిపించాడు. మరోవైపు బౌలర్ భువనేశ్వర్ కూడా పాండ్యాకు మద్దతుగా నిలిచి వికెట్ కాపాడుకుంటూ వచ్చాడు. వీరిద్దరు కలిసి 99 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో పది వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసింది. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌ని 77 పరుగుల వెనుకంజలో ఉంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేసింది. ఈ నేపథ్యంలో బరిలోకి దిగిన భారత్ తొలి రోజే మూడు వికెట్లు సమర్పించుకుంది. రెండో రోజు 28/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్ ప్రారంభించిన టీం ఇండియా బ్యాట్స్‌మెన్ సఫారీ బౌలర్లు పరుగులు చేయకుండా కట్టడి చేశారు. రెండో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన రోహిత్‌శర్మ(11), పుజారా(26)లు సఫారీల బౌలింగ్‌లో పరుగులు రాబట్టలేకపోయారు. లంచ్ విరామానికి ముందే రోహిత్ ఎల్‌బీడబ్ల్యూగా పెవిలియన్ బాటపట్టాడు. దీంతో భారత జట్టు లంచ్ బ్రేక్ సమయానికి 4 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది. లంచ్ బ్రేక్ అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన భారత్‌కు ప్రారంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. క్రీజ్‌లో నిలకడగా ఆడుతున్న ఆటగాడు పుజారా ఫిలాండర్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. వెనువెంటనే మరో ఆటగాడు అశ్విన్ కూడా ఫిలాండర్‌కే తన వికెట్ సమర్పించుకున్నారు.

చెలరేగిన పాండ్య

ఈ నేపథ్యంలో బ్యాటింగ్‌కు వచ్చిన పాండ్యా సఫారీలకు ధీటుగా నిలబడ్డాడు. భువనేశ్వర్‌తో కలిసి 99 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసిన పాండ్యా 95 బంతుల్లో 14 ఫోర్లు, ఒక సిక్స్‌తో 93 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన బుమ్రా కూడా కాసేపటికే పెవిలియన్ బాటపట్టడంతో భారత్ 73.4 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి సఫారీలకంటే 77 పరుగుల వెనుకంజలో ఇన్నింగ్స్ ముగించింది. దక్షిణాఫ్రికా బౌలింగ్‌లో ఫిలాండర్, రబడా 3, స్టెయిన్, మోర్కెల్ తలో రెండు వికెట్లు తీశారు. కాగా రెండో ఇన్నింగ్స్ 77 పరుగుల ఆధిక్యంతో సౌతాఫ్రికా బ్యాటింగ్ ప్రారంభించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఎదురైన ఇబ్బందుల నుంచి పాఠాలు నేర్చుకున్న సఫారీలు రెండో ఇన్నింగ్స్‌లో జాగ్రత్తగా ఆడిన ఓపెనర్ల ఎల్గర్, మర్కమ్‌లను పాండ్యా పెవిలియన్ బాటపట్టిం చాడు. పాండ్య వేసిన 15వ ఓవర్ ఆఖరి బంతికి మార్కం(34) మిడ్ వికెట్ మీదుగా భారీ షాట్ ఆడేందుకు ప్రయ త్నించి భువనేశ్వర్‌కి క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. ఆ తర్వాత మళ్లీ పాండ్య బౌలిం గ్‌లో ఎల్గర్ కీపర్ సహాకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో దక్షిణా ఫ్రికా రెండోరోజు ఆటముగిసే సరికి 19 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసి 138 పరుగుల ఆధి క్యంలో ఉంది. ప్రస్తుతం క్రీజ్‌లో ఆమ్లా(0), రబాడా(2) ఉన్నారు.

డియర్ సచిన్ అంకుల్...!

న్యూఢిల్లీ: లిటిల్ మాస్టర్ సచిన్ టెండూల్కర్ దేశమంతా అభిమానులే. చిన్నారుల నుంచి పెద్ద వాళ్ల వరకూ సచిన్‌ను ఆరాధిస్తూనే ఉంటారు. ఎన్ని కొత్త తరాలు వచ్చినా సచిన్‌కు ఉన్న క్రేజ్ దేశంలో మరో క్రీడాకారుడికి ఉండదు. తాజాగా ఓ బుల్లి అభిమాని సచిన్‌కు లేఖ రాశాడు. ఈ బుడతడి లేఖను సచిన్ ట్విటర్ ద్వారా పంచుకున్నారు. రంగు రంగుల పెన్నులతో లేఖ రాసిన బుడతడు ఓ చిత్రాన్ని కూడా వేశాడు. ప్రస్తుతం ఈ లేఖ నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. ఇంతకీ ఆ చిన్నారి లేఖలో ఏమని పేర్కొన్నాడో చూద్దాం. 'డియర్ సచిన్ అంకుల్. ఈ మధ్యే 'సచిన్-ఏ బిలియన్ డ్రీమ్స్' సినిమా చూశాను. సినిమా చూస్తున్నంతసేపు చాలా ఎంజాయ్ చేశాను. నువ్వు నాకు మాత్రమే కాదు యావత్తు ప్రపంచానికి స్ఫూర్తి. బాగా ఆడి ఏదో ఒక రోజు భారత్‌కు ట్రోఫీ అందించే స్థాయికి ఎదుగుతాను. అంకుల్ సచిన్.. నీ సంతకంతో కూడిన బ్యాట్‌ను అందజేసినందుకు ధన్యవాదాలు. ఇది నాకో గొప్ప బహుమతి' అంటూ అర్మాన్ అనే చిన్నారి ఈ లేఖ రాశాడు. దీన్ని ట్విటర్ ద్వారా పంచుకున్న సచిన్.. 'బాగా కష్టపడు. నీ కలలు నిజం కావాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నాడు. సచిన్‌కు చిన్నారులు లేఖలు రాయడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ పలువురు ఇలా లేఖలు రాస్తే వాటిని సచిన్ ట్విటర్ ద్వారా పంచుకున్న సంగతి తెలిసిందే.



మీ బహుమతులు మాకొద్దు

రోహ్‌తక్: గత ఏడాది నవంబర్‌లో జరిగిన నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో గెలిచిన వారికి హర్యానా ప్రభుత్వం ఆవులను బహుమతులుగా ఇచ్చిన విషయం తెలిసిందే. ఆరుగురు మహిళా బాక్సింగ్ విజేతలకు ఈ బహుమతులు అందాయి. అయితే.. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన బహుమతులు ముగ్గురు బాక్సర్లు వెనక్కి ఇచ్చేశారు. ఆవులు పాలు ఇవ్వడం లేదని, పైగా అవి కొమ్ములతో దాడి చేస్తున్నాయని మహిళా బాక్సర్లు అంటున్నారు. 'మా అమ్మ ఐదు రోజుల పాటు ఆవుకు సేవ చేసింది. కానీ అవి పాలు ఇవ్వలేదు.. పైగా మా అమ్మని మూడు సార్లు కాళ్లతో తన్నాయి. దీంతో ఆమె తీవ్రంగా గాయాలపాలైంది. అందుకే వాటిని వెంటనే తిరిగి ఇచ్చేస్తున్నా. మాకు ఉన్న గేదెలతోనే మేము సంతోషంగా ఉన్నాం' అని రోహ్‌తక్‌కు చెందిన బాక్సర్ జ్యోతి గులియా చెప్పుకొచ్చారు. గతేడాది నవంబర్ 19 నుంచి 26 వరకు గువాహతిలో జరిగిన నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జ్యోతి విజేతగా నిలిచింది. నీతు గంఘాస్, భివానీకి చెందిన శశికుమార్, హిసార్‌కు చెందిన జ్యోతి, శశి చోప్రా తమ తమ విభాగాల్లో స్వర్ణపతకాలను గెలుచుకున్నారు. వీరిలో జ్యోతి, నీతు, సాక్షి తమకు హర్యానా ప్రభుత్వం బహుమతులుగా ఇచ్చిన ఆవులను వెనక్కి తిరిగి ఇచ్చేశారు. ఆ ఆవులు పాలు ఇవ్వడం లేదని, వాటి కొమ్ములతో తమ కుటుంబసభ్యులను గాయపరుస్తున్నాయని వారు ఫిర్యాదు చేస్తున్నారు.



ఉస్మాన్ ఖాజా సెంచరీ

సిడ్నీ: యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇక్కడ ఇంగ్లండ్‌తో జరుగుతున్న చివరిదైన ఐదో టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు దిశగా దూసుకుపోతోంది. మూడో రోజు ఆట ముగిసేసమయానికి ఆసీస్ తన తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 479 పరుగులు చేసింది. 193/2 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. మరో రెండు వికెట్లు కోల్పోయి 286 పరుగులు చేసింది. దాంతో ఆసీస్‌కు 133 పరుగుల తొలి ఇన్నింగ్స్ లభించింది. ఈ రోజు ఆటలో ఓవర్‌నైట్ ఆటగాడు ఉస్మాన్ ఖాజా(171, 381 బంతుల్లో 18 ఫోర్లు, 1 సిక్సర్) భారీ శతకం సాధించాడు. 91 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో ఇన్నింగ్స్ ఆరంభించిన ఖాజా.. మరో 80 పరుగుల్ని పిండుకున్నాడు. కెప్టెన్ స్టీవ్ స్మిత్‌తో కలిసి 188 పరుగుల భాగస్వామ్యాన్ని సాధించాడు. అయితే మరో ఓవర్ నైట్ ఆటగాడు స్మిత్(83) మూడో వికెట్‌గా అవుటైన తరువాత ఖాజా మరింత నిలకడగా ఆడాడు. షాన్ మార్ష్(98 బ్యాటింగ్, 207 బంతుల్లో 10 ఫోర్లు)తో కలిసి 101 పరుగుల్ని జత చేసిన తరువాత ఖాజా నాల్గో వికెట్‌గా అవుటయ్యాడు. ఆట ముగిసే సమయానికి షాన్ మార్ష్‌కు జతగా మిచెల్ మార్ష్(63 బ్యాటింగ్, 87 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లు) క్రీజ్‌లో ఉన్నాడు. ఇంగ్లండ్ తన తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.



రాష్ట్ర మహాసభల కోసం చంద్రాల ఈశ్వరయ్య, చంద్రలకు 60 వేల విరాళం అందజేస్తున్న హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు మహబూబ్ బాషా, కేసీ బాదుల్లా, మాబు, రంగనాయకులు

సీపీసీ ప్రతినిధి బృందంతో రాహుల్ భేటీ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరిపారు. 'చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మెంగ్ జియాంగ్ ఫెంగ్ నాయకత్వంలోని సీపీసీ ప్రతినిధి బృం దంతో భేటీ అయ్యాను. మా మధ్య అర్థవంతమైన చర్చలు జరిగాయి' అని రాహుల్ ట్వీట్ చేశారు. సీపీసీ ప్రతినిధి బృందంతో సమావేశమైన రెండు ఫొటోలను కూడా రాహుల్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆనందశర్మ సమావేశంలో పాల్గొ న్నారు. సీపీసీ ప్రతినిధి బృందం శుక్రవారం కేంద్ర విదేశాంగశాఖ సహాయమంత్రి వీకే సింగ్ తోనూ సమావేశ మైంది. భారత్, చైనా మధ్య డొక్లాం ప్రతిష్టంభన సమయంలో రాహుల్‌గాంధీ ఢిల్లీలో చైనా రాయబారిని కలవడం పెద్ద వివాదాస్పదమైన విషయం విదితమే. సంక్లిష్ట సమస్యలపై చర్చలు జరపడం తన బాధ్యతని ఆనాడు రాహుల్‌గాంధీ ఘాటుగానే స్పందిం చారు. 'చైనా రాయబారి, జాతీయ భద్రతా మాజీ సలహాదారుడు, ఈశాన్య రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు, భూటాన్ రాయబారితో నేను సమావేశమ య్యాను' అని రాహుల్ ట్వీట్ చేశారు.

రసాభసగా సీఆర్డీఏ సదస్సు

- పాలవాగు పై రాజధాని రైతుల అభ్యంతరం



విశాలాంధ్ర అమరావతి: రాజధాని రైతులలో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. అధికారుల తీరుపై ఆగ్రహం పెల్లు బికింది. ఇష్టానుసారం చేస్తున్న నిర్ణయాలతో తాము ఇబ్బందుల పాలవుతున్నామన్నారు. ఎన్ని సార్లు విన్నవించుకున్న పద్దతి మార్చుకోరా అంటూ మండిపడ్డారు. రాజధాని గ్రామాల్లో సీఆర్డీఏ ఆధ్వర్యంలో వరద నియంత్రణ చర్యలకు సంబంధించిన సామాజిక ప్రభావ అంచనా-పునరావాస కార్యాచరణ ప్రణాళిక, ఇతర అం శాలపై అభిప్రాయ సేకరణ సదస్సులు నిర్వహిం చారు. మందడం, నిరుకొండ, తుళ్లూరు, కృష్ణయ పాలెం గ్రామాల్లో ఈ సదస్సులు జరి గాయి. అయితే అన్ని చోట్లా సీఆర్డీఏ అధికా రులపై రైతులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఒక్క పని సక్రమంగా చేయట్లేదని, రైతుల్ని సంప్రదించకుండానే ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటున్నారని రైతులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మందడంలో జరిగిన సదస్సులో రైతులు పాలవాగు విషయమై అధి కారుల తీరును తప్పుబట్టారు. అధికారులు, రైతులకు నడుమ వాదోపవాదాలు చోటుచేసు కున్నాయి. ఒకానొక దశలో తోపులాటలు జర గటంతో వివాదం ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా గ్రామ రైతు మల్లెల హరీంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ కృష్ణా నది వద్దున ఉన్న తమ గ్రామాల్లో పాలవాగు ప్రముఖ పాత్ర పోషి స్తుందని అన్నారు. రాజధాని నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. రాయపూడి రైతులు భూములు ఇస్తున్న తీసుకోకపోవటంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మేము భూములు ఇస్తున్న ఎందుకు తీసుకోరని ప్రశ్నిం చారు. ఇదే క్రమంలో కొండవీటివాగు సమస్య తుటికాడా తొలగింపు వంటి ప్రశ్నలుతో అధికా రుల్ని నిలదీశారు. అయితే పాలవాగు పెద్ద కూరపాడు నుంచి రాయపుడి వరకు ప్రవహిం చగా 1300 ఎకరాలు పాలవాగు కింద సాగవు తున్నాయి. సీఆర్డీఏ అధికార్లు సాధన, స్ట్రాటజీ డైరక్టర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయికతో సమాజాభివృద్ధి

వక్తల ఉద్ఘాటన



విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాలకతీతంగా నిర్వహించే ఆత్మీయ కలయికలు సమాజాభివృద్ధికి దోహద పడడమేగాక, మార్పునకు శ్రీకారం చుడతాయని వక్తలు పేర్కొన్నారు. సమతాపార్టీ మాజీ అధ్యక్షులు వీవీ కృష్ణా రావు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రతి ఏటా అనవాయితీగా నిర్వహించే 'ఆత్మీయ కలయిక' కార్య క్రమాన్ని స్థానిక సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, సీపీఐ జాతీయ కార్య దర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ పుష్పరాజ్, మాజీ ఎమ్మెల్యేలు కె.సుబ్బరాజు, మల్లాది విష్ణు, సీనియర్ సంపాదకులు సి. రాఘవాచారి, సీనియర్ న్యాయవాది కర్నాటి రామమోహన రావు, ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమ్‌నాథ్, గాంధీ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చిట్టియ్య, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ, కాట్రగడ్డ బాబు, బీజేపీ నాయకులు బి. సాయిప్రసాద్ వివిధ రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన అనేకమంది నేతలు పాల్గొని ప్రసంగిం చారు. దేవినేని ఉమా మాట్లా డుతూ సిద్ధాంతాలు వేరైనా అంతిమంగా రాజకీయపార్టీల ఆశయాలన్నీ ఒక్కటేనన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, సమాజాభివృద్ధిలో అందరూ పరస్పర సహకరించుకున్నప్పుడే సత్వర అభివృద్ధి సాధ్యపడు తుందన్నారు. రాష్ట్ర విభజన వల్ల ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని, ఈనేపథ్యంలో అందరం సమిష్టిగా పనిచేసిన ప్పుడే పూర్వ వైభవం వస్తుందన్నారు. రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు జీవనాడి అన్నారు. దానిని నిర్దేశించిన లక్ష్యానికి పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి తీవ్ర కృషి చేస్తున్నారని, కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పెండింగ్‌లో వున్న సాగునీటి ప్రాజెక్టులన్నీ ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కె.నారా యణ మాట్లాడుతూ ప్రజా స్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలది కీలక భూమిక అన్నారు. అటువంటి వ్యవస్థను ఎల్లవేళలా కాపాడుకుంటూ దానికున్న ఔన్నత్యాన్ని పెంపొం దించుకునే బాధ్యత మనం దరిపై వుందన్నారు. కొందరు రాజకీయ వ్యవస్థ, సమాజం కుళ్లిపోయిందని బాధపడుతూ పనిచేసేవారిని కూడా నిరు త్సాహపరిచే పద్ధతిలో వ్యవ హరిస్తుంటారని, అది సరైంది కాదన్నారు. రాజకీయాల్లో విలువలు గణనీయంగా దిగజారి పోతున్న విషయం వాస్తవమన్నారు. విలువలకు కట్టుబడి పని చేయడంతో పాటు, దిగజారుతున్న వ్యవస్థను కాపాడుకునేం దుకు కూడా అనేకమంది వున్నారన్న విషయాన్ని గ్రహించా లన్నారు. ప్రతి దానికి ఒక ప్రత్యామ్నాయం వుంటుందని, రాజకీయాల్లో దిగజారుతున్న విలువల రక్షణకు కూడా అందరం ప్రయత్నించాలన్నారు. ఇందుకోసం వ్యవస్థ మార్పు కోసం తపన పడే కృష్ణారావు లాంటివారు నిర్వహించే ఆత్మీయ కలయికలు దోహదపడతాయన్నారు. హైకోర్టు న్యాయవాది రవితేజ అతిథులను ఆహ్వానించగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, సీపీఐ ఎంఎల్ నాయకులు ముప్పాళ్ల భార్గవ్ శ్రీ, లిబరేషన్ నాయకులు హరినాథ్, జనసాహితి నాయకులు దివికుమార్, అరసం నాయకులు కొండపల్లి మాధవరావు, రఫీ తదితరులు ప్రసం గించారు. తొలుత కళాశాల ఆడిటోరియం ఆవరణలో గంగి రెద్దులతో విన్యాసాలు, సంప్రదాయ నృత్యాలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రజానాట్య మండలి గాయకులు ఆర్. పిచ్చయ్య అభ్యుదయ గేయాలను ఆలపించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.